



అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వర్షం కురిస్తే..గుండెల్లో గుబులు

ఒక మోస్తరు వర్షం కురిస్తే చాలు రాయచోటి పట్టణంలోని కొత్తపల్లెవాసుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. అసంపూర్తి కాలువల నిర్మాణం వారికి సమస్యను తెచ్చిపెడుతోంది. పట్టణంలోని వర్షపునీరంతా పెద్ద ఎత్తున వంకలా ప్రవహిస్తూ తమ వీధులను జలమయం చేస్తుండడంతో వారు తల్లడిల్లిపోతున్నారు. తరచూ తమ ఇళ్లలోకి ఒక్కసారిగా చొచ్చుకువచ్చే వర్షపునీటిని ఎలా అడ్డుకోవాలో తెలియక అల్లాడిపోతున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు అలసత్వాన్ని వీడకపోతుండడంతో దిక్కుతోచక అల్లాడుతున్నారు.

- అసంపూర్తి కాలువలతో అవస్థలు
- జలమయమవుతున్న కొత్తపల్లె వీధులు
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రాయచోటి పట్టణం మధ్యలో ఒకవైపు నుండి కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి, మరోవైపు రాజంపేట-టుంకూరు రాష్ట్ర రహదారులు వెళ్తున్నాయి. దశాబ్దం కిందట జాతీయ రహదారిని అధికారులు సిమెంటురోడ్డుగా మార్చారు. రోడ్డుకిరువైపులా వర్షపునీటి కాలువలను నిర్మించి పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా వదలేశారు. 2023లో రాజంపేట-టుంకూరు రహదారిని డబుల్ సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపుల వర్షపు నీటికాలువను కొన్నిచోట్ల అసంపూర్తిగా వదలేశారు. కొందరు గృహ యజమానుల అభ్యంతరాలు, రాజకీయ ఒత్తిళ్ళు తీవ్రతరం కావడంతో సదరు కాంట్రాక్టర్లు పనులను నిలిపేశారు. దీంతో వర్షం కురిస్తే చాలు జాతీయరహదారితో పాటు పై ప్రాంతాల్లోని వర్షపునీరంతా ఠాణావద్ద గల పండ్ల మండీల వద్ద నుంచి లోతట్టు ప్రాంతమైన కొత్తపల్లె వీధులపై పడుతున్నాయి. చిన్నపాటి కాలువ కావడం, పైభాగం నుండి వేగంగా నీరు ప్రవహిస్తుండడంతో కొత్తపల్లెలోని కొన్ని వీధులు వర్షపునీటితో వాగులు, వంకలను తలపిస్తున్నాయి. ఫలితంగా దాదా సాహెబ్‌వీధి, కోనేరువీధి, మేదరవీధి, ఫైర్‌స్టేషన్‌వీధి, ఎస్‌ఆర్‌ఎంటి వెనుకవైపుగల వీధులు జలమయమవు తున్నాయి. ఫైర్‌స్టేషన్ వీధిలో వర్షపునీరు వెళ్లే మార్గం లేదు. ఫలితంగా వర్షపునీరు ఇళ్లలోకి తరచూ చొచ్చుకు రావడంతో వస్తువులు పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అర్ధరాత్రి వర్షం వస్తే ఇళ్లలోకి వచ్చిన నీటిని ఎత్తిబయట పోస్తూ జాగారం చేయాల్సిందే. కొన్ని సందర్భాలలో నీట వేగానికి స్కూటర్లు సైతం కొట్టుకుపోయి పాడైపోయిన సంఘటనలున్నాయి. అసంపూర్తి కాలువలను వెంటనే పూర్తిచేయించి తమకు వర్షపు నీటి ఇక్కట్లను తప్పించాలంటూ కొత్తపల్లె ప్రజలు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఎలాంటి ప్రయో జనం లేదు. దీంతో ఈ ప్రాంతీయులు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేశారు. అప్పట్లో కంటితుడుపుగా హామీ ఇచ్చిన నేతలు తర్వాత పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలకు వర్షపునీటి ఇక్కట్లు తప్పడం లేదు. కొందరు బాధ భరించలేక తమ స్వంత ఇళ్లను సైతం ఖాళీచేసి ఇతర వీధులకు నివాసాలు వెళ్లారు. మరికొందరు సొంత ఇంటిని వదిలి వెళ్లలేక సమస్యను భరించలేక తల్లడిల్లుతున్నారు. అసంపూర్తి నిర్మాణాలకు కారకులైన అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లపై ఆగ్రహిస్తూ కాలం వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి తమను కాపాడాలంటూ వేడుకుంటున్నారు.



కొత్తపల్లె వీధులలో వంకలా ప్రవహిస్తున్న వర్షపునీరు (ఫైల్ ఫోటో)

వర్షం కురుస్తోందంటే భయమేస్తోంది

వర్షం కురుస్తోందంటే చాలు భయం మొదలువుతోంది. పైభాగంలోని వర్షపునీరంతా ఎక్కడ ఇళ్లలోకి వస్తాయో అని ఆందోళన చెందుతున్నాం. ఇళ్లల్లో బాడుగకు ఉన్న వారు కూడా సమస్యతో ఇళ్లు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.



- కమాల్, మేదరవీధి, రాయచోటి.

ఎవరూ పట్టించుకోవడం లేదు

మోస్తరు వర్షం కురిస్తే వర్షపునీరంతా ఇళ్లలోకి చొచ్చుకు వస్తోంది. సమస్యను ఎన్ని పర్యాయాలు అధికారులు, కౌన్సిలర్లు చెప్పుకున్నా వారు పట్టించుకోవడం లేదు. సొంత ఇల్లు కావడంతో వదలి వెళ్ళలేక, ఇక్కడ ఉండలేక అల్లాడుతున్నాం.



- షఫీవుల్లాఖాన్, దాదేసాహెబ్‌వీధి, రాయచోటి.

సొంత ఇంటిని ఖాళీచేసేశాం

పెద్ద వర్షం కురిస్తే వర్షపు నీరంతా ఇంట్లోకి ఎక్కడ వచ్చేస్తాయోనంటూ భయపడి బతకాల్సి వచ్చేది. సమస్యను భరించలేక కొద్దిరోజుల కిందటే ఇల్లు ఖాళీచేసి మరోవీధికి నివాసం వచ్చాం. ఇప్పటికైనా అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించి మమ్మల్ని ఆదుకోవాలి.



- అల్‌దోహన్‌ఖాన్, ఫైర్‌స్టేషన్ వీధి, రాయచోటి.

సమస్య పరిష్కారం కోసం పోరాటం

గతంలో సమస్య పరిష్కారం కోసం పోరాటం చేశాం. నాయకులు తప్పదోవపట్టించారు. ప్రధాన రహదారులలోని పెండింగ్ కాలువల పనులు వెంటనే పూర్తిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేనిపక్షంలో కొత్తపల్లె ప్రజలను కూడగట్టి మరోమారు పోరాటం చేస్తాం.



- శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్.

ప్రతి అర్జీకీ జవాబుదారీతనంగా పనిచేయాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకీ అధికారులు, నాయకులు జవాబు దారితనంగా పని చేయాలని రవాణా, క్రీడ, యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి విద్యుత్ ,రెవెన్యూ అధికారులకు ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్తును అందించి, రెవెన్యూ సమస్యలను తొందరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని వరిగ రోడ్‌లో నూతనంగా వెలిసిన శ్రీ దేవకి యశోద కృష్ణ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా ఉద్యోగులకు ఉచిత బస్సు హర్షణీయం

స్త్రీ శక్తి పథకం కింద మహిళా ఉద్యోగులకూ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం విధి విధానాలను తీసుకురావడం పట్ల నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా స్త్రీ శక్తి పథకం అమలు చేయడమే కాకుండా ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కూడా వర్తించే విధంగా నియమ నిబంధనలు తయారుచేసి అమలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్‌ల సమస్యలపైనా, 2025 సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయుల స్థానాలలో డిఎస్‌సి ఉపాధ్యాయులను నియమించేలా విద్యా శాఖ మంత్రి లోకేష్‌తో చర్చించి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా అలాంటి ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తా నన్నారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు మడితాడి నరసింహారెడ్డి, బచ్చల శ్రీని వాసులు, కొండూరు మురళీ మోహన్ రాజు, వంగిమళ్ళ వేణుగోపాలరావు, కదిరి హరినాథ్, చిన్న రెడ్డయ్య రాజు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న కూటమి నాయకులు

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి పట్టణ మున్సిపల్ కమిషనర్ జి.రవి అన్నారు. శనివారం కూరగాయల మార్కెట్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల మార్కెట్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విధిగా దుకాణ దారులు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకొని చెత్తాచెదరాన్ని వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే అధిక మొత్తంలో జరిమానాలు విధించడమే కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు మార్కెట్‌కు వచ్చినప్పుడు విధిగా గుడ్డ సంచి లేదా బ్యాగ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాపారులతో సమావేశమై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అయన వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాపారులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి

'మిట్స్'లో కొత్త నియామకాలు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ యూని వర్సిటీలో కొత్త నియామకాలను చేపట్టినట్లు యూనివర్సిటీ ఛాన్సలర్, వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ (ఇన్‌ఛార్జ్), అదనపు రిజిస్ట్రార్ (ఆర్థిక, వ్యయం)గా మార్పూరి ప్రతిభ, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ (ఇన్‌ఛార్జ్)గా డాక్టర్ సాయి కుమార్ నియమి తులయ్యారని తెలిపారు. కొత్తగా నియమితులైన వారికి ఎన్.విజయ భాస్కర్ చౌదరి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మిట్స్ డీమ్డ్ విశ్వవిద్యాలయ ప్రో-ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, యాక్టింగ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.యువరాజ్ పాల్గొన్నారు.



నియామకపత్రాలు ఇస్తున్న విజయభాస్కర్ చౌదరి

విఆర్‌ఎలకు జీతాలు పెంచకపోతే ఉద్యమిస్తాం

- రాష్ట్ర అధ్యక్షులు బందగి సాహెబ్ హెచ్చరిక

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ఏడేళ్లుగా జీతాలు పెంచలేదని, వెంటనే విఆర్‌ఎలకు జీతాలు పెంచకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని విఆర్‌ఎ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బందగి సాహెబ్ హెచ్చరించారు. విఆర్‌ఎ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర అధ్యక్షతన కడప జిల్లా విస్తృత సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఏడేళ్లుగా విఆర్ ఎలకు వేతనాలు పెరగకపోవడం దారుణ మన్నారు. గత ప్రభుత్వం వేతనాలు పెంచలే దన్నారు. పెంచకపోగా, డిఎలు కూడా కట్ చేయడం దారుణ మన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అయినప్పటికీ వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పట్టుగొమ్మలుగా విఆర్‌ఎలు పనిచేస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి వేతనాలు పెంచక పోవడం బాధాకరమని తెలిపారు. ఈ నెలాఖరులో రాష్ట్రా వ్యాప్తంగా రిలే దీక్షలు, చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహి స్తామని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో 36 మండలాల్లో గ్రామలలో ప్రజాసమస్యలు ప్రభుత్వ అధికారులకు తీసు కెళ్లడంలో విఆర్‌ఎల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అర్హులైన వారికి విఆర్ఒ, అటెండర్, వాచ్ మెన్, డ్రైవర్స్ వంటి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. మినిమం రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినీలుగా గుర్తించి, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పే స్కేల్ అమలు చేయాలన్నారు. తెలంగాణ లాగా ఎపి లోనూ విఆర్‌ఎలందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా జిల్లాలో ఈనెల 18న కలెక్టర్ కి వినతి పత్రం ఇవాలన్నారు. 19, 20న మండలాల్లో తహశీల్దార్లకు వినతి పత్రం ఇవ్వాలని పిలుపునిచ్చారు. విస్తృత సమావేశంలో విఆర్‌ఎ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, జిల్లా కోశాధికారి అశోక్, నారాయణ, నర్సింహులు, కిషోర్, మునయ్య, వెంకటసుబ్బయ్య, బాష, రవి, మీసాల ఓబులేసు, రమణ వెంకటేశు హరి, నిత్య, గంగయ్య, గంగులయ్య, రమణయ్య, రాజు, గురు మోహన్, సుబ్బమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బందగి సాహెబ్

ఇష్టారాజ్యంగా జిల్లాలను మారుస్తున్నారు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : చంద్రబాబు తనదైన ముద్రను రాష్ట్రంపై వేసేందుకు జిల్లాల విభజన కార్యక్రమాన్ని చేపట్టారని వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి, అన్నమయ్య జిల్లా సాధన కమిటీ ఉపాధ్యక్షులు విజయభాస్కర్ విమర్శించారు. శనివారం రాయచోటిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రజలు జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో రకాలుగా పోరాడడం ద్వారా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని సాధించుకున్నామేని చెప్పారు. ప్రజల ఆకాంక్షల మేరకు అప్పటి ప్రభుత్వం రాయచోటి జిల్లా కేంద్రంగా ప్రకటించిందని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సిఎం చంద్ర బాబు తమపార్టీ అధికారంలోకి వచ్చిన్నప్పటికి రాయచోటినే జిల్లా కేంద్రంగా ఉంచుతామంటూ హామీ ఇచ్చారన్నారు. కాగా మారిన రాజకీయ పరిస్థితులను నేపథ్యంలో చంద్రబాబు మాట తప్పి జిల్లా కేంద్రాన్ని మారుస్తారని రాయచోటి ప్రాంతీయులు భయపడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో విభజనలో భాగంగా మార్పులు చేర్పులు చేయడం ద్వారా రాష్ట్రంపై తనదైన ముద్రను వేసేందుకు చంద్రబాబు తాపత్రయపడుతు న్నారన్నారు. రాయచోటి ప్రజల ప్రతినిధిగా అసెంబ్లీకి ఎన్నికై రాష్ట్ర మంత్రిగా కొనసా గుతున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కేంద్రం రాయచోటి నుండి తరలి పోకుండా చంద్రబాబుపై ఒత్తిడి తీసుకురావాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. సిఎం చంద్రబాబు సైతం స్పందించి రాయచోటి నుండి అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని తరలించబోమంటూ వెంటనే ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు.

అప్రజాస్వామికం!

ప్రజా'దృష్టి'

'అనైతిక పద్ధతుల్లో గెలవడం కన్నా సరైన పద్ధతిలో పోటీ చేసి ఓడిపోవడం మేలనే' హితోక్తి ఇటీవలి జడ్‌పిటిసి ఎన్నికలను గమనిస్తే గుర్తుకు వస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికలు నియంతృత్వ పోకడలను ప్రతిఫలించడం ఆందోళనకరం. వైసిపి హయాంలో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం స్థానిక సంస్థల ఎన్నికలతో పోల్చుతూ జిల్లాలోని జడ్‌పిటిసి ఎన్నికల అప్రజాస్వామిక వైఖరిని సమర్థించుకోవడం దివాళాకోరుతనమని గ్రహించాలి. ఈ నెల 12న ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహించిన ఒంటిమిట్ట, పులివెందుల ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలిస్తే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని చెప్పవచ్చు. పులివెందుల ఎన్నికను పరిశీలిస్తే ప్రత్యర్థి జడ్‌పిటిసి హేమంత్‌రెడ్డి ఓటు వేసుకోలేని వాతావరణాన్ని సృష్టించడాన్ని బట్టి ఎన్నికలు ఎంతటి లోపభూయిష్టమో తెలిసిపోయింది. ఒంటిమిట్ట ఎన్నిక విషయానికి వస్తే రాష్ట్ర మంత్రి వర్యులే ఏకంగా పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లడం, అధికార పార్టీ నాయకులు బూత్‌ల వారీగా పంచుకుని దొంగఓట్లు వేయడం మొదలుకుని ఇతర అనైతిక పద్ధతులకు పాల్పడడం ఆశ్చర్యచకితులను చేస్తోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారు అభ్యర్థులు ప్రత్యర్థి వైసిపి అభ్యర్థులను గెలవలేమని నేరుగా ఒప్పుకున్నట్లుగా బుద్ధిజీవులకు అర్థమవుతోంది. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని పెంపునకు బదులు, పతనానికి కారకులు కావడం దురదృష్టకరం. ఇటువంటి దుస్సంప్రదాయం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని గ్రహించాలి. అనైతిక పద్ధతుల ద్వారా ఎన్నికల్లో గెలవడం కంటే నామినేట్ చేసుకుంటే సరిపోతుంది కదా అనే వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా, ఇటువంటి అనైతిక పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించడం వ్యవస్థల పతనానికి సంకేతమని గ్రహించాలి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి వేదికపై సీటు వేయకపోవడంపై ఆగ్రహించిన తీరు చర్చనీయాంశంగా మారింది. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవాలకు ఆలస్యంగా హాజరు కావడం, ఆపై వేదికపై సీటును ఆశించడం, జాయింట్ కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి పద్ధతులు చులకనభావానికి దారితీశాయని చెప్పవచ్చు. పైపెచ్చు ఏడాదిగా కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాల్లో ప్రొటోకాల్ లేకపోయినప్పటికీ మేయర్‌తో సమానంగా వేదికపై సీటు వేయాలని కోరడం, సమావేశాలను సజావుగా సాగనీయకపోవడం, యుద్ధం తరహా వాతావరణాన్ని సృష్టించడం, చివరికి మేయర్‌ను పదవి నుంచి తొలగించడానికి విశ్వప్రయత్నం చేయడం అందరి మదిలో మెదిలింది. ఉన్నత పదవుల్లో ఉన్న నాయకులు అవనసర వివాదాలకు తావివ్వడం వారి పదవి, ప్రతిష్ఠలకు మచ్చని గ్రహించాలి. ప్రత్యర్థులైన మేయర్, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాలకు ప్రజల్లో సానుభూతి పెరగడానికి పరోక్షంగా దారి తీస్తోందనే సంగతిని గ్రహించాలి. ఇప్పటికే వైసిపి సర్కారు హయాంలోని అమ్మఒడి, అన్నదాత సుఖీభవ పథకంలో పేర్లు గల్లంతైన లబ్ధిదారులు, గత సర్కారు సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటున్న పరిస్థితుల్లో అధికార పార్టీ నాయకత్వం జాగ్రత్త మసలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- అక్రమార్కులపై కొరడా ఝులిపించిన రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలం, కోళ్ల బైలు పంచాయతీ లోని అమ్మచెరువు మిట్ట నందు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరఢా ఝులిపించారు. అమ్మ చెరువు మిట్టనందు కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించి, నిర్మాణాలను చేపట్టారు. సమాచారం అందుకున్న తహశీల్దారు కిషోర్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ బాలుస్వామి, వీఆర్ఓ లు తాలూకా పోలీసుల సాయంతో శనివారం అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అమ్మచెరువు మిట్ట వద్దకు వెళ్లారు. అక్కడ నిర్మాణాలు చేపడుతున్న వారిని పట్టాలు అడగ్గా తమకు సంబంధం లేనట్లు అక్రమార్కులు జారుకోవడంతో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. ఆక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు దినాల్లో అక్రమార్కులు రెచ్చిపోయి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణాలను చకచగా చేపడుతూ ప్రభుత్వ స్థలాలను కొల్లగొడుతున్నారని తెలిపారు. తాము అప్రమత్తమై సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలాలను పరిశీలించామన్నారు. ఇక్కడ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వకపోయినా, పట్టాలు జారీ జారి చేయకపోయిన, కొందరు దళారుల మాటలు నమ్మి, వారికి ఎంతో కొంత ముట్ట చెప్పి, వారు చూపించిన ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడం తాము చూశామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించామన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ఇసుక, కంకర వంటి నిర్మాణ సామాగ్రి తోలుకునేందుకు ఆశ్రయించినా, స్థలాలను చదును చేసేందుకు జెసిబిలను ఆశ్రయించిన ఎవరే కానీ వాహన దారులు ప్రభుత్వ స్థలాల్లోకి వెళ్లకూడదని తెలిపారు. అలా వెళ్లి ప్రభుత్వ స్థలాల్లో పనులు చేపడితే ట్రాక్టర్, జెసిబిలను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇదే పరిపాటిగా చేస్తుంటే వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి ఎక్కడైనా నిర్మాణాలు చేపడుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు

చైర్మన్ పదవిని వాల్మీకులకే కేటాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని వాల్మీకులకే కేటాయించాలని వాల్మీకి మహాసేన డిమాండ్ చేసింది. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ మాట్లాడుతూ రాజకీయ నాయకులు వాళ్ల స్వార్థం కోసం పలుకుబడితో, డబ్బు అహంకారంతోనో వాల్మీకుల బోయకొండ చైర్మన్ పదవిని ఇంతవరకు వాల్మీకులకు కేటాయించలేదని ఆరోపించారు. వాల్మీకుల ఆరాధ్య దైవం, వాల్మీకుల ఆడబిడ్డ అయిన బోయకొండ గంగమ్మ చైర్మన్ పదవిని వాల్మీకులకే కేటాయిస్తామని గతంలో అన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఎవరు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వాల్మీకి బోయలు ఎంతోమంది ఉన్నారని వారిని గుర్తించి ఆలయ చైర్మన్ పదవి ఇచ్చి ఆత్మగౌరవాన్ని నిలపాలన్నారు. రాష్ట్రంలో భర్తీ చేస్తున్న నామినేటెడ్ పదవుల్లో ఒక్క పదవీ వాల్మీకి కి ఇవ్వలేదన్నారు. ఆ విషయాన్ని అధిష్టానం గుర్తించి నామినేటెడ్ పదవులను వాల్మీకి బోయలకు ఇవ్వాలన్నారు. వాల్మీకి ఫెడరేషన్‌కు నిధులు సమకూర్చి, అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు చిప్పిలి చిన్నరాయప్ప, డాక్టర్ శ్రీనివాసులు, సుధాకర్, శ్యాంప్రసాద్, నరసింహులు, చందు, కన్నయ్య, హరి, కార్తీక్ పాల్గొన్నారు.



వాల్మీకుల ఐక్యతను చాటుతున్న విఎంఎస్ నాయకులు

రేపు బిఎస్‌పి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కలెక్టరేట్‌లోని సోమవారం బిఎస్‌పి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు బిఎస్‌పిజిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని పిలుపునిచ్చారు.

వదంతులు నమ్మొద్దు : డిఎం

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ప్రభుత్వం శుక్రవారం ప్రతిష్టాత్మకంగా స్త్రీశక్తి పథకం ద్వారా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె టూ డిపో మేనేజర్ బి.అమరనాథ్ శనివారం తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా భాకరాపేట, రామసముద్రం ఘాట్ రోడ్‌లలో స్త్రీ శక్తి పథకం వర్తించదని సోషియల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వదంతులను నమ్మవద్దని తెలిపారు. ఆధార్, రేషన్, ఓటర్ ఐడి ఒరిజినల్ కార్డులను వెంట తీసుకెళ్లి రాష్ట్ర మంతా సంతోషంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించ వచ్చని చెప్పారు.


కృష్ణాష్టమి వేడుకల్లో చమర్తి జగన్‌మోహన్‌రాజు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని అన్ని గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండలంలోని గుట్టపాలెం పంచాయతీ, వాడవాండ్లపల్లి సమీపంలోని కృష్ణాపురం వద్ద నూతనంగా వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సోదరులు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం రాధాకృష్ణులకు అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కే. బరినేపల్లి, వాడవాండ్లపల్లి ఆచార్ల గొల్లపల్లి, కొత్తపల్లి, గుట్టపాలెం, ఎల్లంపల్లి, కలికిరి నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం 9 గంటల వరకు కోలాటలు, చెక్కభజనలు నిర్వహించారు. చివరగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి కోలాహలంగా గడిపారు. **రాజంపేట అర్బన్ :** కృష్ణాష్టమి సందర్భంగా మండల పరిధిలోని మదన గోపాలపురంలో ప్రజలతో కలిసి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళ తాళాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శరత్ కుమార్‌రాజు, విశ్వనాధరాజు, నందలూరు టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య. వీరబల్లి టిడిపి అధ్యక్షుడు భాను గోపాల్‌రాజు, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, శ్రీధర్, సుబ్బరాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి పాల్గొన్నారు.

రాధా, శ్రీకృష్ణ వేషధారణలో అలరించిన చిన్నారులు



తంబళ్లపల్లి : మండలంలో శనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా తల్లిదండ్రులు చిన్నారులకు శ్రీకృష్ణుడు రాధా,గోపిక, సత్యభామ వేషధారణ చేశారు. చిన్నారుల వేషధారణ అలరింప చేశాయి. వెంకటేశ్వర వీధిలో నివసిస్తున్న బి.పవన్ కుమార్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు బి.సంజయ్‌కృష్ణ, ఎం శేఖర్, విజయ నిర్మల దంపతుల కుమార్తె తీక్షణ, శ్రీకృష్ణుని, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆ చిన్నారులను చూసి చూపరులు మురిసి పోయారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పాలకులు

ప్రజాశక్తి- కలకడ

ప్రజాస్వామ్యాన్ని పాలకులు అపహాస్యం చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్ విమర్శించారు. శనివారం స్థానిక కలకడ బస్టాండ్ వద్ద సిపిఐ నాయకులు రాష్ట్ర మహాసభల గోడ పత్రికలు విడుదల చేశారు .ఈ సందర్భంగా వారు మాటాడుతూ దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని, ఎన్నికలలో ప్రజలు ఎవరి ఓటు వారు వేసుకునే పరిస్థితి లేకుండా చేస్తున్నారని, బతికున్న వారి ఓట్లను ఓటర్ల జాబితాలో తొలగించేందుకు శ్రీకారం చుడుతున్నారని, ప్రధాని నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా ఎలక్షన్ కమీషన్‌తో కుమ్మక్కై బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన వారి 65 లక్షల ఓట్లు తొలగించారని అన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కలకడ

ఈనెల 19వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మదనపల్లికి చెందిన లయన్స్ క్లబ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ బోడిపాటి భాస్కర్ నాయుడు తెలిపారు. మండలంలోని నడిపించెర్ల పంచాయతీ జడ్‌పి హైస్కూల్‌లో మంగళవారం స్థానిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న తెలిపారు. కంటికి సంబంధించిన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఎన్‌టిఆర్ వైద్య సేవ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చే వారు తమ వెంట ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, సెల్‌ఫోన్ తమ వెంట తీసుకురావాలని తెలిపారు.



రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

రాష్ట్ర స్థాయిలో పురస్కారం అందుకున్న డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో పశువైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సాధు సురేష్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విధులలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.500 విలువ గల పెయ్యదూడల సూదితో కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడంలో రాష్ట్రస్థాయిలో నిమ్మనపల్లె మండలం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గత ఏడాదిలో మండలంలో 780 పెయ్యదూడలకు కృత్తిమ గర్భధారణ చేశామన్నారు. ఆవులకు 90 శాతం పైగా పెయ్యదూడలు కలగటమే కాకుండా పశువులు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రసవించాయని అన్నారు. ప్రభుత్వం తమ సేవను గుర్తించి ప్రతిభ పురస్కారం అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. గతంలో రూ.500లు విలువ గల పెయ్యదూడల కృత్రిమ గర్భధారణ సూదెను ప్రభుత్వం ప్రస్తుతం కేవలం రూ.150లకు మాత్రమే పాడి రైతులకు అందిస్తున్నాదని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌ను నిమ్మనపల్లి పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

ఉత్తమ ఎఎస్‌ఐగా కరీముల్లా


ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎఎస్‌ఐ కరీముల్లా

బి.కొత్తకోట : రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పి విద్యాసాగం నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఎఎస్‌ఐగా ప్రశంసా పత్రం అందుకోడం సంతోషంగా ఉందని కరీముల్లా పేర్కొన్నారు. తాను చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం చే ప్రశంసా పత్రం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందన్నారు.

కాలుష్య కోరల్లో కుషావతి నది

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు


వ్యర్థాలతో నిండిన కుషావతి నీరు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులో కుషావతి, పాపాగ్ని నదులు ముఖ్యమైనవి. కుషావతి నది పైన అరవీడు వద్ద మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించారు. కుషావతి నది పట్టణానికి సమీపంలో ఉండటంతో ఆ ప్రాంతం డంప్‌యార్డ్‌గా మారింది. పట్టణంలోని చెత్తా చెదారం, వ్యర్థాలన్నింటిని తెచ్చి నది ఒడ్డునే వేస్తుండటంతో నది అంతా కాలుష్యమయమైంది. ఆ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసను భరించలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలకు నిప్పు పెడుతుండటంతో వాటి నుంచి వచ్చే పొగ పీల్చుకొని ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నామని అంటున్నారు. దోమలు స్వైర విహారం చేస్తుండటంతో మలేరియా, డెంగీ, చికన్‌గున్యా వంటి విషజ్వరాల బారినపడుతున్నామని వాపోతున్నారు. ఆ వ్యర్థాలన్నీ నది నీటితో కలసిపోవడంతో నీరంతా కలుషితమైంది. గతంలో కుషావతి నదిలోని నీరు స్వచ్ఛమైనవని చెప్పేవారని కానీ ఇప్పుడు విషపునీరుగా మారిపోయాయని ప్రజలు చెబుతున్నారు. స్వచ్ఛమైన నీరంతా మురికిమయమై కాలుష్య కోరల్లో చిక్కుకుందని అన్నారు. ఈ సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేదని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టి కాలుష్య కోరల్లో నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

కంపుతో తట్టుకోలేకున్నాం



డంపింగ్ యార్డ్ కంపుతో తట్టుకోలేకపోతున్నాం. రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నా చలనం లేదని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు లెక్కలేని సార్లు తిరిగాం. అయినా అధికారులు స్పందనలేదు. సమస్యను పరిష్కరించాలి.

-గుండ్లూలూరు మస్తాన్, కుషావతి నగర్, గాలివీడు

డంపింగ్ యార్డ్ పొగతో ఇబ్బంది



కుషావతినది వద్ద ఉన్న డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో ఇబ్బందులు పడుతున్నాం. అక్కడ ఉన్న వ్యర్థాలకు నిప్పుడు పెడుతుంటంతో నిత్యం పొగ వస్తూనే ఉంటుంది. చిన్నారులు, వృద్ధులు అనారోగ్య బారిన పడుతున్నారు. మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశముంది. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. వ్యర్థాలను తొలగించి నదిని శుభ్రపరిచే చర్యలు తీసు కోవాలి. డంపింగ్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి.

-అమీన్, కుషావతి నగర్, గాలివీడు

సిఎం సహాయనిధి పేదలకు వరం : 'ముక్కా'


సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి -పుల్లంపేట

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులకు శనివారం ఎమ్మెల్యే అరవశ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, సాయివికాస్‌రెడ్డి వారి వారి గ్రామాలలోని ఇంటింటికి వెళ్లి సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వివరాల్లోకెళితే మండల పరిధిలోని దలవాయిపల్లి పంచాయతీ కేతరాజుపల్లి గ్రామానికి చెందిన పంచగల సుబ్బలక్ష్మికి రూ.1.50లక్షలు, కొమ్మనవారిపల్లి పంచాయతీ చొప్పవారిపల్లి గ్రామానికి చెందిన పోలి నాగమ్మ భర్త నరసింహారెడ్డికి రూ.90వేలు, అనంతసముద్రం పంచాయతీ పుల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆడిమూలం లక్ష్మీదేవికి రూ.26,218 లు, బావికాడపల్లి పంచాయతీ పచ్చావారిపల్లి గ్రామానికి చెందిన కామినేని లక్ష్మయ్య రూ.1.18లక్షలు అందించారు. ఓబులవారిపల్లి మండలపరిధిలోని వై.కోట గ్రామానికి చెందిన అంకెపల్లి సత్యనా రాయణకి రూ.83,834లు, టంగుటూరి చెన్నారప్పగారి పాపిరెడ్డికి రూ.30,276లు, చిన్న ఓరంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి రమణయ్య నాయుడుకు రూ.1.23లక్షలు అందించారు. మంగంపేట గ్రామానికి చెందిన యాడగొట్టి దుర్గమ్మకి రూ.1.57లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్యలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. సిఎం సహాయనిధి ఆపదలో ఉన్న రోగుల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అప్పులు చేసి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి కొంత ఉపశమనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పుల్లంపేట మండల అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, ఆరే సుధాకర్‌నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కలికిరి సిఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మైనర్లు డ్రైవింగ్‌లో పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడకూడదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారిపై ప్రభుత్వం నిర్దేశించి విధంగా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.



వాహనదారులకు సూచనలు ఇస్తున్న సిఐ అనిల్‌కుమార్

కమనీయం శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం

పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి


ప్రత్యేక అలంకరణలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

ప్రజాశక్తి -నందలూరు

మండలం లోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయితీ అరవ పల్లి లోని శ్రీకృష్ణ గీతా మందిర ఆవరణంలో కుర్ర మణియాదవ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం కమనీయంగా జరిగింది. వేద పండితులు బండత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వేదికపై ఆసీనులు గావించారు. ఈ కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కల్యాణానికి వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ ఉభయ దారులుగా భారతాల శ్రీధర్ బాబు యాదవ్, సుప్రియ దంపతులు, కుర్ర మురళీ కృష్ణ యాదవ్, వెంకట వాసవి దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలను సాయి లోకేష్ కుమార్ దంపతులు అందజేశారు. ఈ కల్యాణంలో చిన్నారులను తల్లి దండ్రులు చిన్ని కృషుని వేషధారణ చేసి కళ్యాణ వేదిక దగ్గరికి తీసుకు వచ్చారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి గ్రామోత్సవం ఆర్అండ్‌బి బంగ్లా నుంచి బస్టాండ్ కూడలి వరకు కోలాటాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో వైసిపి నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, మల్లికార్జున రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, బయన బోయిన భాస్కర్ యాదవ్, ఆనాల మధు యాదవ్, మధు రాజు, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పునగాని గుణ యాదవ్, పుత్త శంకర్ పాల్గొన్నారు.

కక్షసాధింపు రాజకీయాలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్రంలో వైసిపి నాయకులనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఆ పార్టీ వైఎస్ఆర్ జిల్లా బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తిన సుబ్బ రాయుడు యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రొద్దుటూరులో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను కలిసి పరామర్శించారు. పులి వెందులలో జరిగిన దాడి ఘటన గురించి రమేష్ యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి ప్రభుత్వాన్ని తామెప్పుడూ చూడలేదన్నారు. ఉప ఎన్నికలలో గెలవలేక ఓటర్లను అడ్డుకుంటూ, అక్రమంగా దొంగ ఓట్లకు పాల్పడి దొడ్డిదారిన విజయం సాధించారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఆ రోజుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, గంగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, చిట్టి బోయిన గోపాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గుర్తుకు రాలేదా రాజ్యాంగం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత వైసిపి ప్రభుత్వంలో మీరు చేసిన అరాచకాలప్పుడు రాజ్యాంగం గుర్తు రాలేదా అని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రొద్దు టూరులో చెల్లని రూపాయిగా చెలామణి అవుతున్న నీవు పులివెందుల కెళ్లి అక్కడ రెచ్చగొట్టే మాటలతో హింసను సృష్టించావన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓట్లు వేశారని, అందుకే టిడిపి గెలవ గలి గిందన్నారు. ప్రజలు ఎందుకు ఓట్లు వేయలేదో వైసిపి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి టిడిపి అభ్యర్థి దగ్గర పోలీసు లతో ముట్టడించి మీరు చేసిన అరాచకాలు గుర్తులేవా అని ప్రశ్నించారు. ఇప్పుడు గాంధీ, అంబేద్కర్ రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నావన్నారు. రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత రాచమల్లుకు లేదన్నారు. ఇప్ప టికైనా సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను ఇష్టానుసారంగా మాట్లా డితే ఊరుకునేది లేదని, తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

చిత్రలేఖనంలో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - చక్రాయపేట :

చిత్రలేఖనం పోటీల్లో ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాణించడం సంతోషకరమని ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి తెలిపారు. స్వతంత్ర దినోత్సవం వేడుకలు సందర్భంగా చక్రాయపేట మండలంలోని ఉప్పలవాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థులు స్వతంత్ర్య సమర యోధుల చిత్రాలను గీశారు. వారి ప్రతిభను గుర్తించి, బహుమతులు అందజేశారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించేలా పోటీలను నిర్వహించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయవచ్చని అన్నారు.

సిఎం మాట మార్చడం విడ్డూరం : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉచిత బస్సు విషయంలో ముఖ్యమంత్రి మాట మార్చడం విడ్డూరంగా ఉందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని శనివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, కేవలం పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో మాత్రమే అనుమతి ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఈ పథకం కోసం నూతన బస్సులు కేటాయించక పోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తూ నిత్యావసర ధరలు పెంచారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని అంతరాష్ట్ర సర్వీసులతో సహా అన్ని సర్వీసులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో శాంతియుత నిరసన చేస్తామన్నారు


బాధిరాలికి నగదును అందిస్తున్న టిడిపి నాయకులు

పేద కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ ఎక్కువ దళితులకు చెందిన రేణిమణి చిన్నప్ప(56) బావిలో పడి మృతి చెందాడు. అతని దశదిన కార్యక్రమానికి గ్రామ టిడిపి నాయకులు ప్రదీప్‌రెడ్డి, రామానుజన్‌రెడ్డి, సుభాన్‌సాబ్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. శనివారం చిన్నప్ప ఇంటి వద్ద వెళ్లి ఆయన భార్య ఓబులమ్మకు నగదును అందించారు.


గౌతు లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గౌతు లచ్చన్నకు ఘన నివాళులు

ప్రజాశక్తి - నందలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతి సందర్భంగా శనివారం సర్దార్ గౌతు లచ్చన్నకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడు తూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని ఆ స్థాయిని అందుకోవడం ఆంధ్రులుగా మనం గర్వపడాల్సిన విషయం అని తెలుపుతూ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారికి కంట్లో నలుసుగా తయారై తన పోరాట పటిమతో వారికి అనుక్షణం అడ్డు తగులుతూ సాహసోపేతంగా ఉద్యవాన్ని కొనసాగిస్తూ అనేక పర్యాయములు జైలుకు వెళ్లడం జరిగిందని అటువంటి మహానుభావుని జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ ఘనం గా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణి యాదవ్, మోడపోతుల రాము, గంధం గంగాధర్, జంగం శెట్టి హరి, సునీల్ రెడ్డి, కుర్రా మురళి, మహిళలు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అనారోగ్యానికి గురైన జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, వైసిపి జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని సుధీర్‌రెడ్డి స్వ గ్రామం నిడిజివ్విలో కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి సుధీర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి తీసుకు వెళుతున్నప్పుడు సుధీర్‌రెడ్డి, ఆయన వర్గీయులు అడ్డుకుని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైందన్నారు. ఆ విషయంలో విచారణకు సుధీర్‌రెడ్డి శనివారం హాజరు కావాలని పోలీసులు నోటీసు ఇచ్చారన్నారు. లాయర్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విచారణకు హాజరయ్యేందుకు ఈనెల 20 వరకు గడువు కోరామని తెలిపారు. అనారోగ్యం కారణంగా సుధీర్‌రెడ్డి హాజరు కాలేరని కోలుకున్నాక హాజరవుతారని, పోలీసులకు విచారణకు సహకరిస్తారని రాతపూర్వకంగా తెలిపామని తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వేముల

వేముల వంకగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస నాలుగో శనివారం సందర్భంగా స్వామికి పత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో అన్నదానం చేశారు. గండి నాగభూషణం, మస్తానమ్మ దంపతులు 50 మంది పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పేదలకు సాయం చేయడం సంతృప్తిని ఇచ్చిందని అన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లె పంచాయితీ, దొడ్డికాడపల్లికి చెందిన సుబ్బారెడ్డి కుమారుడు మేఘనాథ్ రెడ్డి (25) కుటుంబ సమస్యలపై గొడవపడ్డాడు. తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి కి రెఫర్ చేశారు. అయితే కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తంబళ్లపల్లె పోలీసులు విచారిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మృతి చెందిన పశ్చిమబెంగాల్‌కు చెందిన ఖదీర్

పశ్చిమ బెంగాల్ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చేతులు, కాళ్లు కట్టేసిన ఆనవాళ్లు ఉండడం, శరీరంపై తీవ్రంగా దాడిచేసిన రక్తపుగాయాలు ఉండడంతో ఎవరైనా దారుణంగా కొట్టి, హత్య చేసి రైల్వే ట్రాక్ పక్కన చెట్ల పొదల్లో పడేశారా అన్న అనుమానాలు రేకెత్తు తున్నాయి. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ముజమ్మల్ కుమారుడు ఖాదీర్ (30) మదనపల్లెకు వలస వచ్చి కాంట్రాక్టర్ వద్ద రోడ్డు పనులు, బ్రిడ్జి పనులు చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఏడాది క్రితం పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లిపోయాడు. నెలరోజుల క్రితం పనులు మళ్లీ ప్రారంభం కావడంతో తిరిగి వచ్చాడు. కురబలకోట మండలంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర ఉండే ఓ రేకులహెడ్డులో తనతో పాటే వచ్చిన స్నేహితులతో కలిసి జీవించేవాడు. రెండు రోజులుగా పనులకు రాకపోగా, సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. శనివారం ఉదయం సిటిఎం క్రాస్ రోడ్డులోని రైల్వే ట్రాక్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని మృతదేహం పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్ళిన పోలీసులు మృతదేహం పడి ఉన్న తీరును చూసి ఎవరో గుర్తుతెలియని యువకుడు రైలు ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. కదిరి రైల్వే పోలీసులు వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. సాయంత్రం మృతదేహాన్ని గుర్తుపట్టిన కాంట్రాక్టర్ తమవద్ద పనిచేసే కొంతమందితో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని చూసి గుర్తుపట్టి ఖదీర్‌గా నిర్ధారణ చేశారు. కాంట్రాక్టర్ కింద పనులు చేసే వ్యక్తిగా గుర్తించారు. తాలూకా పోలీసులు అనుమానాస్పదం మృతి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం హత్య కేసుగా మార్పు చేస్తామని పోలీసులు అంటున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
45వ వార్షికోత్సవ
ప్రత్యేక సంచిక
ఎడివిటి ఫీచర్ - ప్రొద్దుటూరు
ఆదివారం 17-8-2025

అక్షర యజ్ఞంలో మరో అడుగు

తెలుగు నేలపై ప్రారంభమైన మొట్టమొదటి దినపత్రిక ప్రజాశక్తి. 1942లో వారపత్రికగా ప్రారంభమై 1945లో దినపత్రికగా ఎదిగింది. ఈ గమనంలో అనేక ఆటుపోట్లను, ఎత్తుపల్లాలనూ అధిగమించింది. 44 ఏళ్ల క్రితం ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమై "ప్రతి అక్షరం ప్రజల పక్షం" నినాదంతో 45వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయం ఇది. పత్రిక ప్రారంభమైంది మొదలు పాఠకుల ఆదరణ, శ్రేయోభిలాషుల సహకారంతో అప్రతిహతంగా పురోగమిస్తోంది. ప్రజా ఉద్యమంలోనూ, పత్రికా రచనల్లోనూ సవ్యసాచిలా రాణించిన మోటూరు హనుమంతరావు సంపాదకత్వంలో, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య దార్శనికతలో 1981 ఆగస్టు 1న విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ప్రజాశక్తి అనతి కాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో 10 కేంద్రాలకు విస్తరించింది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో నేడు 10 కేంద్రాల నుండి ప్రచురితమవుతోంది. పత్రికా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు అక్షరసాయాన్ని అందిస్తూ ప్రత్యామ్నాయ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత ఆధారంగా ప్రజాశక్తి పయనం మున్ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుండి విజయవాడకు తరలి వచ్చిన ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం కొన్నాళ్ల



అద్దెభవనంలో సాగింది. అనంతరం రాష్ట్ర రాజధాని కేంద్రం తాడేపల్లిలో నిర్మించిన సొంత భవనంలో 2020 నవంబరు 6వ తేదీ నుండి కార్యకలాపాలను సాగిస్తూ అప్రతిహతంగా పురోగమిస్తోంది.





అక్షరాయుధ యోధుడు మోటూరు హనుమంతరావు

మోటూరు హనుమంతరావు విప్లవ జీవితంలో విలక్షణ వ్యక్తిత్వాంశాలూ మదిలో మెదులుతాయి. ప్రజాశక్తి స్థాపన, పరిరక్షణ, నిర్వహణ, విస్తరణ అన్నింటితో ఆయనది అవినాభావ సంబంధం. ఆయన ప్రజాశక్తికి పర్యాయపదం. అక్షరాలను ఆయుధంగా చేసుకున్నారు. సమాజంలోని సమస్యల పొట్టచీల్చి ప్రజాకోణాన్ని ఆవిష్కరించారు. సంపాదకుడుగానూ సారథిగానూ సుదీర్ఘకాలం పాటు ఆయన ఈ పత్రికకు ఆద్యుడూ బాధ్యుడూ కూడా.

1917లో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా వెల్లటూరులో పేద రైతు కుటుంబంలో పుట్టిన ఎంహెచ్ పాఠశాల దశలోనే స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్నారు. 1930 నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్రధారి. 1943లోనే గుంటూరు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి అయ్యారు. రాష్ట్రంలోనూ దేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఆక్రమించిన ఆ ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్రధారి అయ్యారు. కొరటాల సత్యనారాయణతో సహా ఎందరికో పార్టీ సభ్యత్వం ఇచ్చారు. కళా సాహిత్యాల పట్ల ప్రత్యేకాసక్తి గల ఎంహెచ్ ప్రజానాట్యమండలికి మార్గదర్శకుడుగా ప్రజా కళా సృజనకు దోహద పడ్డారు. శ్రీశ్రీ మొదలుకొని నిన్నమొన్నటి యువ రచయితల వరకూ ఎందరితోనో ఆయనకు అనుబంధముంది. జమున మొదలుకొని శారద వరకూ గుమ్మడి నుంచి మాదాల రంగారావు వరకూ భిన్నతరాల నటీనటులు ఆయనకు సుపరిచితులే. వాస్తవానికి ఆయనలో ఆఖరి వరకూ కనిపించని కళాకారుడుండేవాడు. దిగంబర కవిత్వం నిరసన పేరుతో సభ్యతా ప్రమాణాలను కూడా తోసిపుచ్చే కసిత్వంగా తయారై తర్వాత విరసంలోకి పయనం కట్టినప్పుడు జరిగిన చర్చలో ఆయన పాత్ర చాలా కీలకమైంది. సాహిత్యోద్యమంపై మార్క్సిస్టు అవగాహన పేరుతో ఆయన రాసిన పుస్తకం చాలా విలువైంది.

1948లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడుగా ఎన్నికైన ఎంహెచ్ అనేక కీలకమైన తీర్మానాలూ, నివేదికలూ, పత్రాల రూపకల్పనలో ముఖ్య పాత్రవహించారు. నిర్బంధాల, నిషేధాల మధ్య రహస్యంగా పనిచేస్తూ వీర తెలంగాణా సాయుధ పోరాటానికి సహాయ మందించారు. అప్పటి ప్రజాశక్తి పత్రిక ప్రభుత్వ దాడిలో ధ్వంసమైన తర్వాత 'జనత' పత్రిక తీసుకురావడానికి తొలి సన్నాహాలు చేశారు. ఇంతలోనే 1949 మేలో అరెస్టయ్యారు. నరక కూపాలుగా రాక్షసత్వ కేంద్రాలుగా వున్న నాటి జైళ్లలో కూడా వీరోచిత పోరాటాలలో పాల్గొని అమరులైన వారి సరసనే ఆయనా వున్నారు. 1952లో విడుదలైన వెంటనే రేపల్లె నియోజక వర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు పోటీ చేసి అప్పటి రాష్ట్ర మంత్రి కల్లూరి చంద్ర మౌళిపై విజయం సాధించారు. విశాలాంధ్ర కోసం అనేక కరపత్రాలు, పుస్తకాలు రాశారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభలో ఉప నాయకులుగానూ బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోరాటంలోనూ, తర్వాత కూడా పార్టీ ప్రచారానికి శక్తివంతమైన ప్రచారాయుధాలందించారు. సమైక్య రాష్ట్ర సాధనకై పోరాడుతున్న నాటి సందర్భానికి తగినట్టు 'విశాలాంధ్ర' పత్రికను ప్రారంభించగా 1953 జూన్‌లో ఆయన సంపాదకుడుగా ఎన్నికయ్యారు. నాటి నుంచి అర్థశతాబ్ది పాటు వెలువడిన పార్టీ పత్రికలన్నింటిలోనూ ఆయన ప్రత్యక్ష పాత్ర వుంది. కారాగారంలో వున్నా రహస్య జీవితంలో వున్నా శాసనసభ్యునిగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్ర, జనశక్తి, ప్రజాశక్తి దిన, వార పత్రికలన్నింటికీ ఆయన జీవనాడి అయ్యారు. రాజకీయ విధానాన్ని సూటిగా వివరించడంలోనూ, కమ్యూనిస్టులపై దుష్ప్రచారాలను శక్తివంతంగా తిప్పికొట్టడంలోనూ ఆయనది ఒక గొప్ప వరవడి.

యాభయ్యవ దశకంలో కమ్యూనిస్టులపై కాంగ్రెస్ అనేక నీచాతినీచమైన దాడులకు దిగినప్పుడు దాన్ని అక్షరాయుధాలతో వమ్ము చేయడంలో ఎంహెచ్ పాత్ర మరపురానిది. విశ్వవిద్యాలయాల్లో చదువుకోకపోయినా కుటుంబానికి కూడా పాండిత్య నేపథ్యం లేకపోయినా స్వయం కృషితోనే ఆయన భాషా పాటవం పెంచుకున్నారు. జనంలోంచి వచ్చిన మనిషి గనక మాటకు వుండే తూకం ఆయనకు బాగా తెలుసు. అంతకుముందు మద్దుకూరి చంద్రం కూడా సంపాదకుడుగా సులభ శైలిలో రాస్తాడని పేరున్నా ఎంహెచ్ రాజకీయ వాదోపవాదాలలో నిశితమైన వినూత్న శైలి ప్రవేశపెట్టారు. దానికి ప్రాణం వర్గ చైతన్యం కాగా దాని శక్తి రాజకీయ విధానం. మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో తెలుగు భాషను పోరాట భాషగా చేస్తే ఎంహెచ్ కలం రాజకీయ వర్గ చైతన్య భరితమైన భావజాలానికి పద సంపదను సమకూర్చింది. మార్క్సిస్టు మేధావులు పండితులూ అనేక మంది వుండొచ్చు. కాని ఆ భాషను సిద్ధాంత రాజకీయ ప్రచారానికి శక్తిమంతంగా వాడుకోదగిన వారు తక్కువే. ఈ విషయంలో ఎంహెచ్, మాకినేని బసవపున్నయ్య అగ్రగణ్యులు. గ్రామీణ జీవితంలోని సహజ భాషను ప్రాచీన శతకాలు, అధునిక సాహిత్యాలలోని భాషా ప్రయోగాలనూ మేళవించారు. దానికి ఆధునికాంగ్ల పోకడలను కలగలిపారు. అన్నిటినీ మించి మార్క్సిస్టు భావజాలాన్ని మేళవించారు. ఈ ప్రయోగాలతో వారు అతి శక్తివంతమైన రాజకీయ భాషను వాడుకలోకి తెచ్చారు. 'తీరు తెన్నులు' పేరుతో ఎంహెచ్ విశాలాంధ్రలో నిర్వహించిన శీర్షిక అప్పట్లో ప్రసిద్ధం. దారీ తెన్నూ అన్న మాట అంతకుముందు ఎక్కువగా వుంటే దాన్ని తీరు తెన్నులుగా ఆయన వాడుకలోకి తెచ్చిన మాటకు మొదట భాషావేత్తలు అభ్యంతరాలు పెట్టారు గాని ఆచరణలో అదే నిలబడిపోయింది.

విశాలాంధ్ర తర్వాత జనశక్తి కాలంలోనూ ఎంహెచ్ కలం పదునైన రచనలే అందించింది. రాష్ట్రంలో సిపిఎంకు ఆయన తొలి కార్యదర్శిగా ఎన్నికై



పద్దెనిమిది సంవత్సరాలు ఆ బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే నగ్జలైట్ విచ్ఛిన్నాన్ని సైద్ధాంతికం గానూ నిర్మాణ పరంగానూ ఎదుర్కొని పార్టీని కంటికి రెప్పలా కాపాడేందుకు అగ్రగామిగా నిలిచారు. వాస్తవానికి 1964, 1968 రెండు సందర్భాల్లోనూ రాష్ట్రంలో సిపిఎం పునాదిని పరిరక్షించడంలోనూ, రాజకీయ వైఖరిని చాటిచెప్పడంలోనూ ఆయనదే ప్రథమ పాత్ర. ఈ పోరాట క్రమంలోనే ఆయన భాష పదునెక్కింది. వర్గ నైశిత్యం ఇనుమడించింది. కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద అతివాదాలకు ఎడాపెడ ధోరణులని ఆయనే నామకరణం చేశారు. సూత్రబద్ధం, కంకణధారులుగా పనిచేయడం, నికరంగా నిలబడటం, సలాం గొట్టడం వంటి పదాలను ఆయన బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. పడికట్టు పదాలు, కమ్యూనిస్టు పరిభాష అని గేలి చేసే అనేకమంది దాని వెనక వుండే సిద్ధాంత బలాన్ని సహించలేకనే అలా మాట్లాడుతుంటారు. కాని మళ్లీ ఆ పదాలనే పట్టుకు వేళ్లాడుతుంటారు! పదాలమధ్య దీరాలివ్వడం ద్వారా అదనపు భావాన్ని స్ఫురింపజేయడం ఆయన విధానం. 'కష్టజీవుల కడుపు గొట్టడం ప్రజాస్వామ్యమూ, దాన్ని ప్రతిఘటించడం ఫాసిజమూనా?' అన్నప్పుడు వేరే వ్యాఖ్య లేకుండానే భావం చేరిపోతుంది. 'వీర తెలంగాణా యోధులు ఎత్తినవి తెల్ల జండాలు కాదు: ఎర్రజండాలు' వంటి శీర్షికలు రాజకీయంగా ఉర్రూతలూపేవి. 'సంక్షోభంలో సంక్రాంతి', 'యువతరానికి వెలుగుబాట సోషలిజం', 'కారు చీకటిలో కాంతిరేఖలు', 'విశాలాంధ్రలో విషాదఛాయలు' వంటి శీర్షికలన్నీ బాగా ఆకర్షించాయి.

1964, 1966లలో కూడా ఎంహెచ్ మళ్లీ జైలు జీవితం అనుభవించారు. 1975-77 మధ్య ఇందిరాగాంధీ ఎమర్జన్సీ కాలంలో కఠోరమైన రహస్య జీవితం గడిపారు. ఆయనను అరెస్టు చేసేందుకు అప్పటి జలగం వెంగళరావు ప్రభుత్వం వారంటు జారీచేసి ఇంటిగోడపై అతికించి కక్షగట్టి వ్యవహరించింది. వాటన్నిటి మధ్య అజ్ఞాత జీవితం గడుపుతూనే ఆయన అత్యవసర పరిస్థితిపై అక్షరాయుధాలు కురిపించారు. 'అంజి' అన్న చిన్నప్పటి పేరుతో ఇందిరా, సంజయ్‌ల నిరంకుశ పాలనను అపహాస్యం చేసే రచనలు చేశారు. సంజయ్ గాంధీని బాలభానుడని కాంగ్రెస్ నేతలు ఆకాశానికెత్తుతుంటే 'రాజు వెడలె' పేరుతో ఆయన వ్యంగ్య రచన చేస్తూ 'అయితే సాయింత్రం కనిపించడు కదా' అని ప్రశ్నించారు! సెన్సార్ నిబంధనలను ధిక్కరించి ప్రజాశక్తి వారపత్రిక వాటిని ప్రచురించడం అప్పట్లో పెద్ద సంచలనం. మరో వైపున ఆ కాలంలోనే సిపిఎం 'రావు' పేరుతో రాజకీయంగా ఉత్తేజం కలిగించే పలు రచనలతో పాటు రోజెన్ బర్గుల జీవిత కథను ధారావాహికంగా రాసి ప్రచురించారు. 1981 అఖిలపక్ష ఉద్యమం సందర్భంలోనూ అదేవిధంగా ఉత్తేజమిచ్చారు. అదే సంవత్సరం ప్రజాశక్తి దినపత్రిక పునః ప్రారంభమైనప్పుడు రాష్ట్రకార్యదర్శిగానూ, శాసనమండలి సభ్యుడుగానూ వుంటూనే పత్రికా బాధ్యతలు కూడా నిర్వహించాలని పార్టీ చేసిన నిర్ణయాన్ని శక్తివంచనలేకుండా అమలు జరిపారు.

ప్రజాశక్తి దినపత్రికను ప్రజలందరి పత్రికగా తీర్చిదిద్దే సందర్భంలో సమతుల్యత దెబ్బతినకుండా చూసేందుకు ఆయన ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. వాస్తవికత, వార్తా ప్రాధాన్యత, రాజకీయ దృష్టి ఏదీ దెబ్బతినకుండా సమాచారం అందించాలని తాపత్రయపడేవారు. 1984లో ఎన్‌టిఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచిన సందర్భంలో సాగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం నెలరోజులూ దానిపైనే సంపాదకీయాలు రాస్తూ వచ్చారు. మరో వైపున ఆ పోరాటంలో ఉపన్యాసకునిగానూ అన్ని చోట్లా పర్యటించారు. ఆయనెప్పుడూ ఈ ద్వంద్వ బాధ్యతా పోషణ చేస్తూనే వచ్చారు. మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలపై దాడులు, హత్యాకాండలు జరిగినప్పుడు హుటాహుటిన తరలివెళ్ళేవారు. అక్కడ దారుణాన్ని ఖండించి రావడంతో పాటు పత్రికలోనూ రాసేవారు. అందుకే ఆయన సవ్యసాచి. రాజీలేని వర్గ పటిమకు మారుపేరైన ఎంహెచ్, దివాళాకోరు ధోరణులను ఎప్పుడూ సహించేవారు కాదు. 'చచ్చిన చేప వాలున పడి కొట్టుకుపోతుంది. బతికిన చేప ఎదురీదుతుంది' అనేది ఆయన తరచూ చేసే ప్రయోగం. పార్టీపై దుష్ప్రచారం చేసేవారినుద్దేశించి 'గాజుకొంపల్లో కూచుని రాళ్లు రువ్వడం' అనేవారు(అద్దాల మేడలో అనకుండా గాజుకొంప అనడం ఆయన జీవద్భాషలో భాగం) 1986లో ఆయన రాజ్యసభకు ఎన్నికైనా పత్రిక బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. ఇంచుమించు అప్పుడే సోవియట్‌లో గోర్బచెవ్ నాయకత్వంలోకొచ్చాక ప్రవేశపెట్టిన దిగజారుడు విధానాలు ఆయనకు చాలా ఆగ్రహావేదనలు కలిగించాయి. వాటిని ఇక్కడ కొందరు ఆకాశానికెత్తుతుంటే ఆయన వాటి ప్రమాదకర పోకడలను గురించి హెచ్చరిస్తూ వచ్చారు. ధర్మరాజు జూదంలో ద్రౌపదితో సహా అన్నింటినీ పణంగా పెట్టినట్టు గోర్బచెవ్ సోషలిజానికే తిలోదకాలిస్తున్నాడని ముందుగా హెచ్చరించిన వారిలో ఆయన ముఖ్యులు. చివరకు 1991 ఆగస్టులో ఆ దేశమే విచ్ఛిన్నమైన తర్వాత కూడా సోషలిజం అజేయమని దృఢంగా ప్రకటించిన ధీమంతుడు ఎంహెచ్.

ప్రజాశక్తి సంపాదకుడు గానే గాక నిర్వాహక సంస్థ కన్వీనర్ గానూ ఎంహెచ్ దానికి సంబంధించిన ప్రతి చిన్న నిర్ణయం లోనూ భాగస్వామిగా వున్నారు. ఏదైనా లోతుగా పరిశీలించి అన్ని కోణాల నుంచీ ఆలోచించి అడుగు వేయడం తప్ప హడావుడి ఆయనకు తెలియదు. మధ్యలో కొంత కాలం చిక్కులెదుర్కొని పత్రిక నాలుగు పేజీలకు తగ్గినా మళ్లీ నిలదొక్కుకుని మరింత విస్తరణ దిశగా ప్రజాశక్తిని నడవడంలో పార్టీ, పత్రిక సహచరులతో పాటు ఆయన పాత్రా ప్రధానమైంది. రాజకీయ పత్రికలు నడపడం కష్టమన్న మాటను పూర్వపక్షం చేస్తూ ప్రజాశక్తి ఈ రోజు తొమ్మిది ఎడిషన్లుగా వెలువడుతున్నదంటే దీని వెనుక ఎంహెచ్ కృషి అమోఘం. పత్రికతో పాటు అందులో పనిచేసే సిబ్బందిని కన్నబిడ్డల్లా ప్రేమిస్తూ వారి కష్టసుఖాలకు ప్రతిస్పందిస్తూ ఆయన అందరికీ పెద్దదిక్కుగా నిలిచారు. మరోవైపున శ్రుతిమించిన స్వార్థంతో దిగజారిన వారిని అంతే గట్టిగా ఈసడించుకున్నారు.

ప్రజా జీవితంలో ప్రమాణాలకు ఆయన పెట్టింది పేరు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా వీసమెత్తు విమర్శలకు ఆస్కారమివ్వకుండా జీవితం గడిపారు. అందుకే ఆయన పట్ల కమ్యూనిస్టులే గాక అన్ని పార్టీల వారూ అమితమైన గౌరవం ప్రదర్శిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోనేగాక దేశవ్యాపితంగానూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని సరైన దిశలో నడపడానికి అంకితమైన అగ్రనేతలలో ఆయన ఒకరుగా నిలిచిపోయారు. 1943లో గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా మొదలైన ఆయన జీవన ప్రస్థానం అరవయ్యేళ్ల పాటు అదే బాటలో అంకితభావంతో నడిచి 1998లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యత్వం వరకూ సాగింది. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడైన ఎంహెచ్ దాని విస్తరణను కళ్లారా చూసి సంతోషించగలిగారు. ఆయన కుటుంబం యావత్తూ ముఖ్యంగా సతీమణి ఉదయంగారు, కుమార్తెలు డాక్టర్లు టాన్యా, ఉష, అల్లుళ్లు రంగారావు, సుధాకర్ తదితరులందరూ కమ్యూనిస్టు ఉద్యమ పథంలోనే కొనసాగారు. ప్రజాశక్తిని, ప్రజా ఉద్యమాన్ని కుటుంబంగా భావించిన ఎంహెచ్ నుంచి స్ఫూర్తి పొందిన వారంతా ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి దీక్షాబద్ధులై వున్నారు.

- తెలకపల్లి రవి.

కార్పొరేట్ల గుప్పిట్లో మీడియా


'మీడియా సంస్థలు నిష్పక్షపాతంగా ఉండాలి. వాస్తవాలను ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలి. ఎటువైపు మొగ్గు చూపకూడదు..' ఇది సాధారణంగా ప్రజల్లో ఉండే అభిప్రాయం! దీనికి తగ్గట్టుగానే వివిధ మీడియా సంస్థల ప్రచారం కూడా ఉంటుంది. తాము మాత్రమే నిఖార్సైన నిజాలు చెబుతామని, జర్నలిజానికి ప్రాణ ప్రతిష్ట చేస్తామని, ప్రజల కళ్లు, చెవులు అన్నీ తామే అవుతామని గొంతు చించుకుంటాయి! అదే వాస్తవమైతే ఇన్ని మీడియా సంస్థలు ఎందుకు? ఒక్కటే సరిపోతుంది కదా! ఈ మీడియా సంస్థలన్నీ ఏం చేస్తున్నాయి? ఉమ్మడి అజెండా ఏమైనా ఉందా? వీటిని నడిపిస్తున్న శక్తి ఏమిటి? తమను తాము ప్రధాన స్రవంతిగా చెప్పుకునే ఈ సంస్థలు ఎవరి కోసం పనిచేస్తున్నాయి?

పాత్రికేయరంగ నిష్పక్షపాతంపై చర్చ ఈ నాటిది కాదు. పత్రికలు పుట్టినప్పటినుండి ఈ అంశంపై వాదోపవాదనలు సాగుతూనే ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో 18వ శతాబ్దంలోనే ఈ చర్చ ప్రారంభ మైంది. పత్రికలు పక్షపాత ధోరణితో వ్యవహరి స్తున్నాయని, కార్మికులు, పేదలకు సంబంధిం చిన అంశాలను పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు అప్పుడే వ్యక్తమ య్యాయి. చరిత్ర ప్రసిద్ధి గాంచిన రష్యా విప్లవానికి ముందు లెనిన్ రాసిన 'ఏం చేయాలి?' లో కార్మికవర్గానికి, దానికి నాయకత్వం వహించే పార్టీకి ప్రత్యేకంగా ఒక పత్రిక ఉండాలని, దానిని జనబాహుళ్యంలోకి విస్తారంగా తీసుకు పోవాలని సూచించిన విషయం తెలిసిందే. బ్రిటిష్ పాలనలో ఉన్న మన దేశంలో స్వాతంత్ర సాధనే లక్ష్యంగా వివిధ భాషల్లో అనేక పత్రికలు ఆవిర్భవించాయి. మన రాష్ట్రానికి వస్తే 'పెట్టుబడికి..కట్టుకథకు పుట్టిన విషపుత్రిక' అని మహాకవి శ్రీశ్రీ అభివర్ణించారు. ఈ ఉదాహరణలన్నీ ఆవిర్భావం నుండి మీడియా సంస్థల ప్రస్థానం సాగుతున్న తీరును గుర్తు చేయడానికే! ఒకప్పుడు వ్యక్తులకు, సంస్థలకు పరిమితమైన మీడియా సంస్థల్లోకి కార్పొరేట్ యాజమాన్యాలు అడుగిడాయి. వీటితో పాటే, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవహిస్తోంది. ఈ నిధుల ప్రవాహానికి అనుగుణంగా వాటి ఉద్దేశాలు, లక్ష్యాలు మారిపోతున్నాయి.

పెట్టుబడిదారి వ్యవస్థకు కేంద్రస్థానంగా ఉన్న అమెరికాలో చోటుచేసుకున్న మార్పులను పరిశీలిస్తే మీడియా ప్రస్తానం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. 1730వ దశకంలో చాలా తక్కువ సంఖ్యలోనే దిన పత్రికలు అక్కడ ప్రచురితమయ్యేవి. దాదాపుగా అన్ని వ్యక్తుల ఆధీనంలో నడిచేవే! స్థానిక ప్రభుత్వాల మీద విమర్శలు, ప్రజా సమస్యకు పెద్దపీటవేసేవి. ఈ రాతలను సహించలేక 1734లో న్యూయార్క్ గవర్నర్ జాన్‌పీటర్ జెంజర్ అనే సంపాదకుడిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఈ కేసులకు వ్యతిరేకంగా చేసిన జాన్‌పీటర్ చేసిన పోరాటం పత్రికా స్వేచ్ఛ అంశాన్ని మొట్టమొదటిసారిగా అమెరికాలో తెరపైకి తెచ్చింది. 1760 –70 సంవత్సరాల నాటికి వివిధ రాష్ట్రాల్లో 24 వారపత్రికల ప్రచురణ ప్రారంభమైంది. ఈ పత్రికలన్నీ కలిసి నెట్‌వర్క్‌గా ఏర్పడి వార్తలను పంపిణీ చేసుకునేవి. 1790లో రెండు పార్టీల వ్యవస్థ ఏర్పాటైన తరువాత సిద్ధాంత ప్రచారం కోసం రెండు పార్టీలు విడివిడిగా పత్రికల ముద్రణ చేపట్టాయి. జాతీయస్థాయి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశాయి. తమ పార్టీ భావజాలాన్ని ప్రచారం చేయడం, ప్రత్యర్థి పార్టీ మీద దాడి చేయడం వీటి ప్రధాన కర్తవ్యం.కరపత్రాలను కూడా అవి ముద్రించేవి. ఈ మీడియావార్‌లో భాగంగానే నియంత్రణకోసం అధికారంలో ఉన్న పార్టీలు చట్టాలు కూడా చేసేవి. 1798లో అధికారంలో ఉన్న ఫెడరలిస్టులు చేసిన ఒక చట్టం కారణంగా రిపబ్లిక్ పార్టీకిచెందిన దాదాపు 24 మంది పత్రికల సంపాదకులు, సిబ్బందిపై కేసులు పెట్టి జైళ్లపాలుచేశారు. 1850వ సంవత్సరపు అధికారిక లెక్కల ప్రకారం ఈ రెండు పార్టీలు దేశవ్యాపితంగా 1,630 పత్రికలను వెలువరించేవి. రెండు పార్టీలకు సంబంధం లేకుండా 83 పత్రికలు ఉన్నప్పటికీ వీటి స్వతంత్రత ప్రశ్నార్థకమే! ఎప్పటికప్పుడు అందే ప్రయోజనాల ఆధారంగా వీటి మొగ్గు మారేవన్న విశ్లేషణలు ఉండేవి. 20వ శతాబ్దపు ప్రారంభానికే అమెరికా పత్రికారంగంపై వాణిజ్యప్రకటనల ప్రభావం కనిపించింది. పత్రికల్లో రాజకీయ వార్తల నిడివి తగ్గి వాణిజ్య అంశాలకు ప్రాధాన్యత పెరిగింది. పత్రికలు ఆదాయ వనరుల కోసం వాణిజ్యసంస్థలపై ఆధారపడటంతో రాజకీయ నేతల అవినీతిపై కథనాలు పెరిగాయి. కొంతమేరకు ప్రజా సమ స్యలు చర్చకు వచ్చాయి. అదే సమ యంలో వాణిజ్య ప్రకటనలు ఇస్తున్న సంస్థల ప్రయోజనాలకు పెద్దపీట వేయడం, అవి చేసే నేరాలను చూసీ చూడనట్టు వదిలివేయడం ప్రారంభమైంది. రేడియో, టెలివిజన్ల రంగ ప్రవేశం, ప్రచురణ రంగంలో వచ్చిన మార్పు లతో పత్రికల యాజమాన్యాలకు అవసరమైన నిధుల సమకూర్చుకోవడమే అత్యంత ప్రాధా న్యంగా మారింది. దీనికను గుణంగా ప్రచు రించే అంశాల్లో మార్పులు చోటుచేసుకునేవి. ఇంటర్‌నెట్ రాకతో పోటీ మరింత పెరిగింది. అనేక పత్రికలు మూత పడ్డాయి. అప్పటివరకు ప్రకటనల ద్వారా పత్రికా రంగాన్ని పరోక్షంగా నడిపించిన కార్పొరేట్ సంస్థలు నేరుగా మీడియా రంగంలోకి అడుగుపెట్టాయి. భారీ పెట్టుబడులతో వార్తా, వినోద ఛానళ్లు, వెబ్‌సైట్లు, రేడియో స్టేషన్లతో తో పాటు దిన, వార పత్రికలను ప్రచురించే కార్పొరేట్ మీడియా గ్రూపులు ఆవిర్భవించాయి. 1993లో 90శాతం మీడియా 50 కంపెనీల చేతుల్లో ఉండేవి. ఇప్పుడు 4 కంపెనీలు 90శాతం అమెరికా మీడియాను స్వాధీనం చేసుకున్నాయి. సంఖ్యాపరంగా ఎన్నో పత్రికలు, ఛానళ్లు, రేడియో, స్టేషన్లు ఉన్నట్టు కనిపించినప్పటికీ వీటిని నడిపించే అదృశ్య హస్తం మాత్రం ఆ నాలుగు కంపెనీ లదే! బ్రిటన్‌లో 1986 వరకు 9 బహుళజాతి సంస్థలు 200 రకాల వార్తా పత్రికలు, మ్యాగజైన్లను ప్రచురించేవి. ప్రస్తుతం మూడు కంపెనీల చేతుల్లో 80 శాతం పైగా మీడియా రంగం కేంద్రీకృత మైంది. ఇప్పుడు న్యూస్ రూమ్‌లలో వార్తలు, విశ్లేషణలపై చర్చ జరగదు. తమ భావజా లానికి అనుగుణంగా పాఠకులను ప్రభావితం చేసేలా సమాచారాన్ని ఎలా వండివార్చాలన్నదే కీలకం! దీని వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు!

భారత్‌లో ఇలా ...

వలసపాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర సాధనే లక్ష్యంగా భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభమైన అనేక పత్రికలు ప్రారంభం నుండే కాంగ్రెస్‌కు అనుకూల వైఖరిని తీసుకున్నాయి. స్వాతంత్ర పోరాటం లోని భిన్నస్వరాలను వినిపించకుండా చేసే ప్రయత్నం చేశాయి.



విప్లవకారుల పాత్రను, వారి కార్యక్రమాలను సాధ్యమైనంత తక్కువ చేసి చూపాయి. స్వాతంత్రానంతరం వాటి వర్గ స్వభావాన్ని బహిరంగంగా ప్రదర్శించడానికి ఏ మాత్రం వెనుకంజవేయలేదు. మన రాష్ట్రానికే వస్తే ఆ పోరాటంలోనే పురుడుపోసుకున్న

ఒక పత్రిక అమృతాంజన్ విక్రయాలకు, కమ్యూనిస్టులపై విష ప్రచారానికే పెద్దపీట వేసింది. దేశ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొనడం యాధృచ్ఛికం కాదు. పత్రికా యాజమాన్యాల వర్గదృష్టే దీనికి కారణం. దీనర్థం ప్రజల సమస్యలు అసలు ప్రస్తావనకు రావని కాదు. వాటికి చాలా సందర్భాల్లో పెద్దపీట కూడా లభిస్తుంది. అయితే, సమస్య వెనుక ఉన్న అసలు కారణాన్ని మాత్రం విశ్లేషించకుండా పదాడంబరాలతో కప్పివేయడమే కనిపిస్తుంది. లేనిపక్షంలో అస్థిత్వ వాదాలకు దారితీసేలా కథనాలు ప్రచురణ జరుగుతుంది. ఆర్థిక సంస్కరణల ముందు వరకు పత్రికలకు ప్రధాన ఆదాయ వనరులు వివిధ వాణిజ్యసంస్థలు ఇచ్చే ప్రకటనలే! ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం కోసం కొన్ని వార్తలను తొక్కిపెట్టడం వంటి సంఘటనలు అప్పుడప్పుడు చోటుచేసుకునేవి. ఆర్థిక సంస్కరణల తరువాత ఈ పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. సంస్కరణల ఫలితంగా పెద్దఎత్తున డబ్బుపోగేసుకున్న రాజకీయ నేతలు, కార్పొరేట్ సంస్థల యజమానులు మీడియాపై కన్నేశారు. ఫలితంగా దేశవ్యాప్తంగా మీడియా సంస్థల అంతర్గత పొందికలో భారీ మార్పు చోటుచేసుకుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవాహం మొదలైన తరువాత ఈ పరిస్థితి మరింత స్పష్టంగా కనపడుతోంది. అనేక మీడియా సంస్థలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లిపోయాయి. రిలయన్స్ ప్రస్థానం సాగిన తీరే దీనికి నిదర్శనం. 1993లో నెట్‌వర్క్ 18 పేరుతో మీడియా రంగంలోకి ప్రవేశించిన రిలయన్స్ ఇప్పుడు భారతీయ మీడియా రంగాన్ని ప్రత్యక్షంగానూ, పరోక్షం గానూ శాసిస్తోంది. విక్రయాలు, విలీనాలతో అన్ని ప్రాంతీయభాషల్లోకి ప్రవేశించింది. ఈ గ్రూపు ఆధీనంలో దేశవ్యాప్తంగా వివిధ రకాల ఛానళ్లు దాదాపు 70 నడుస్తున్నట్లు అంచనా. మరో ఆరేడు ఛానళ్లను తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మిగిలిన మీడియా సంస్థల్లోనూ ఇదే విధంగా కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులుగా మారిన రాజకీయ నేతలు ప్రవేశించారు. దాదాపు 80శాతం భారతీయ మీడియా కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో నడుస్తున్నట్లు అంచనా.


ఫలితం ఏమిటి?

కార్పొరేట్ల ప్రభావం పెరగడంతో వాటి ప్రయోజనాల పరిరక్షణే మీడియా సంస్థలకు కీలకంగా మారింది. మరోవైపు ఆదాయం కోసం ఎంతకైనా దిగజారే ధోరణి పెరిగింది. రిలయన్స్‌కు వ్యతిరేక కథనాలు మెజార్టీ పత్రికల్లోనూ, ఛానళ్లలోనూ కనపడకపోవడం ఒక ఉదాహరణకాగా, కోబ్రాపోస్ట్ ఇటీవల నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మతోన్మాదాన్ని పెంచే కథనాలను ఇవ్వడానికి అనేక మీడియా సంస్థలు అంగీకరించడం మరో ఉదాహరణ. ఇలా అంగీకరించిన వాటిలో దేశ ప్రజలు ప్రతిష్టాత్మకంగా భావించే సంస్థలు కూడా ఉండటం గమనార్హం. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఫాసిస్టు ధోరణులను పెంచడానికి కూడా వెనుకాడదని ఆర్థికవేత్తలు చెబుతారు. 2014 ఎన్నికల సందర్భంగా భారత్‌లోని కార్పొరేట్లు బిజెపికి అనుకూల వైఖరి తీసుకున్న సంగతి తెలిసిందే. అధికశాతం మీడియా సంస్థలు కూడా ఇదే వైఖరిని తీసుకోవడం యాధృచ్ఛికమేమి కాదు. నరేంద్రమోడీ నేతృత్వంలో గుజరాత్‌లో అద్భుతాలు జరిగిపోయాయన్న భ్రమలను ఒక వ్యూహం ప్రకారం అనేక మీడియా సంస్థలు అప్పట్లో ప్రచారంలోకి తెచ్చాయి. ఆ తరువాత వాస్తవాలు వెలుగులోకి వచ్చినా వాటిని పట్టించుకోలేదు. నోట్లరద్దు, జిఎస్‌టిలతో బ్రహ్మాండం బద్దలవుతుందన్నట్లుగా బిజెపి చేసిన ప్రచారానికి బాకా ఊదింది కూడా ఈ సంస్థలే! ఇప్పుడు వెలుగులోకి వస్తున్న ప్రజల కష్టనష్టాలను తప్పనిసరి పరిస్థితుల్లో చెప్పాల్సివస్తున్నా వాటివెనుక దాగిఉన్న అసలు కారణాన్ని మాత్రం చెప్పడం లేదు. దళితులు, మైనార్టీలపై దాడులు, విద్యాకాషాయి కరణ, ప్రబలుతున్న నిరుద్యోగం వంటి అంశాల్లోనూ మీడియా పాక్షికంగానే స్పందించిన విషయం తెలిసిందే. పెట్టుబడి ప్రయోజనా లకనుగుణంగా పాలకపార్టీ పట్ల కార్పొరేట్ల వైఖరి మారితే ఈ మీడియా సంస్థల వైఖరి కూడా మారుతుంది. వాస్తవానికి సరళీకరణ ఆర్థిక విధానాల దుష్ఫలితాలపై మొదటినుండి మీడియా శీతకన్నే వేసింది. పెట్టుబడి ప్రయోజనాల కనుగుణంగా అమెరికా అనుకూల వైఖరిని తీసుకుంది. అణు ఒప్పందానికి వ్యతిరేకంగా వామపక్షాలు యుపిఎ నుండి బయటకు వచ్చినప్పుడు, దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం నిర్వహించినప్పుడు మీడియా స్పందన అంతంతమాత్రమే! అమెరికాకు జూనియర్ పార్టనర్‌గా పాలకులు దేశాన్ని మార్చివేస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరించడం కూడా కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణ కోసమే !

విద్యుత్ స్మార్ట్ బాదుడు

కరెంటు చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. బిల్లులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నారు. చార్జీలు పెంచలేదని, ఆ పాపం మాది కాదని కూటమి నేతలు నమ్మబలుకుతున్నారు. రాబోయే కాలంలో పెంచేది లేదని, ప్రస్తుతం ట్రూ డౌన్ ద్వారా రూ.450 కోట్ల తగ్గిస్తున్నట్లు ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. నిజాలు ఏమిటో తెలుసుకుందాం.

మీటర్లు లేకుండానే సర్దుబాటు చార్జీల భారం విపరీతంగా ఉంది. మీటర్లు కూడా తోడైతే ఇక బాదుడుకు అంతే ఉండదు. అందుకే మీటర్లను అడ్డుకోవాలి. అనుమతి లేకుండా పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చెత్త పన్ను చెల్లించకుండా జనం ఉద్యమించ డంతో రద్దయింది. రైతుల పంపుసెట్లకు మీటర్లపై పోరాడటంతో తాత్కాలికంగా ఆగింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాల్లో మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు వెనక్కి తగ్గక తప్పలేదు. మన రాష్ట్రంలోనూ ఉద్యమం తీవ్రతరం చేద్దాం. సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలి. అదనపు వసూళ్లు ఆపివేయాలి. మిగులును వినియోగదారులకు బదలాయించాలి. చార్జీలు తగ్గించాలి. స్మార్ట్ మీటర్లు ఒప్పందాలు రద్దు చేయాలి. మీటర్ల బిగింపు ఆపాలి. పెట్టిన మీటర్లు తొలగించాలి.



మరింత పెరిగిన బాదుడు

సాంకేతికంగా వచ్చిన మార్పులతో కరెంటు చార్జీలు తగ్గించవచ్చు. ఒకనాడు రూ.12 ఉన్న సోలార్ విద్యుత్ నేడు 2 రూపాయలకే లభిస్తోంది. అయినా బిల్లులు పెంచుతూనే పోతున్నారు. కరెంటు బిల్లు చూస్తే వాస్తవాలు పూర్తిగా అర్థం కావు. ప్రతి నెలా వాడిన కరెంటుపై యూనిట్‌కు రూ.1.90 పైసల నుండి రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. ఇది అసలు చార్జి. ఇక కొసరు చార్జీలు ఎన్నో. ఫిక్సడ్ చార్జి, కస్టమర్ చార్జి వసూళ్లు సాగుతున్నాయి. సర్ చార్జీలు, పెనాల్టీలు వేస్తున్నారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జి (ఎఫ్.పి.పి.సి.ఎ) లతో పెద్ద మోసం జరుగుతోంది. ఏ వస్తువుకైనా, ఏ సర్వీసుకైనా వాడుకున్న సంవత్సరం, ఐదేళ్ల తర్వాత మళ్లీ, మళ్లీ చార్జీలు వసూలు చేయటం విడ్డూరం. నాడు టిడిపి ప్రభుత్వం విద్యుత్‌పై సర్దుబాటు చార్జీల విధానాన్ని పెట్టింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కొనసాగించాయి. 2014 నుండి 19 వరకు వాడుకున్న కరెంటుపై 36 నెలల నుండి రూ.3 వేల కోట్ల ట్రూఅప్ చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారు. 2022-23, 23-24 సంవత్సరంలో వాడుకున్న కరెంటుపై రూ.15,485 కోట్ల అదనంగా సర్దుబాటు చార్జీలను కూటమి ప్రభుత్వ హయాంలో మోపారు. ప్రతి నెల, గత నెలలో వాడుకున్న కరెంటుపై సర్దుబాటు చార్జీలు వసూలు చేసుకోవచ్చని మోడీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీని అవకాశంగా తీసుకొని వైసిపి పాలనలో ప్రతి నెలా 40 పైసలు అదనంగా సర్దుబాటు చార్జీల బాదుడు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేయకపోగా కొనసాగిస్తున్నది. ఈ సంవత్సరం లోనే రూ. 2787 కోట్ల చేశారు. ఇలా 4 రకాల సర్దుబాటు చార్జీల బాదుడు సాగుతోంది. ఖర్చులు పెరిగి లోటు వస్తే ప్రభుత్వం భరించాలి తప్ప, బిల్లు కట్టిన దానిపై మళ్లీ, మళ్లీ సర్దుబాటు చార్జీలు వేయటం అక్రమం. ఈ అడ్డగోలు వసూళ్లు ఇంకానా.. ఇకపై సాగకూడదు. ఈ విధానమే రద్దు కావాలి.

కరెంటు బిల్లుపై కూడా విద్యుత్ సుంకం (ఎలక్ట్రిసిటీ డ్యూటీ) వసూలు చేస్తూ ప్రభుత్వాలు ఖజానా నింపుకుంటున్నాయి. ప్రతి యూనిట్ వాడకంపైన 6 పైసలు సుంకం విధిస్తున్నారు. వైసిపి సర్కార్ వ్యాపారం, పరిశ్రమలపై దీనిని 6 పైసల నుండి 100 పైసల (రూపాయి)కి పెంచింది. హైకోర్టు ఈ పెంపు చెల్లదని తీర్పు ఇచ్చింది. కూటమి దీనిని రద్దు చేయకపోగా, చట్టబద్ధత కల్పించి యథేచ్ఛగా రూపాయి వసూలు చేస్తోంది. అదనపు లోడ్ పేరుతో డెవలప్‌మెంట్ చార్జీలు, బిల్లుపై అదనపు డిపాజిట్లు, కొత్త కనెక్షన్లకు డిపాజిట్ల పెంపు... ఇలా పలు రూపాలలో ప్రజలను పీడించి వసూలు చేస్తున్నారు.

విద్యుత్ ప్రత్యక్ష భారాలే కాదు, పరోక్ష భారాలు ఎన్నో ఉన్నాయి. కూల్ డ్రింక్, వాటర్ బాటిల్, పాల ప్యాకెట్ ఏది కొన్నా, ఫ్రిజ్‌లో ఉంచినందుకు రూ.2 అదనపు భారం పడుతోంది. విద్యుత్ చార్జీలు పెంచగానే రైలు చార్జీలు పెంచుతున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో కరెంటు ఖర్చు పెరిగి ఇంటి పన్నులు పెంచుతున్నారు. ఇలా ఎడా..పెడా.. విద్యుత్ భారాలు సాగుతున్నాయి. కొన్ని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఈ భారాలతో మూతపడుతున్నాయి. ఉపాధి దెబ్బ తింటున్నది. అభివృద్ధి కుంటుపడుతున్నది.

కూటమి ప్రభుత్వంలోనూ ఊరట ఏమీ లేదు. మరింతగా భారాలు పెరిగాయి. 2019-24 సంవత్సరాల్లో ముందుగానే అధిక, అదనపు వసూళ్లు చేయటం వల్ల విద్యుత్ సంస్థల్లో మిగులు ఏర్పడింది. 2024-25 సంవత్సరంలో తూర్పు (ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్) పంపిణీ సంస్థకు 1200 కోట్ల రూపాయలు మిగులు వచ్చింది. ఈ మిగులును దారి మళ్ళించి, సంవత్సర ఖర్చుల్లో కలిపేసి ప్రజల కళ్ళుగప్పుతున్నారు. దానిని వినియోగదారులకు బదలాయించి, చార్జీలు తగ్గించాలి. లెక్కలేవీ చూడకుండానే ముందుగానే సర్దుబాటు చార్జీలు అధికంగా వసూలు చేయటం మరో దగా. అంకెల మాయాజాలం సాగిస్తున్నారు. ఆషాఢం రిబేట్ లాగా ముందుగా వేల కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలు వసూలు చేసి రూ.450 కోట్లు తగ్గిస్తున్నట్లు నాటకం ఆడుతు న్నారు. ఇదంతా పచ్చి మోసం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి వరకు వసూలు చేసిన అదనపు చార్జీలు ప్రజలకు తిరిగిఇవ్వాలి. సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి. రాబోయే బిల్లులలోనైనా వీటిని తగ్గించాలి.

దోపిడి, అవినీతి, కుమ్మక్కు

విద్యుత్ శాఖలో ఖర్చులు ఎందుకు పెరుగుతున్నాయి? భారాలు ఎందుకు పెంచుతున్నారు? సంస్కరణల పేరుతో పాలకులు తెచ్చిన విధానాలే దీనికి కారణం. విద్యుత్ ఉత్పత్తి క్రమంగా బడా కంపెనీల చేతిలోకి వెళ్ళింది. బడా సంస్థలతో ప్రభుత్వాలు అక్రమ ఒప్పందాలు చేసుకున్నాయి. తాజాగా 25 సంవత్సరాల పాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ సరఫరా చేసే ఒప్పందం కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకి ద్వారా అదానితో వైసిపి ప్రభుత్వం చేసుకున్నది. రూ.1750 కోట్ల లంచాలు తీసుకుని ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా కోర్టులలో సాక్ష్యాధారాలతో విచారణ జరుగుతోంది. ఈ ఒప్పందం వల్ల భవిష్యత్తు తరాలపై రూ. లక్షా ఇరవై వేల కోట్ల భారం పడుతుందని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. ఈ ఒప్పందం చెల్లదని నేటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నాడు హైకోర్టులో కేసు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచినా ఈ ఒప్పందం రద్దు చేయలేదు. కనీసం విచారణ కూడా చేయటం లేదు. ఒప్పందం రద్దు సాధ్యం కాదని తేల్చేసింది. ఎవరి అవినీతిని ఎవరు కాపాడుతున్నారు? ఎవరు, ఎవరితో కుమ్మక్కవుతున్నారు? ఇదే కాదు. స్వదేశీ, విదేశీ బొగ్గు కార్పొరేట్ల చేతిలో ఉంది. పోర్టులు, రవాణాలోనూ దోచుకుంటున్నారు. విద్యుత్ స్వల్పకాలిక కొనుగోళ్లలో వేలాది కోట్ల రూపాయల కుంభకోణాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ బినామీ సంస్థగా చెప్పిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ నాడు, నేడు విద్యుత్ రంగాన్ని శాసిస్తున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు మొదలు మొత్తం మెటీరియల్ కొనుగోలులో వేల కోట్లు దోచుకున్నారు. వ్యవసాయ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు వారికే దక్కింది. ఆ షిర్డీ సాయి సంస్థకు చెందిన ఇండో సోల్ కంపెనీకి ఉలవపాడు, కరేడు వద్ద 8 వేల ఎకరాల భూములను కూటమి ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా లాక్కొని వీరికి కట్టబెట్టింది. ఈ సంస్థ ఎన్నికలలో టిడిపికి రూ.30 కోట్ల బాండ్లు రూపంలో ముడుపులు ఇచ్చింది. అదాని, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, కార్పొరేట్ కంపెనీల అవినీతి, దోపిడీలో బిజెపి, టిడిపి, వైసిపి, జనసేనలకు ఏమీ తేడా లేదు. అందరూ దోషులే. అందరి విధానాలు ఒక్కటే. పాలకులు, కార్పొరేట్లు, ఉన్నతాధికారులు కుమ్మక్కు అయ్యి విద్యుత్ రంగాన్ని నాశనం చేస్తున్నారు. ప్రజలపై భారాలు పెంచుతున్నారు.

అదాని స్మార్ట్ బాంబ్

అదాని ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లతో దోపిడీలో మరో నూతన అంకం ప్రారంభ మయ్యింది. రాష్ట్రంలోని రెండు కోట్ల వినియో గదారులకు బాగున్న పాత మీటర్లు తొలగించి, అదాని స్మార్ట్‌మీటర్లు దశలవారీగా బిగిస్తు న్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు. విధానం మార్పు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీక రణకు ఇది తొలి మెట్టు. 10 సంవత్సరాల పాటు నిర్వహణ అదానికి అప్పగిస్తున్నారు. మీటర్ పెట్టడమంటే, రాబోయే కాలమంతా అదానీ ద్వారా విద్యుత్ సరఫరాకి అంగీకరిం చినట్లే. తొలి దశలో 41 లక్షల మీటర్లు పెడుతు న్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రమాదం లేదని, ఉచితమని, కేంద్రం సహాయం చేస్తున్నదని, అన్ని ఇళ్లకు పెట్టబోమని, సమాచారం గంటగంటకి పంపుతామని, బిల్లులు ఎక్కువ రావని, పారద ర్శకత ఉంటుందని అధికారులతో ప్రభుత్వం ప్రకటనలు చేపిస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సమాధానం చెప్పే ధైర్యంలేక అధికారులతో ఇటువంటి అబద్ధపు ప్రకటనలు చేయిస్తున్నారు. నష్టం లేకపోతే ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని లోకేష్, కూటమి నేతలు ఎందుకు పిలుపునిచ్చారు? మీటర్ల ఒప్పందం అక్రమం, రద్దు చేయాలని టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హైకోర్టులో ఎందుకు కేసు వేశారు. నాడు తప్పు, నేడు ఒప్పు ఎలా అయింది. మీటర్లలో తేడా వచ్చిందా? కాదు, కూటమి పాలకులలో మార్పు వచ్చింది? ఈ మోసపూరిత ప్రకటనలు నమ్మకండి. వాస్తవాలు గమనించండి. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలి. సింగిల్ ఫేస్ మీటర్‌కు రూ.9 వేలు, త్రీ ఫేస్ మీటర్‌కు రూ.17 వేలు 93 వాయిదాలలో వినియోగదారులే చెల్లించాలి. గంటగంటకు రీడింగ్ తీస్తారు. పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు. చలికాలం ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు చెల్లించాలి. ఇప్పటికే “టైం ఆఫ్ ది డే” విధానం ప్రకారం కొన్ని సంస్థలకు వేరువేరు రేట్లు వసూళ్లు ప్రారంభించారు. ఈ మీటర్ల వలన మన ఇల్లు, సంస్థ, కుటుంబం మొత్తంపై అదానీ సంస్థ డిజిటల్ నిఘా ఉంటుంది. వ్యక్తిగత గోప్యతకు ప్రమాదమని ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రీపెయిడ్ పద్ధతి, మీటర్ ఖర్చు ఒకేసారి చెల్లించాలి లేదా నెల అద్దె వసూలు అనుమతిస్తూ, విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనలు మార్చి, కూటమి సర్కార్ ఈ సంవత్సరం ఫిబ్రవరి 25న 921, 923 నంబర్ గెజిట్‌లు విడుదల చేసిన మాట నిజం కాదా? రెండు కోట్ల మీటర్లకు రూ.25 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. కేంద్రం ఎంత ఇస్తోంది. అయినా కేంద్రం ఇచ్చే సొమ్ము మోడీ జేబులోదా? జనం సొమ్ము కాదా? బాగున్న మీటర్లు వృథాగా ఎందుకు పడేయాలి? కొత్త మీటర్లు ఎందుకు పెట్టాలి? చిన్న సంస్థలు, పరిశ్రమలకు స్మార్ట్‌మీటర్ బిగించిన తర్వాత రెండు రెట్లు నుండి పది రెట్లు వరకు బిల్లు పెరిగిందని గగ్గోలు పెడుతున్నా, ప్రభుత్వానికి వినపడటం లేదా? 24 గంటలలో దీనిపై విచారణ చేసి, నివేదిక తెప్పిస్తామని విద్యుత్ శాఖ మంత్రి చేసిన ప్రకటన ఏమైంది ?వైర్‌లెస్ టెక్నాలజీ ద్వారా గుజరాత్, ఢిల్లీలో ఉన్న అదానీ కార్యాలయంతో మన మీటరుతో అనుసం ధానం జరుగుతుంది. జవాబుదారీతనం ఉండదు. ఇప్పటి వరకు వైసిపి, కూటమి ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల వివరాలు బయట పెట్టలేదు. ఎందుకు ఈ గోప్యత? అనుమతి లేకుండా మీటర్లు బిగించే హక్కు ప్రభుత్వానికి ఉందా? ఇది ప్రజాస్వామ్యమా? చట్టబద్ధమా? అదాని, కార్పొరేట్ కంపెనీల మోసాలు జగద్వితమే. అటువంటి కంపెనీ చేతిలో మన భవిష్యత్తు భద్రమా? ప్రజల అంగీకారం లేకుండా మీటర్లు పెట్టబోమని మంత్రి ప్రకటించారు. అయినా ఈ ప్రజల కళ్ళుగప్పి మోసపూరిత పద్ధతులలో నయానా భయానా మీటర్లు పెడుతున్నారు. కొన్నిచోట్ల గోడలు దూకి మరీ, మరికొన్ని చోట్ల పాత మీటర్ చెడిపోయిందనీ అబద్ధాలు చెప్పి మీటర్లు పెడుతున్నారు. ముందు కార్యాలయాల వరకే అని నమ్మించారు. ఆ తర్వాత షాపులు, పరిశ్రమలకే పరిమితం అన్నారు. ఇప్పుడు కొన్ని ఇళ్ళకే అంటున్నారు. పేదల కాలనీలలో కూడా పలు చోట్ల మీటర్లు బిగించారు. పార్టీలకతీతంగా జనమంతా మేలుకోవాలి. మీటర్లు లేకుండానే సర్దుబాటు చార్జీల భారం విపరీతంగా ఉంది. మీటర్లు కూడా తోడైతే ఇక బాదుడుకు అంతే ఉండదు. అందుకే మీటర్లను అడ్డుకోవాలి. అనుమతి లేకుండా పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చెత్త పన్ను చెల్లించకుండా జనం ఉద్యమించడంతో రద్దయింది. రైతుల పంపుసెట్లకు మీటర్లపై పోరాడటంతో తాత్కాలికంగా ఆగింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాల్లో మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రభు త్వాలు వెనక్కి తగ్గక తప్పలేదు. మన రాష్ట్రంలోనూ ఉద్యమం తీవ్రతరం చేద్దాం. సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలి. అదనపు వసూళ్లు ఆపివేయాలి. మిగులును వినియోగదారులకు బదలాయి ంచాలి. చార్జీలు తగ్గించాలి. స్మార్ట్ మీటర్లు ఒప్పందాలు రద్దు చేయాలి. మీటర్ల బిగింపు ఆపాలి. పెట్టిన మీటర్లు తొలగించాలి. ఆగస్టు 5వ తేదీన ప్రజా వేదిక ఆధ్వర్యంలో భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతి రేకంగా జరిగే ఆందోళనలో భాగస్వాములం అవుదాం.

ఎం.వేణుగోపాలరావు
/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /





ప్రజాశక్తి తొలి సంపాదకుడు


మద్దుకూరి చంద్రం

కృష్ణాజిల్లా వెంట్రప్రగడ గ్రామంలో 1907లో జన్మించిన మద్దుకూరి చంద్రశేఖరరావుగారు స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి అనేకసార్లు జైలుశిక్షను అనుభవించారు. ఆ తరువాత అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి 1935-36లో కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికైనారు. ఆ పిమ్మట కొంతకాలం కాంగ్రెస్‌లోనే వామపక్షవాదిగా ఉండి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. అటుపిమ్మట కమ్యూనిస్టు పార్టీలో చేరి నాయకత్వ స్థాయికి ఎదిగారు.

కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యంలో ఉన్న కంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకత్వంలో 1973లో రాజమండ్రిలో నెలకొల్పిన నవశక్తి వారపత్రికకు ముద్దుకూరి చంద్రశేఖరరావుగారు సంపాదకులుగా వ్యవహరించారు. ఆ తరువాత ఆ పత్రిక విజయవాడకు తరలించారు. నిర్బంధ కాలంలో రహస్యంగా నిర్వహించిన స్వతంత్ర భారత్‌కు ఆయన సంపాదకుడిగా ఉన్నారు. కమ్యూనిస్టుపార్టీకి బహిరంగంగా పనిచేయడానికి అవకాశాలు ఏర్పడిన తరువాత పార్టీ అధికార పత్రికగా ప్రారంభించబడిన ప్రజాశక్తి వారపత్రికకు 1942 నుండి 45 వరకూ సంపాదకులుగా ఆయన పనిచేశారు. అటుపిమ్మట 1952లో విశాలాంధ్ర దినపత్రికగా మారినప్పుడు దాని సంపాదకత్వ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ప్రారంభంలో ప్రచురించబడిన నవశక్తి, ప్రజాశక్తి , విశాలాంధ్ర పత్రికలకు సంపాదకత్వాన్ని నెరపిన కారణంగా ఆయనకు కమ్యూనిస్టు పత్రికల పితామహుడుగా పేర్కొనడం జరిగింది. పత్రిక సంపాదకుడుగా ఉంటూనే తన వ్యాసాలద్వారా ఆయన అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ప్రజానాట్యమండలి కృషికి ఎంతగానో తోడ్పడి తెలుగు ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవనానికి సహాయపడిన వారిలో ఆయన ప్రముఖులు. ◆









ప్రజాశక్తి ప్రస్థానం మహోజ్వలం

ఏదైనా ఒక ఉద్యమం అది స్వాతంత్ర్య పోరాటం కావచ్చు, విప్లవ కార్యాచరణ కావచ్చు. అలాంటి సమయాలలో ప్రతి దేశంలోనూ పత్రికలు విశిష్ట పాత్రను పోషించాయి. అందుకే వాటి పాత్ర గురించి లెనిన్ ఇలా అన్నారు. ' పత్రిక సమిష్టి ఆందోళన కారుడు మాత్రమే కాదు... సమిష్టి ఉద్యమ నిర్మాత కూడా'.

భారతదేశంలో అభ్యుదయ భావాలు-పత్రికలు

భారతదేశంలో సోషలిస్టు భావాల్ని ప్రచారం చేయటానికి మొట్టమొదటిగా 'సోషలిస్టు' అనే వారపత్రిక 1922 ఆగుస్టు 5న ప్రారంభమైంది. మన స్వాతంత్ర్య ఉద్యమంలో కాన్పూరు కుట్రకేసు దేశవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. సరిగ్గా ఆ కాలంలోనే కమ్యూనిస్టు భావాలు దేశం నలుమూలలకూ వ్యాపించటం ప్రారంభమయింది.

సోషలిస్టు భావాల వ్యాప్తికి దేశంలో రహస్యంగా ప్రచురింపబడిన పత్రికలు, పుస్తకాలతో పాటు, ఇంగ్లండ్ నుండి రహస్యంగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పోలీసుల కన్నుగప్పి పత్రికలు, పుస్తకాలు వచ్చేవి. ఈ సారస్వతం యువకులకూ, విద్యార్థులకూ అమృత సమానంగా ఉపకరించేవి.

1934-39 మధ్యకాలంలో మద్రాసు నుండి వెలువడిన 'న్యూఏజ్' ఆంగ్ల మాసపత్రిక దక్షిణ భారతదేశంలో, 1937లో పి.సి.జోషి సంపాదకత్వంలో బొంబాయిలో ప్రారంభించబడిన 'నేషనల్ ఫ్రంట్' వారపత్రిక కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు ప్రజాసంఘాల నిర్మాణానికి కూడా ఎంతగానో తోడ్పడింది.

ఆంధ్రలో 1933 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైంది. అభ్యుదయ భావాలను ప్రచారం చేసేందుకు 1937లో 'నవశక్తి' వారపత్రిక ప్రారంభించబడింది.

రెండో ప్రపంచయుద్ధం 1939లో ప్రారంభమైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు బ్రిటన్‌తోపాటు భారతదేశాన్ని కూడా యుద్ధంలోకి దించారు. ఆ కాలంలో బ్రిటిష్ చర్యను విమర్శించిన పత్రికలు క్రూరంగా అణచివేయబడ్డాయి. 'నేషనల్ ఫ్రంట్' వారపత్రికతోపాటు, వివిధ భారతీయ భాషల్లో ముద్రింపబడే పత్రికలన్నీ నిషేధింపబడ్డాయి. తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య సంధానకర్తగా, 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్లంలో మాసపత్రిక ప్రచురించబడింది. ఆ కాలంలో ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వివిధ భాషల్లో రహస్య పత్రికలు పరిమిత స్థాయిలోనైనా నడిచాయి. ఆంధ్రదేశంలో 'స్వతంత్ర భారత్' ఒకటి.

జాతీయ, అంతర్జాతీయ మార్పుల దృష్ట్యా 1942లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగింపబడింది. ఆంధ్రలో ప్రజాశక్తి వారపత్రిక వెలువడింది. 1945లో అది దినపత్రికగా ప్రచురించబడింది.

1948-52 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ తిరిగి తీవ్ర నిర్బంధ విధానానికి గురయింది. కమ్యూనిస్టులు పని చేసే పత్రికలను కూడా ప్రభుత్వం నిషేధించింది. నిర్బంధ కాలంలో బొంబాయి నుండి గుజరాతీ, మరాఠీ భాషల్లో 'మషాల్' పేరుతో దినపత్రికలు వెలువడ్డాయి. కొన్ని మాసాల తర్వాత అవి నిషేధించబడ్డాయి. తర్వాత 1949-51 మధ్యకాలంలో మరాఠీభాషలో 'యుగంతర్' గుజరాతీ భాషలో 'జై గుజరాత్' వారపత్రికలు వెలువడ్డాయి.

1952 తర్వాత


1952 నుండి తిరిగి కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేయసాగింది.. దేశవ్యాపితంగా వివిధ భాషల్లో పత్రికలు ప్రారంభించబడ్డాయి. ఆంధ్రాలో 'ప్రజాశక్తి' 'మళయాళంలో దేశాభిమాని', బెంగాల్‌లో 'స్వాధీనత' అలాంటి పత్రికలే.

ఉత్తేజకర స్మృతులు

బొంబాయి నుండి వెలువడే పత్రిక 'నేషనల్ ఫ్రంట్' ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం కాగానే నిషేధింపబడింది. ఆ తర్వాత 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్ల మాసపత్రిక రహస్యంగా ప్రచురించబడింది. పోలీసులు బొంబాయిలో దీనికి పెద్ద ప్రెస్ ఉండేదని భావించేవారు. కానీ ఒక చిన్న ప్రెస్ మాత్రమే ఉండేది. ఆ ప్రెస్ కోసం రెండున్నర సంవత్సరాల కాలం పోలీసులు బొంబాయి నగరమంతా గాలించారు. కాని ప్రెస్ స్థావరం దొరకలేదు. అలా అడుగడుగునా ఆపదల్ని ఎదుర్కొంటూ ప్రాణసమానంగా ప్రెస్‌ను కాపాడుకోవాల్సి వచ్చేది. ఆ రోజుల్లో బెంగాల్, పంజాబ్, ఆంధ్ర తదితర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది యువకులు కంపోజిటర్స్‌గా ఆ ప్రెస్‌లో పనిచేశారు. ఆ రోజుల్లోనే ఆంధ్రదేశానికి చెందిన వెంకటేశ్వరరావు అనే కంపోజిటర్ రహస్య ప్రెస్‌లో పనిచేస్తూ మృతి చెందాడు. పత్రికల్లో పనిచేయటానికి, త్యాగాలు చేయటానికి, ఆ రోజుల్లో ఎంతోమంది ఉత్సాహపడుతూ ఉండేవారు. ఎడిటర్లు, వర్కర్లు అందరూ పూర్తికాలం అదే పనిగా ఉన్న వారే. అదేవిధంగా వేతనాలలో కూడా వ్యత్యాసాలు ఉండేవి కావు. ప్రతి ఒక్కరికీ రు.25/-లు వేతనం ఇవ్వబడేది. కుటుంబం ఉన్నవారికి మాత్రం అదనంగా రు.30/-లు అలవెన్సు ఇవ్వబడేది. ప్రెస్‌లో పనిచేసేవారిలో పెక్కుమంది బ్రహ్మచారులుగా ఉండేవారు. పని ఒత్తిడిగా ఉండటం వల్ల ఆ రోజుల్లో రెండు షిఫ్టులు నిర్వహింపబడేవి. అవసరం అయినప్పుడు సిబ్బంది రోజుకు 20 గంటలు పనిచేసేవారు.

ప్రెస్‌పై దాడి - వీరోచిత ప్రతిఘటన

1945 జనవరిలో బొంబాయిలో కాంగ్రెస్‌వాళ్లు జనాన్ని రెచ్చగొట్టి పత్రిక ప్రెస్‌పై దాడి చేయించారు. ప్రెస్‌లోని ప్రతి ఒక్క కార్మికుడూ వీరోచితంగా నిలబడి ప్రతిఘటించారు. దాడిచేసిన మూక వందరెట్లు ఉన్నా కార్మికులు చలించలేదు. తరిమితరిమి కొట్టారు. దాదాపు



వి.ఆర్.బొమ్మారెడ్డి

కార్మికులందరికీ ఆ ప్రతిఘటనలో దెబ్బలు తగిలాయి. అయినా నిలబడి ఎదుర్కొన్నారు. దుండగుల దాడిలో అచ్చుయంత్రం దెబ్బతిన్నది. న్యూస్‌ప్రింట్ కాల్చివేయబడింది. అయినా పత్రిక ఆగిపోలేదు. మరో ప్రెస్‌లో రాత్రింబవళ్లు పనిచేసి రెండు వారాలపాటు పార్టీ పత్రికలు ముద్రింపబడ్డాయి. అటు తర్వాత కూడా కాంగ్రెస్‌వాదులు పెక్కుసార్లు ప్రెస్‌పై దాడిచేశారు. ఒకసారి బాంబు కూడా విసిరారు. 1950లో ప్రజాశక్తి మేనేజర్ నాగులపల్లి కోటేశ్వరరావును అరెస్టుచేసి రాజమండ్రివద్ద కాల్చి చంపారు.

ఆంధ్రలో పత్రికలు

ఆంధ్రలో ప్రచురించబడిన అభ్యుదయ, కమ్యూనిస్టు పత్రికలకు కూడా ఉజ్వల చరిత్ర ఉంది. ఎన్నో నిర్బంధాలు... ఎన్నో ఆటుపోట్లు.. ఎంతో దమనకాండ.. వాటన్నింటినీ త్యాగదీక్షతో.. ఆశయబలంతో ఎదుర్కొని ఇక్కడ కూడా పత్రికలు ప్రచురించాల్సి వచ్చింది.

ఉప్పు సత్యాగ్రహం అనంతరం అనేకమంది యువకులు, టెర్రరిస్టు భావాలుగల వారు సోషలిజం వైపుకు ఆకర్షింపబడ్డారు. తత్ఫలితంగా కొన్ని పత్రికలు వామపక్ష రాజకీయాలతోపాటు, సోషలిస్టు భావాలను అవి స్పష్టంగా ప్రచారం చేయనారంభించాయి. 1935 ప్రాంతంలో 'ప్రభ' అనే పక్షపత్రిక అతివాద భావాలను, కొంతవరకు సోషలిస్టు భావాలను వ్యాప్తిలోకి తెచ్చింది.

'నవశక్తి'

అయితే... సోషలిస్టు పత్రికగా ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా ప్రచురింపబడిన పత్రిక 'నవశక్తి'. 1937, డిసెంబర్ 15న రాజమండ్రి నుండి ఆ తర్వాత విజయవాడ నుండి నడపబడింది. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో ఉంది. కొన్నాళ్లు రాజమండ్రి నుండి నడిచిన నవశక్తి ఆ తర్వాత విజయవాడ నుండి వెలువడింది.

నవశక్తి త్రిపుర కాంగ్రెస్ సంచిక భారత జాతీయోద్యమాన్ని మార్క్సిస్టు దృక్పథంతో సింహావలోకనం చేసింది. అలాగే రష్యన్ సంచిక సోవియట్ విజయాలను వివిధ వ్యాసాలలో వివరించింది. పై రెండు ప్రత్యేక సంచికలు దేశభక్తుల్ని ఎంతగానో ఆకర్షించి, వారు కమ్యూనిజంవైపు మొగ్గటానికి తోడ్పడినాయి.

రెండో ప్రపంచయుద్ధం ఆరంభం కాగానే నిర్బంధ విధానం తీవ్రమైంది. దాన్ని ముందుగానే పసికట్టి పత్రికకు సంబంధించిన ప్రెస్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా ముందే జాగ్రత్తలు తీసుకొని నాయకులతో పాటు సంపాదకులు కూడా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.

రహస్య పత్రికగా 'స్వతంత్ర భారత్'

1939-42 మధ్యకాలంలో 'స్వతంత్ర భారత్' అనే పత్రిక రహస్యంగా ప్రచురించబడింది. ఆ పత్రిక దగ్గర ఉంటే జైలుశిక్ష పడే రోజులవి. అయినా అనేకమంది ఆ పత్రికను చదివేవారు..

ప్రజాశక్తి వారపత్రిక

1942 జూన్‌లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగింపబడటంతో నాయకులు చాలామంది అజ్ఞాతవాసం నుండి, జైళ్ల నుండి బయటకి వచ్చారు. ఆ స్థితిలో 1942, జూన్ 17న ప్రజాశక్తి వారపత్రికగా అవతరించింది. అధికార రీత్యా కమ్యూనిస్టు పత్రికగా పేర్కొనబడిన మొదటిపత్రిక ప్రజాశక్తి. ఆ విధంగా రెండున్నర సంవత్సరాలపాటు వారపత్రికగా ప్రజాశక్తి నడిచింది.

దినపత్రికగా ప్రజాశక్తి

ఇప్పటివలె కాక ఆనాడు ఒక కమ్యూనిస్టులు పనిచేసే దినపత్రిక ప్రచురణకు ప్రభుత్వ అనుమతి పొందాలంటే చాలా కష్టమైన పని. దానికితోడు దినపత్రికకు అవసరమైన సిబ్బందిని, యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవటానికి తగిన వనరులు, డబ్బు కూడా అవసరం. దినపత్రిక నిధికి పిలుపు ఇవ్వగానే సామాన్య ప్రజలు, పార్టీ అభిమానులెందరో విరాళాలందించారు. అభ్యుదయ యువకవులు సంపాదకవర్గంలో పనిచేయటానికి తమ సంసిద్ధత వెల్లడించారు. ప్రఖ్యాత చిత్రకారుడు, కవి, నవలాకారుడు అయిన అడవి బాపిరాజు ఉత్తేజితుడై తనంతతానుగా ప్రజాశక్తి ముఖచిత్రానికి అక్షరాలు రాసి పంపారు.

1945 డిసెంబర్ 3న ప్రజాశక్తి దినపత్రిక తొలి సంచిక విజయవాడ నుంచి వెలువడింది. ఆ విధంగా తెలుగునాట శ్రామికుల వాణిగా, అభ్యుదయ భావాల పతాకంగా ఉంది. ఆధునిక సౌకర్యాలు లేని ఆనాడు, విజయవాడలో దినపత్రిక నడపాలంటే అంత సులువైన పనికాదు. సంపాదకవర్గంలో చేరిన వారెవరికీ దినపత్రికలోఅంతకుముందు పనిచేసిన అనుభవం లేదు. దీక్ష, ఉత్సాహమే వారికున్న పెట్టుబడి. వివిధ ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలే ఎక్కడికక్కడ పత్రికా విలేకరులుగా పనిచేసేవారు.

ప్రజలిచ్చిన విరాళాలతో, కాట్రగడ్డ సోదరుల తోడ్పాటుతో మొగల్‌రాజపురంలో 'ప్రజాశక్తి నగర్' వెలిసింది. అక్కడే పత్రికలో పనిచేసేవారు కాపురాలుండేవారు. అభిమానులకు ప్రజాశక్తినగర్ యాత్రాస్థలంగా ఉండేది. ఎన్ని ఇబ్బందులెదుర్కోవాల్సి వచ్చినా ప్రజాశక్తి తెలుగు పత్రికా ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని పొందగలిగింది.

1948లో కమ్యూనిస్టు ఉద్యమంపై నిర్బంధకాండ ప్రారంభమైంది. పత్రికా కార్యాలయంపై పలుమార్లు పోలీసుదాడులు జరిగాయి. చివరికి నిర్బంధకాండ తీవ్రతరమైంది. పత్రిక ముద్రణాలయాన్ని, ప్రచురణల్ని, గ్రంథాలను పోలీసులు దాడిచేసి నాశనం చేశారు. ఆ విధంగా 1948 ఏప్రిల్ 22 తేదీలో ప్రజాశక్తి మూతపడ్డది.

రహస్య కాలంలో పత్రికలు

ప్రభుత్వ క్రూర నిర్బంధకాండలో... పాశవిక దాడుల్లో చాలామంది నాయకులు జైళ్లలో మగ్గవలసి వచ్చింది. వేలాదిమంది కాల్చివేయబడ్డారు. చిత్రహింసలకు గురిచేయబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ సందేశాన్ని ప్రజలకు వేర్వేరు రూపాల్లో అందించటానికి కొన్ని పత్రికలు కృషిచేశాయి. జనత, సందేశం, జనవాణి పత్రికలు అలా నడుపబడ్డాయి.

తిరిగి ప్రజాశక్తి ప్రచురణ

1951 ఆగస్టు నుండి నిర్బంధకాండ కొంతవరకు సడలింది. ప్రధాన నాయకులంతా ఇంకా జైలులోనూ, అజ్ఞాతవాసంలోనూ ఉండగానే 1951 నవంబర్ 21వ తేదీ నుండి ప్రజాశక్తి వారపత్రిగా వెలువడటం ప్రారంభమైంది. 1952 జనరల్ ఎన్నికల సందర్భంగా ద్వైవారపత్రికగా వెలువడింది.

'విశాలాంధ్ర' ప్రారంభం

ఎన్నికల అనంతరం కమ్యూనిస్టు ముఖ్య నాయకులంతా బహిరంగంగా రావటంతో తిరిగి దినపత్రిక ప్రచురించాలని, ఆంధ్ర రాష్ట్రాన్నే గాక విశాలాంధ్రను కూడా సాధించాలనే లక్ష్యంతో దినపత్రికకు 'విశాలాంధ్ర' పేరు పెట్టారు ఆ విధంగా 1952 జూన్ 22న దినపత్రిక అవతరించింది.


మరో మజిలి - జనశక్తి దినపత్రిక

జైలు నుండి నాయకులంతా బయటికి వచ్చిన తర్వాత రానున్న జనరల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనశక్తిని దినపత్రికగా తీసుకురావాలని నిర్ణయించారు. ఆ విధంగా 1966 సెప్టెంబర్ ఒకటిని జనశక్తి దినపత్రికగా ప్రచురణ ప్రారంభమైంది.

ప్రజాశక్తి పునర్వికాసం

తరువాత1968 జులై 28న 'ప్రజాశక్తి' వారపత్రికగా పునరుద్ధరింపబడింది. 13 సంవత్సరాలపాటు ప్రజాశక్తి వారపత్రికగా, ద్వైవారపత్రికగా, ఎన్నికల సందర్భంలో దినపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటి నుండి ప్రజాశక్తి తిరిగి దినపత్రికగా పునఃప్రారంభమై అప్రతి హతంగా ముందుకు సాగుతోంది.

పుస్తకానికి పురిటి నొప్పులు



All roads leads to rome- అన్ని దారులు కూడా రోమ్ నగరానికే చేరుస్తాయి. సుపరిచితమైన ఈ నానుడి మన విజయవాడ నగరానికి వర్తిస్తుంది. దేశం నలుమూలల నుండి కూడా ప్రధాన జాతీయ రహదారులు అన్నీ విజయవాడ నగరాన్ని చేరతాయి. ఈ కారణంగా దక్షిణాపథానికి దండయాత్రలకు వచ్చే రాజ్యాధిపతులకు ఇది మజిలీ స్థావరమయింది, వ్యాపారానికి వచ్చే వర్తకులకు ప్రధాన కూడలి అయింది. ఫలితంగా ఒకనాటి బెజవాడ- వచ్చే పోయే వాళ్ళకు వడ్డించే పూటకూళ్ళ ఇల్లయిందే కాని, తనకంటూ ఒక స్థిరమైన జీవనశైలిని పొందుపర్చుకోగల్గిన నగరం కాలేకపోయింది. నిరంతరంగా కొనసాగిన యుద్ధాలు, దండయాత్రల వల్ల దశాబ్దాల తరబడి ఇక్కడ చోటుచేసుకున్న అరాచక - అస్థిరత్వ పరిస్థితులు కారణంగా చాళుక్యులు తమ రాజధానిని బెజవాడ నుండి రాజమహేంద్రికి తరలించడం తప్పనిసరి అయింది. ఒక నదీతీర పట్టణం నుండి మరొక నదీతీర పట్టణానికి వారు తమ రాజధానిని తరలించాల్సి వచ్చిందంటే అందుకు కారణమైన బలీయమైన పరిస్థితుల్ని మనం విస్మరించలేము. ఈ పరిణామం తర్వాత చాళుక్యుల పాలనలో రాజమహేంద్రి రాజధానిగా గోదావరి- నన్నయ్య- మహాభారతం- తర్వాత దశలో బ్రహ్మసమాజం- విరేశలింగం పంతులుగారు- సర్ఆర్థర్ కాటన్, గౌతమి గ్రంథాలయం- దామెర్ల రామారావు మ్యూజియం, గోదావరి తీరంలో వేదఘోష మొత్తంగా బెజవాడ - రాజమహేంద్రి పట్టణాల 'ఎథోస్' లోనే సుస్పష్టమైన వైవిధ్యం చోటుచేసుకుంది. రాజమహేంద్రి పట్టణంలోని ప్రాంతాల పేర్లు నేటికీ కంబాలచెరువు, లాలాచెరువు, కోటిలింగాలుగా పిలవబడుతుంటే బెజవాడలో గాంధీనగర్, గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్ ఇలా వుంది ఈ వరుస.

ఒక సుస్పష్టమైన సాంస్కృతిక వైవిధ్య రేఖ ఈ రెండు పట్టణాల మధ్య ప్రాచీన చరిత్ర నుండి ఇప్పటివరకు కొనసాగుతూనే వుంది. బెజవాడ చరిత్రకు సంబందించి మరొక ప్రధానమైన చారిత్రక మలుపు తెలంగాణా పోరాటం. నైజాం నవాబు మీద జరిగిన తెలంగాణా సాయుధ పోరాటానికి, బెజవాడకు సంబంధమేమిటని మనకు అన్పించడం సహజమే. చరిత్రలో పలు సామ్రాజ్యాల చక్రవర్తుల సిపాయిల పటాలాలకు మజిలీ (cantonment)గా ఉన్న బెజవాడ, నైజాం నిరంకుశత్వానికి, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటవీరులకు కూడా ఆశ్రయమిచ్చింది. ఈ సాయుధ రైతాంగ పోరాటానికి బెజవాడ నుండి అన్ని రకాల సహకారం అందేది.

విద్యార్థిగా జాతీయ ఉద్యమంలో చురుకైన పాత్ర వహిస్తున్న గాడిచర్ల హరి సర్వోత్తమరావును బిపిన్ చంద్రపాల్ సభకు హాజరై ఆయనకు సన్మానపత్రం సమర్పించి నందుకు రాజమండ్రి ఆర్ట్సు కాలేజి నుండి డిస్మిస్ చేస్తే, ఆయన రాజమండ్రి నుండి బెజవాడ చేరుకుని 1908లో చోడి నారాయణ వాళ్ళతో కలిసి 'స్వరాజ్య' పత్రికను ఇక్కడ స్థాపించారు. మరోవైపు ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య తమ స్వస్థలమైన నెల్లూరు నిడిచి బెజవాడను తమ కార్యకలిపాలకు కేంద్రంగా చేసుకున్నారు. ఇలావొక తలుపులు లేని ఇల్లు మాదిరిగా ప్రతి వొక్కరి కార్యప్రణాళికలకు ఈ నగరం వొక వేదిక అయింది.

1921 మార్చి 31 ఏప్రిల్ 1వ తేదీల్లో విజయవాడలో ప్రస్తుత గాంధీనగర్‌లో కాంగ్రెస్ ఎ.ఐ.సి.సి. సమావేశాలు ఘనంగా నిర్వహించింది. ఈ విధంగా బెజవాడ వేర్వేరు రాజకీయ సిద్ధాంతాలున్న నాయకుల్ని కూడా తల్లిలా ఒడి చేర్చుకుని, తొలినాళ్ళలో వారి ఎదుగుదలకు చేయి అందించింది. విజయవాడ ఎ.ఐ.సి.సి. సమావేశాలు ప్రస్తుతం గాంధీనగర్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న మైదానంలో 2 లక్షల మందితో ఆనడు విజయవతంగా జరిగాయి. మహాత్మాగాంధీ, నెహ్రూ, లాలాల లజపతిరాయ్, చిత్తరంజన్‌దాస్, అబ్దుల్‌కలాం ఆజాద్ పురుషోత్తమదాస్ టాండన్ ప్రభృతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కృష్ణాజిల్లా వాసి స్వర్గీయ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకను భారత జాతీయ కాంగ్రెస్ జెండాగా గాంధీజీ గుర్తించింది ఈ విజయవాడ సభలోనే. ఈ విధంగా బెజవాడ- విజయవాడగా మార్పుచెందుతున్న దశలో కాంగ్రెస జెండాగా గాంధీజీ గుర్తించింది. ఈ విజయవాడ సభలోనే. ఈ విధంగా బెజవాడ- విజయవాడగా మార్పుచెందుతున్న దశలో అంటే స్వాతంత్రోద్యమ తొలినాళ్లలో అటు కాంగ్రెస్- ఇటు కమ్యూనిస్టు రెండు రాజకీయ సిద్ధాంతాలకు క్రియాశీల కేంద్రంగా విజయవాడ పరిణామం చెంది 'ఖద్దరు- కమ్యూనిజం' రెండు భిన్న రాజకీయ సంస్కృతుల మిశ్రమమైన కొంగ్రొత్త సంస్కృతి విజయవాడ నగర సంస్కృతిగా పరిణామం చెంది, విలక్షణ రాజకీయ చైతన్య కేంద్రమయింది.

క్రియాశీల రాజకీయాల సంగతి అటుంచితే ఈ వైవిధ్యభరితమైన సైద్ధాంతిక పరిణామాల ప్రభావం విజయవాడ నగరంలో పలు రంగాలపై స్పష్టమైన ముద్రను వేసింది. నగరం నుండి వెలువడే ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర దినపత్రికలు ఈ దిశలో విశేషమైన కృషిచేసి సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ఒక తాత్విక నేపథ్యాన్ని అందించాయి. ఈ దిశలో తర్వాత పరిణామం పుస్తక ప్రచురణ.

రాజమహేంద్రి గురించి ఇంతకుంముందు అనుకొన్న రీతిగానే పుస్తక ప్రచురణ సైతం రాజమండ్రిలోనే ముందుగా ప్రారంభమైంది. అయితే తర్వాత కాలంలో విజయవాడలో వేగం పుంజుకున్న ఆధునిక, అభ్యుదయ భావాల కారణంగా పుస్తక ప్రచురణ ఒక ఉద్యమంగా ఇక్కడ కొనసాగింది. 1930లో ఇక్కడి సరస్వతీ బుక్ డిపో స్థాపించి వాచకాలు, బెంగాలీ డిటెక్టివ్‌లు ప్రచురించేవారు. అప్పుడు న్యూస్ ప్రింటు పేపర్ డమ్మీ సైజు ఆరు రూపాయలుండేది. ఎనిమిది పేజీల డెమ్మి ఫారం తెలుగు లిపిలో కంపోజ్, ప్రింటింగ్ కలిపి ఆరు రూపాయలుండేది. బైండింగే కాదు- రచయితలకిచ్చేది కూడా అతి చౌక రేటు కావడంవల్ల 64 పేజీల పుస్తకం 'బేడ' అంటే 12 పైసలు గిట్టేది! తర్వాత దేశ కవితా మండలి తరపున శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య తర్వాత వారి అల్లుడు శ్రీ బొందలపాటి శివరామ కృష్ణ ప్రసిద్ధ బెంగాల్ రచయిత శరత్ చంద్ర చటర్జీ నవలలు అనుసరించి ప్రచురించడంతో తెలుగు పాయలలో పుస్తక పఠనాసక్తిని గణనీయంగా పెంచగలిగారు.

విజయవాడ కేంద్ర స్థానంగా ఆ రోజుల్లో సాగిన పుస్తక ప్రచురణ- సాహిత్య సేవ , సైద్ధాంతిక నిబద్ధతతో , లక్ష్య సాదన ధ్యేయంగా ఉండేది తప్ప , కాసుల వ్యాపారంగా మాత్రం కాదు. ఇందుకు తార్కాణంగా అప్పట్లో జరిగిన వొక ఉదంతమిది- గుడివాడ తాలూక యలమర్రు గ్రామవాసి శ్రీ గద్దె లింగయ్య, విద్యార్థిగా ఉన్నప్పుడే విప్లవకారుల చరిత్రలు చదివి ప్రభావితులై బెజవాడ కేంద్రంగా తన సాహిత్య ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్యశీలి. విప్లవకారుల మీదా, విప్లవ సాహిత్య ప్రచురణ మీద బ్రిటీష్ ప్రభుత్వం కఠినతర మైన ఆంక్షలు విధించిన రోజులవి. 1935-40 సంవత్సరముల మధ్య ప్రపంచ ప్రఖ్యాత గోర్కీ రచన'అమ్మ' నవలను తెలుగులోకి అనువదించాలని లింగయ్యగారు నిర్ణయించుకున్నారు. అయితే ఏ ప్రెస్సు యజమానిని దానిని ముద్రించడానికి అంగీకరిచని పరిస్థితిలో ప్రెస్‌వారికి సైతం తాము ముద్రిస్తున్న దేమిటో వారికే తెలియకుండా ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క ప్రెస్‌లో అచ్చువేయించిన కార్యశీలి లింగయ్య గారు. ముద్రణ పూర్తి అయిన భాగాలను ఒక్కోభాగాన్ని ఒక్కో ఊరిలో మిత్రుల ఇంట దాచి చివరికి అన్నింటినీ కలిసి బెజవాడ- బందరు రోడ్డులో గల మంటాడ గ్రామం వద్ద బందరు కాల్వలో నిలిపివున్న ఒక పడవలోకి చేర్చారు. బెజవాడలో వొక అనుభవజ్ఞుడైన బైండర్‌ను అజ్ఞాత జీవితం గడపడానికి వప్పించి తీసుకువచ్చి అతన్ని ఆ పడవలో పెట్టి ఇద్దరు కుర్రవాళ్లను ఆ బైండర్‌కు సహాయకులుగా ఉంచి బైండింగ్ పని ప్రారంభించారు. చూసేవారికి ఏమాత్రం అనుమానం రాకుండా నలుగురు కళాసీలు, ఒక సరంగు బోటును అటు గుడివాడ సమీపంవరకు ఇటు మంటాడ వరకు నెమ్మదిగా నడుపుగూ ఉండేవారు. పడవలో బైండింగ్ పనిమాత్రం జరిగిపోతూ వుండేది. రాత్రిపూట కిరోసిన్ లాంతరు వాడేవారు. పడవ యలమర్రు దగ్గరకు చేరుసరికి పడవలోని వారిక లింగయ్యగారి ఇంటి నుండి భోజనాలు, ఫలహారాలు అందేవి. ఈ విధంగా ముద్రణ పూర్తి చేసుకున్న 'అమ్మ' నవల నెలతిరక్కుండా వెయ్యి కాపీలు అమ్ముడు పోయాయట. ఆ తర్వాత లింగయ్య వారు విజయవాడలో ఆదర్శ గ్రంథమండలి సంస్థను స్థాపించి పలు ఉత్తమాభిరుచి గల గ్రంథాల్ని ప్రచురించారు. ◆



గ్లోబలైజేషన్



అద్దేపల్లి రామమోహన్ రావు

'అంతర్జాతీయ వ్యాపార
తుఫానులో
సొంత ముద్ర చెరిగిపోయిన
వింత వస్తువును నేను
మనిషి స్థానంలో
వస్తువునారాధిస్తున్న
కొనుగోలు దారుణ్ణి నేను
నిన్న నేను నా అవసరానికే
వస్తువులు కొన్నాను
నేడు నేను నా స్థాయి కోసం
వస్తువులు కొంటున్నాను
రేపు నేను ఒక వస్తువుని
కావడం కోసం
జీవితాన్ని అమ్ముకుంటాను'

ప్రజాశక్తి స్వాగత గీతిక

"ప్రజాశక్తి" దినపత్రిక
నిజ కమ్యూనిజ వేదిక
శ్రామిక జన శ్రేయస్కర
సామ్య సంఘ సంస్థాపక
ధన స్వామ్య వర్గమ్ములు
నినదించే దిన వార్తల
సరిదిద్దుచు జనావళికి
సత్యముచాటే గొంతుక
గణతంత్రము పేరు చెప్పి
గద్దెలెక్కి గద్దించే
అధినాథుల అవినీతిని
హడలగొట్టు అక్లేసిక
చెదరగొట్టు ఝుర్ఝూత్రిక
వస్తున్నది వస్తున్నది
వాస్తవాన్ని తెస్తున్నది
ప్రఖ్యాపన మార్క్సియము
వ్యాఖ్యానము చేస్తున్నది
నడుం కట్టి తుడుంకొట్టి
నవ మార్గం వేస్తున్నది
సుత్తిపట్టి కొడవలెత్తి
శభరావం చేస్తున్నది
జనుల వలన జనుల కొరకు
జనరాజ్యం విత్తుకుంది
జయపతాక మెత్తుకుంది

ఆరుద్ర

రాయలసీమ రతనాల చరిత్ర...



ప్రజాశక్తి- జమ్మలమడుగు టౌన్

రాయలసీమ అంటే దర్శకుడు రాంగోపాల్ వర్మ తీసిన రక్త చరిత్ర సినిమాలాగా ఫ్యాక్షన్, హత్యలు, రాళ్ళు, రప్పలు, కరువు మాత్రమే కాదు. రాయలసీమ జిల్లాల్లో ప్రపంచంలోనే ఎక్కడా లేని కొన్ని ప్రాముఖ్యతలు ఉన్నాయి. అయితే ఇవేవీ తెలియని కొంతమంది రాయలసీమ గురించి ఎప్పుడు ఫ్యాక్షన్ తరహాలోనే సినిమాలు తీస్తుంటారు. రాయలసీమ జిల్లాలో కొన్ని నమ్మలేని నిజాలు చూడండి.. మీరే నోటి మీద వేలేసుకుంటారు...



ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఎర్రచందనం పెరిగే ఏకైక ప్రాంతం – దక్షిణ నల్లమల, శేషాచల అడువులు– ఇవి పూర్తిగా రాయల సీమ ప్రత్యేకం.

కలివికోడి: భారతదేశంలోని పక్షులలో ఒకటైన కలివికోడి చివరి ఆవాసం కడపజిల్లా లంకమల అభయారణ్యం (ప్రపంచంలోనే ఈ కలివికోడి ఇక్కడ తప్ప ఎక్కడా లేవు).

ప్రపంచంలోనే అతిపెద్ద బైరటీస్ నిల్వలు ఉన్న ప్రాంతం

కడప జిల్లా మంగంపేట గనులు. ఆంధ్రలో మానవుని నాగరికత కర్నూల్ – కడప జిల్లాలో మొదలై ఉత్తరాదికి వ్యాపించింది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రపంచంలోనే రెండవ ధనిక ఆలయం.

కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, భవిష్యత్తులో జరగబోయే అనేక విషయాలు ముందుగానే దర్శించి తాళపత్ర గ్రంథాలు రచించి భద్రపరచారు. వీటినే కాలజ్ఞాన తత్వాలు అంటారు. ప్రస్తుత కాలంలో జరిగే అనేక విషయాలను ఆయన ముందే చెప్పారు.. ఇలాంటి గొప్ప మహానుభావుడు వెలిసింది బ్రహ్మంగారి మఠంలో కడప జిల్లా, మన రాయలసీమ..

పదకొండవ శతాబ్దంలో వెలసిన అతి పురాతనమైన కోట మన గండికోట. మన జమ్మలమడుగులో పర్యాటక కేంద్రంగా ప్రత్యేక ఆకర్షణగా ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన గండికోట.... అది మన రాయలసీమలో

రాయలసీమలో ఒక జ్యోతిర్లింగం (శ్రీశైలం మల్లిఖార్జున స్వామి) ఒక పంచభూత లింగం, (శ్రీకాళహస్తి – వాయులింగం) అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి (శ్రీశైలం భ్రమరాంబిక), నవనారసింహం క్షేత్రాలలో రెండు (కదిరి లక్ష్మీ నరసింహస్వామి మరియు అహోబిలం నరసింహస్వామి) ఉన్నాయి.

దానవులపాడులో రెండవ చంద్రగుప్త మౌర్యుడు దిగంబర జైన మతాన్ని రాయలసీమలోని కడప జిల్లా జమ్మల మడుగు తాలూకా దానవుల పాడు గ్రామంలో చిన్న కొలనులో స్నానమాచరించి సల్లేఖనం ప్రారంభించిన ప్రాంతంగా రాయలసీమకే ప్రసిద్ధి చెందింది.

ప్రపంచంలోనే అతి పురాతన లింగం (మొట్టమొదటి లింగం చిత్తూరు జిల్లాలోని గుడిమల్లంలో బయటపడింది) తెలుగు భాష మొదటి శాసనం కడప జిల్లా కలమళ్ళ శాసనం.

మన జాతీయగీతం మదనపల్లిలో రాయబడింది. తెలుగులో మొదటి కవయిత్రి మన తాళ్ళపాక తిమ్మక్క. దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు – శ్రీశైలం టైగర్ రిజర్వ్. కదిరి దగ్గరి తిమ్మమ్మ మర్రిమాను దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద చెట్టు. తెలుగు సినిమా పుట్టినిల్లు కడప జిల్లా సురభి గ్రామం. ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికంటే ముందే బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కర్నూలు జిల్లాకు చెందిన వారు. కర్నూలు జిల్లా బెలుం గుహలు దేశం లోనే రెండవ అతిపెద్ద గుహ సముదాయంగా పేరు గాంచినవి.

ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద జిల్లా మన అనంతపురం జిల్లా.

ఇంకా.. రాయలసీమ అంటే వేమన పద్యం, అన్నమయ్య కీర్తన, మొల్ల రామాయణం, వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం, కన్నప్ప భక్తి, అష్టదిగ్గజ వైభవం, రాయల రాజసం, బుడ్డా వెంగలరెడ్డి దాతత్వం, తరిగొండ వెంగమాంబ భక్తి, గడియారం వెంకటేశ శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు సాహిత్యం, లక్కోజు సంజీవ రాయశర్మ మేధస్సు, జిడ్డు క్రిష్ణమూర్తి తత్వం.



బహుముఖ ప్రజ్ఞాశాలి

పుట్టపర్తి నారాయణాచార్యులు

- విశేష ఖ్యాతి గాంచిన గేయకావ్యం 'శివతాండవం'
- కావ్య వేదిక శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయం
- ప్రొద్దుటూరుతో విడదీయరాని బంధం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మహాకవి పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు భారతీయ సాహిత్య చరిత్రలో మేరు పర్వతం వంటి వారు. నవల, కావ్యం, ప్రబంధం, విమర్శ, పరిశోదన, అనువాదం, నృత్యం వంటి అనేక రంగాలలో పరిణితి చెందిన ప్రతిభ కనబరచిన ఏకైక తెలుగు వెలుగు డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారు. ఆయన రచనలన్నీ ఒక చోట చేరిస్తే ప్రపంచ సాహిత్యంలోని అగ్రశ్రేణి రచయితల రచనల స్థానంలో ఢీటుగా నిలబడతాయి. ఆధునిక తెలుగు సాహితీ చరిత్రలో విభిన్న సాహితీ ప్రక్రియల్లో పరిచయముండి... దాదాపు 140కి పైగా గ్రంధాలను వెలువరించి 14 భాషలలో ప్రవేశాన్ని పాండిత్యాన్ని కలిగి ఉండి బహుముఖ ప్రజ్ఞాశాలిగ కీర్తి గడించిన అరుదైన విలక్షణ సాహితీమూర్తి పుట్టపర్తి నారాయణాచార్యులు. బహుముఖ పాండిత్యం,సకల శాస్త్ర విశారదత్వం, భాషావైభవం మూర్తీభవించిన మహాకవి పుట్టపర్తివారు 1914 మార్చి, 28వ తేదీ అనంతపురం జిల్లా చెయ్యేరు గ్రామంలో తిరుమల శ్రీనివాసా చార్యులు, లక్ష్మిదేవమ్మల జ్యేష్టపుత్రునిగా జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ పండితులు తల్లి సంస్కృతాంధ్రలో చక్కగా కవిత్వం చెప్పేవారట. వాళ్ల రాసుకునే లేఖలు కూడ పద్యాలు, శ్లోకాల్లో ఉండేవట. పుట్టపర్తి వారి తండ్రి పెనుగొండ మున్సిపల్ పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, రాళ్లపల్లి గోపాలకృష్ణశర్మ, అబ్బియా చార్యులు వంటి వారితో తండ్రి శ్రీనివాసా చార్యులు సాహితీ చర్చలు జరపటం, చూసిన పుట్టపర్తి మదిలో చిన్న నాటనే సాహితీ సుగంధం పులుముకుంది. అందు కు ఆయన తన 12వ ఏటనే రచనకు శ్రీకారం చుట్టారు. క్షేత్ర ప్రశస్తితో కూడిన పెనుగొండ శిధిలాలను చూసిన వేదనతో 'పెనుగొండలక్ష్మి'ని రచించారు. అప్పటి పుట్టపర్తివారికి 12 సంవత్సరాలే.ఇదే పుట్ట పర్తివారి ఆదికావ్యం. పుట్టపర్తి నారాయణాచార్యులకు విశేష విఖ్యాతిని ఆర్జించి పెట్టిన గేయ కావ్యం 'శివతాండవం'. ఈ కావ్యాన్ని పుట్టపర్తివారు ప్రొద్దుటూరులోని శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో రచన చేశారు. ఆలయంలో ప్రతిరోజు ప్రదక్షిణలు చేస్తూ ఆలయ ఆవరణంలో చెట్టుకింద కూర్చొని శివతాండవం అద్భుత కావ్యాన్ని 45రోజుల్లో పూర్తి చేశారు. పుట్టపర్తివారి కీర్తికి ప్రధాన మూలస్తంభం సంగీతం, సాహిత్యం, నాట్య కళల అపురూపమైన సంగమంగ వినుతి కెక్కిన శివతాండవమే. పుట్టపర్తివారి విశ్వరూపం దర్శనీయం. భారతీయ సంస్కృతీ సారాన్నంత క్రోడీకరించిన ప్రకృతి పురుష సమర సునాధమేన రచన సహస్రయుగ కాలపరిణామక్రమానికి నిర్వచనం. సృష్టి,స్థితి, లయకారకులైన పరమశివుని 'తాండవమే' తన శక్తితో ఆపరమశివుడు పరవశింప చేయగలిగిన పార్వతీదేవి 'లాస్యం' పుట్టపర్తివారి మేధో వేదికపై 'నభూతో నభవిష్యతి'గా ఆవిష్కరింపబడిన వైనం అనితర సాధ్యం. ఈ అద్భుత కావ్యం విడిగా ఐదు భాగాలున్నాయి. మొదటి భాగంలో సాయంకాలం ప్రకృతి తనను తాను అంద చందంగా సింగారించుకుంటూ ఉంటుంది. ఎందుకు ప్రకృతి ముస్తాబు అవుతోందని కవి తనను తాను ప్రశ్నించు కుంటారు. పరమేశ్వరుడైన ఆ సాంబశివుడు ఇక కొద్ది సేపటిలో ప్రకృతే తన నృత్య వేదికగా శివతాండవం నృత్యం చేయబోతున్నాడని ప్రకృతి సమాధానంలో ' ఆ సాయం సంధ్యలో ప్రకృతి ఎలా ముస్తాబయ్యిందో చెబుతూ... ఏమానందము భుమీతలను శివతాండవమట- శివలాస్యంబట.. అలలై, బంగారు కలలై పగడపు బులుగుల వలె మబ్బులు విరసినయని శివతాండవమట.. శిలాస్యంబ' అంటూ సాగే ఈ కావ్యంలో నందీశ్వరుని నాందీ వాచకం గగుర్పాటు కలిగించే శివతాండవ నృత్యం చెలికత్తె విజయప్రార్థన మంగళంతో సరస్వతీ పుత్రుడు, సర్పన్యాశితుడైన మహా శివుని తాండవాన్ని పుట్ట పర్తివారు మనకు అందించారు. కళలకకాణాచి ప్రొద్దుటూరు. ఈ పట్టణంతో సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యుల వారికి ఎంతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఉంది. ప్రొద్దుటూరు వీరి అత్తగారి ఊరు. పుట్టపర్తివారికి భార్య కనకమ్మ, ఐదుగురు సంతానం. స్వాతంత్ర్యానికి ముందు ఆయన సొంత జిల్లా కేంద్రం అనంతపురం కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ మీనన్‌కు సమయం దొరికితే చాలు ఆంగ్లేయులను పొగడడం, మహాత్మాగాంధీ వంటి వారిని తిట్టటం పరిపాటిగా ఉండేది. ఇది పుట్టపర్తివారు సహించలేకపోయి ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కొన్నేళ్లకు కొంత కాలం ప్రొద్దుటూరులో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతరం కడపలో స్థిరపడి అక్కడే శ్రీరామకృష్ణ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. ప్రొద్దుటూరులో ఆయనకు ఎంతో మంది శిష్యులున్నారు. 1990 సంవత్సరం సెప్టెంరు 1న పుట్టపర్తి నారాయణాచార్యులు పరమపదించారు. వారు మృతి చెందిన ఏడాదికి ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో అలనాటి బీహార్ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య పుట్టపర్తివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

ఆతరువాత 2007 డిశంబర్ 21న అప్పటి గవర్నర్ నారాయణదత్‌తివారి ఏడున్నర అడుగుల పుట్టపర్తి కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పటి నుండి ఈ ప్రదేశం పుట్టపర్తి సర్కిల్‌గ ప్రాచుర్యం పొందింది. ఆయన శిష్యులంతా కలిసి సాహితీపీఠం ఏర్పాటు చేసి సాహితీకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ప్రజాశక్తి! రా!

గొంతులేని వాళ్ల గోడు తెలపడానికి రా!
డంబాలను, ఆడంబరాలను హతమ ర్చడానికి
అబద్ధాల చీకట్ల మీదికి స్వేచ్ఛా స్వతంత్రపు
స్వర్ణకాంతులు ప్రసరించడానికి
ప్రపంచాన్ని మార్చడానికి
ప్రజాశక్తి!రా!
- మహాకవి శ్రీశ్రీ



స్వాతంత్ర్య సమరయోధులు ఆలూరు పక్కీరప్ప

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

యర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామానికి చెందిన ఆలూరు పక్కీరప్ప స్వాతంత్ర్య సమరయోదుడు. 1921వ సంవత్సరంలో జాతిపిత మహాత్మాగాంధీ కాలినడకన జరిపిన శాంతియాత్రలో భాగంగా ముద్దనూరు, చిలం కూరు, నిడిజివ్వి, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు ప్రాంతాలను సందర్శించారు. అప్పట్లో బాల్యంలో ఉన్న పక్కీరప్ప చిలంకూరు నుంచి యర్రగుంట్ల వరకు గాంధీ పాదయాత్రలో పాల్గొన్నారు. అప్పటి నుంచి గాంధీ స్ఫూర్తిని, దేశభక్తిని నింపుకున్నారని ప్రొద్దుటూరులో నివాసమున్న పక్కీరప్ప కుమారుడు విశ్రాంత తపాల ఉద్యోగి శరత్‌బాబు తెలిపారు. 1941లో జరిగిన వ్యక్తి సత్యాగ్రహం, 1942లో జరిగిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పక్కీరప్ప చురుగ్గా పాల్గొన్నారు. ఈయన సహచరులు ఆర్.సీతారామయ్య (మాలేపాడు), ఆదినారాయణరెడ్డి (రాయచోటి)తో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1942లో అరెస్ట్ కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లి గుంటూరు జిల్లా నిడుబ్రోలు లోని 'ఆచార్య రంగాగారి ఆశ్రమం'లో ఉన్నారు. మోతుబరి కుటుంబానికి చెందిన ఈయన తన నివాసంలో సాటి స్వాతంత్ర్య సమరయోధులకు ఆశ్రయం కల్పించి దేశభక్తిపై ఎన్నో కార్యక్రమాలు జరిపించారు. ఈయన సహ ధర్మచారిణి దస్తగిరమ్మ సంపూర్ణంగా సహకరించి చేదోడుగా నిలిచారు. ప్రతి స్వతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ల చేతుల మీదుగా ప్రత్యేక ఆహ్వానాన్ని అందుకొని సన్మానాలు అందుకున్నారు. పక్కీరప్ప 1999 నవంబర్‌లో మృతి చెందగా, ఆయన భార్య దస్తగిరమ్మ 2021 ఫిబ్రవరిలో పరమపదించారు.



సోషల్ మీడియా... భిన్న ధోరణలు

**మీడియా అంటే సమాచారం కోసం
జనం గొంతు వినిపించడం కోసం
ప్రజాసమస్యలపై కదిలించడం కోసం
కదులుతున్న ప్రజలకు తోడు కావడం కోసం
ప్రభుత్వాలను నిలదీయడం కోసం
మీడియా అంటే ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు తోడు కావడం కోసం**

ఇలాంటి అనేక లక్షణాలతో ఉన్నదే మీడియా అనుకుంటే సంప్రదాయ మీడియా సాధానాలకంటే ఈ లక్షణాలను మరింత ప్రస్ఫుటంగా చాటుతున్నదే సోషల్ మీడియా. వేగంగా సమాచారం అందించడంలో సోషల్ మీడియా ముందుంటుంది. అందరికీ అందుబాటులోకి రావడంతో ప్రతీ ఒక్కరూ సమాచారం అందించే పాత్రికేయుడిగా అవకాశం అందుతోంది. మీడియాలో జనం గొంతు వినిపించడం అంటే సోషల్ మీడియా తర్వాతేనని చెప్పవచ్చు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో మెజార్టీ సంస్థలు పెట్టుబడులకు, కట్టుకథలకు పరిమితం అయిపోతుంటే, వాస్తవాలను, జనవాణీని వినిపించడంలో సోషల్ మీడియా పదునైన సాధనంగా మారింది. జనాలను కదిలించడంలో, కదులుతున్న జనాలకు తోడుగా నిలవడంలో మీడియా ముందుండడం ప్రధాన కర్తవ్యం అనుకుంటే దానిని నెరవేర్చడంలో సోషల్ మీడియాది అందెవేసిన చేయి. గడిచిన రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు సోషల్ మీడియా ఆయుధంగా మారింది. జనాలను కదిలించడానికి తోడ్పడింది. ఉద్యమ కదనరంగంలో ఉన్న వారికి చేదోడయ్యింది. ప్రభుత్వాలను నిలదీయడంలో సోషల్ మీడియాదే ప్రధాన పాత్రగా మారింది. మీడియా యాజమాన్యాలు నేడు ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ పాలకుల గొంతు వినిపించడమే తమ పని అన్నట్టుగా మార్చుకున్న నేపథ్యంలో జనం గొంతు వినిపించడానికి సోషల్ మీడియా వేదికగా మారింది. ప్రజోపయోగ కార్యక్రమాలకు ఇప్పుడు సోషల్ మీడియా కేంద్రం అవుతోంది. సమాజానికి ఏదో చేయాలనే తలంపు ఉన్న యువతను ఓ వేదిక మీదకు తీసుకురావడంలో, వారిని పలు కార్యక్రమాలకు పురిగొల్పడంలో సోషల్ మీడియాదే పెద్ద పాత్రగా తయారయ్యింది. మొత్తంగా ప్రజాస్వామ్యయుత మీడియాగా సోషల్ మీడియానే ఇప్పుడు మిగిలిన సంప్రదాయ మీడియా కన్నా ముందు నిలుస్తోంది. అదే సమయంలో సోషల్ మీడియా వేదికలు వ్యాపార సాధనాలుగా మారాయి. ప్రజాభిప్రాయం తయారుచేయడంలో మీడియా సంస్థలను మించి సోషల్ మీడియాని వినియోగించుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఫేస్ బుక్, వాట్సాప్, యూ ట్యూబ్, ట్విట్టర్ వంటి ప్రధాన యాప్స్ ని నియంత్రించడం ద్వారా ఆయా సంస్థలు ప్రజాభిప్రాయాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉదా. ఫేస్ బుక్ లో 2వేల మంది మిత్రులుగా ఉన్న ఓ అకౌంట్ నుంచి పోస్ట్ చేస్తే కేవలం ఆ సర్కిల్ లోని కేవలం 100మందికే ఆ పోస్ట్ పరిమితం అవుతోంది. బూస్ట్ చేయడం ద్వారా ఫేస్ బుక్ కి డబ్బులు చెల్లించిన పోస్టులను మాత్రమే ప్రమోట్ చేయడం ద్వారా సాధారణ జనాలను నియంత్రించడం జరుగుతోంది. దానికితోడుగా డేటాను వివిధ సంస్థలకు అమ్ముకుంటూ ఖాతాదారుల వివరాలు సొమ్ము చేసుకుంటున్న తీరు బట్టబయలవుతోంది. ముఖ్యంగా ఫేస్ బుక్ ఖాతా తెరిచినప్పుడు ఇచ్చిన వివరాలతో పాటు, పోస్టుల ద్వారా ఆయా వ్యక్తుల అభిరుచులను గమనించి, వారిని తమకనుకూలంగా మలుచుకోవాలనుకునే సంస్థలు, రాజకీయ పార్టీలకు ఆ వివరాలు అమ్ముకోవడం ద్వారా ఫేస్ బుక్ దొరికిపోయింది. కానీ ఈ విషయంలో ఫేస్ బుక్ తో పాటు గూగుల్ సహా అన్ని సంస్థలు అదే రీతిలో వ్యవహరిస్తున్నాయి. ప్రతీ ఖాతాదారుడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, దానిని తమ వ్యాపారాభివ ద్ధికి ఎలా ఉపయోగించాలన్న విషయంలో కార్పోరేట్ సంస్థలకు సోషల్ మీడియా బాగా ఉపయోగపడుతున్నట్టు స్పష్టం అవుతోంది. అంతేగాకుండా పాలకవర్గ రాజకీయ పార్టీలు కూడా దానిని ఉపయోగించుకుని జనాలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంబ్రిడ్జ్ ఎనలటికా వ్యవహారం చాటిచెప్పింది. ఎన్నికల సమయాల్లో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, జేడీయూ వంటి పార్టీలు కేంబ్రిడ్జ్ ఎనలటికా నుంచి డేటా వివరాలు తీసుకున్నట్టు ఆ సంస్థ స్వయంగా అంగీకరించిన విషయం అందరికీ తెలిసిందే. సోషల్ మీడియా ప్రాధాన్యాన్ని సామాన్యుల కన్నా కార్పోరేట్ వర్గాలే ముందు గుర్తించాయి. అందుకు తగ్గట్టుగానే కార్పోరేట్ సంస్థలు నెట్ వర్క్ ఏర్పాటు చేసుకున్నాయి. సోషల్ మీడియా నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాయి. అంతకుమించి మతోన్మాద సంస్థలు, తీవ్రవాద గ్రూపులు కూడా సోషల్ మీడియా నెట్‌వర్క్‌ని వినియోగించుకోవడంలో ఆరితేరినట్టు కనిపిస్తోంది. ట్విట్టర్ ద్వారా ఐసిస్ రిక్రూట్‌మెంట్లు చేస్తుంటే, మనదేశంలో ఆర్ఎస్ఎస్ సంస్థలు సోషల్ మీడియాని కేంద్రంగా చేసుకుని విద్వేషాలు పెంచడానికి తపనపడుతున్నాయి. అనేక అపోహలు సృష్టించి సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్నాయి. ఫేక్ వీడియోలు, ఫేక్ ఫోటోల సహకారంతో మతకల్లోల మంటలు రాజేసేందుకు శతవిధాలా సాగుతున్నాయి. ఆ క్రమంలోనే అనేకమార్లు బండారం బయటపడినప్పటికీ అబద్ధాలను మరింత అందంగా చెప్పేయత్నంలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ మతకల్లోలాలు మరింత పెంచేందుకు హిందూ స్త్రీలను చెరస్తున్న మరో మతస్తులంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ అయ్యింది. ఉద్రిక్తలు పెంచింది. పలువురు సామాన్యుల జీవితాలు సమిధలయ్యేందుకు దోహదం చేసింది. కానీ తీరా చూస్తే ఆ పిక్ భోజ్ పురి సినిమాలో

ఓ రేప్ సీన్ లో విలన్ సాగించిన వ్యవహారంగా తేలింది. మరింత విచారకరమైన అంశం ఏమంటే అలాంటి సినిమా సీన్ ఫోటోని వాస్తవంగా జరిగిందని చెప్పి, మతకలహాలు పెంచేందుకు కారణమయిన వ్యక్తిని ట్విట్టర్ లో ఏకంగా ప్రధానమంత్రి మోడీ ఫాలో అవుతుండడం. ఫేక్ ఫోటోలు, సమాజాన్ని చీల్చే యత్నాలు సాగించే ఓ టీమ్ ని ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న విషయం, అలాంటి వాళ్లందరికీ మోడీ అండగా ఉన్నారన్న వాస్తవం ఓ అంతర్జాల పోకిరి అనే పరిశోధనాత్మక గ్రంథంలో స్వాతి చతుర్వేది అనే జర్నలిస్ట్ ఆధారాలతో నిరూపించారు. ఇంకా వెలుగులోకి రాని అనేక అవాస్తవాలు మతోన్మాదుల క్యాంప్ నుంచి సోషల్ మీడియా క్యాంప్ నిండా వెదజల్లుతూ ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అటు కార్పోరేట్లు, ఇటు తిరోగామి మతోన్మాద ముఠాలు ఇరువైపులా సోషల్ మీడియాని దుర్వినియోగం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అలాంటి వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ప్రజాస్వామ్యవాదులందరి మీద ఉంది. సోషల్ మీడియా కారణంగా పలు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉదా. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తనయుడి జే షా ఆస్తులు ఏకంగా 16వేల రెట్లు పెరిగిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారానే వెలుగులోకి తెచ్చారు. సంప్రదాయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఆధారాలతో సహా బయలపెట్టిన అలాంటి అవినీతి బండారాన్ని కప్పిపుచ్చేందుకు కూడా కొందరు ప్రయత్నించడం వాస్తవ పరిస్థితిని చాటుతోంది. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాని నియంత్రించాలని, సోషల్ మీడియా కేంద్రంగా ప్రజా సమస్యల కోసం, వాటి పరిష్కారాల కోసం ప్రయత్నిస్తున్న వారిపై నిర్బంధం పెట్టాలని కూడా పాలకులు ప్రయత్నిస్తున్నారు. అనేక నియంత్రణ లతో నిజాలు కప్పిపుచ్చాలని చూస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు బురదజల్లుకోవడానికి, వ్యంగ్యం పేరుతో విష ప్రచారాలకు సోషల్ మీడియాని వినియోగించుకోవడం పెరుగుతోంది. అలాంటి వాటిని అదుపు చేయాలంటే జనం ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు, ప్రజలకు అవసరమైన అంశాలు ప్రస్తావించే వారి సంఖ్య పెరగాలి. అప్పుడే సోషల్ మీడియా నిజమైన ప్రజాస్వామ్య సాధనంగా, ప్రజల చేతుల్లో ఆయుధంగా మారడానికి ఆస్కారం లభిస్తుంది. ◆

అక్షర సమరమే దీక్షగా మున్ముందుకు

ప్రజాశక్తి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుని 42వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయం. అక్షరాక్షర దీక్షగా / ఆశయాలే రక్షగా / నడచి వచ్చిన దారులు / గడిచిపోయిన రోజులు...ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం, భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు కదలాడతాయి.

తెలుగులో పత్రికలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాలు అన్న మూడు నేపథ్యాలలో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వార పత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది ఎనభై ఒకటవ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడం లోను, ప్రగతిశీల భావాలను వ్యాపింపచేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొకు, ఉప్పల వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు ఒరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్-ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. మళ్లీ ఆరేళ్లకు 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారినా నాడు విశాలాంధ్ర కోసం జరుగుతున్న పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని పత్రికకు కూడా అదే పేరు పెట్టారు. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటవ తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం





ప్రజాశక్తి ప్రారంభోత్సవంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్‌తో పుచ్చలపల్లి సుందరయ్య

కార్యదర్శి ఇఎంఎస్ నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్టుంది. చాలా మంది ఈ పత్రిక నడవటం కష్టమని మాతోనే అనేవారు. కాని సందేహాలు పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం, పాత్రికేయులు, కార్మికులు సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు పత్రిక శ్రేయోబిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి.

ఒకప్పుడు వాటిని మెయిన్ స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి మెయిన్ స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆయా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా, స్టీమ్‌లుగా మారాయి. ఈ పరిస్థితుల్లో విశ్వసనీయత, స్వతంత్రత, నిస్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యధార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నది ప్రజాశక్తి వంటి పత్రికలే. అందుకే ప్రజలు వీటిని ఆదరిస్తారు, గౌరవిస్తారు. అయితే రానురాను ఈ సవాళ్లు తీవ్రమవుతాయే గాని తగ్గవు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు సింహస్వప్నంగా వుంది. మోడీ అధికారం లోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమైపోతున్నది. సుప్రీం కోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. ఇలాంటి సమయంలో కాలపరీక్షకు నిలిచిన ప్రజాశక్తిని పటిష్టం చేసుకోవడం, మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతైనా అవసరం. ఆలోచనా పరులు ఎవరైనా పాలకపక్ష మీడియా పోకడలకే కొట్టుకుపోవడంగాక ప్రత్యామ్నాయ, ప్రజాస్వామిక సమాచార స్రవంతిగా ఆశయాలకు ఆలవాలంగా ముందుకు సాగుతున్న ప్రజాశక్తిని తమదిగా భావించాలి. ఎంతో జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగు దశాబ్దాలను దాటి ముందుకు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు ఎందరో కొత్త శక్తుల చేరిక, చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక అందుకు విశ్వాసమిస్తుంది. ◆

గండికోట ప్రాజెక్టు జిల్లా గుండె చప్పుడు



ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టు నిర్మాణంతో కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో తాగునీటి కొరత తీరనుంది. వ్యవసాయ సాగును కూడా పెంచవచ్చు. ఆ మేరకు ఆలోచించి ప్రాజెక్టు నిర్మాణం రూపకల్పన చేసిన గొప్ప వ్యక్తి సార్ ఆర్థర్ కాటన్. బ్రిటీష్ కాలంలోనే అప్పటి కడప జిల్లా కలెక్టర్ సర్ ఆర్థర్ కాటన్ గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ చేశారు. అనంతరం బ్రిటీష్ పాలకులు దేశం వదలిపోవడంతో ప్రాజెక్టు నిర్మాణం అంచనాల రూపకల్పనతోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గండికోట నిర్మాణానికి కృషి చేశారు. నాటి రాజకీయ పరిణామాల వల్ల ప్రాజెక్టు శంకస్థాపనకు కూడా నోచుకలేదు. అనంతరం 2004లో జిల్లా వాసి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజుల్లోనే ఈ ప్రాజెక్టు 26.85 టిఎంసి నీటి సామర్థ్యంతో నిర్మాణానికి రూపకల్పన చేశారు. ముంపు వాసులకు పరిహారం, పునరావాసం మంజూరు చేశారు. అనంతరం శంకుస్థాపన చేసి అపర భగీరథుడుగా పేరుగాంచారు. ఈ ప్రాజెక్టులో తొలిసారిగా 2020 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గండికోట ప్రాజెక్టులో 3.5 టిఎంసి నీటిని నిల్వ చేశారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి సంవత్సరం 2020లో 26.85 టిఎంసి పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేశారు. కడప, అనంతపురం జిల్లాలకు నీరు అందించారు.



రాజశేఖరరెడ్డి కల సాకారమైంది. 2020, 2021సంవత్సరాల్లో పూర్తిస్థాయిలో నీరు నిల్వచేశారు. 2022లో దేశ వ్యాప్తంగా అధిక వర్షాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేశారు. 2024లో చంద్రబాబు నాయుడు సిఎం అయిన తర్వాత గండికోటలో పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేశారు. ప్రస్తుతం గండికోట పూర్తి స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.



త్రివేణి సంగమం గండికోట ప్రాజెక్టు

మండలంలోని గండికోట ప్రాజెక్టు సమీపంలో త్రివేణి సంగమం అత్యంత అద్భుతంగా, సుందరమైన హొయలతో కనువిందు చేస్తూ ఆకట్టుకుంటుంది. కర్నాటక రాష్ట్రంలోని నందికొండలో పుట్టిన పెన్నా, చిత్రావతి నదులు వందల కిలోమీటర్లు విడివిడిగా ప్రవహిస్తూ కొండాపురం మండలంలోని ఏకునాంపేట (ఈ గ్రామం మైలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైంది) గ్రామ సమీపంలో శ్యాం కోన (ఇక్కడ కొండలో శివాలయం ఉంది) పాదాల వద్ద ఏకమై కలిసిపోతాయి. వీటికి తోడుగా గండికోట ప్రాజెక్టు నిర్మాణంలోనికి నీరు చేరుటకు రిజర్వాయర్ నుంచి వరద కాలువతో పాటుగా 6.2 కిలోమీటర్లు లింగాపురం వద్ద నుంచి ఏకునాంపేట వరకు టన్నల్ నిర్మాణం చేపట్టి కృష్ణా నది నీరు కలపడం వలన ఇక్కడ త్రివేణి సంగమం ఏర్పడింది. ఇది చూడ ముచ్చటగా ఉంటూ పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

పురాతనమైన పురపాలక సంఘం ప్రొద్దుటూరు



మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అతి పురాతన పురపాలక సంఘంగా ప్రొద్దుటూరు పేరుగాంచింది. మన దేశానికి స్వతంత్ర్యం రాకమునుపు కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు మాత్రమే పురపాలక సంఘంలు ఉండేవి. 1915లో ప్రొద్దుటూరు గ్రేడ్-111 పురపాలక సంఘంగా ఏర్పడింది. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ 1956లో గ్రేడ్-11,1980లో గ్రేడ్-1, 1998లో స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘంగా ఆవిర్భవించింది. జనాభా ప్రాతిపదికన చూస్తే ప్రొద్దుటూరు జనాభా 1901లో 14,370 మంది ఉండేవారు. అనంతరం 1911లో 15,756 మంది, 1921లో 15,906 మంది, 1931లో 20,124 మంది, 1941లో 26,961, 1951లో 36,624, 1961లో 50,616, 1971లో 70,822, 1981లో 1,07,070, 1991లో 1,33,914, 2001లో 1,50,309, 2011లో 1,62,717 మంది పెరిగారు. పట్టణంలో ఉన్న 41 వార్డులను 4 డివిజన్లుగా అధికారులు విభజించారు. 4,5,6,7,8,9,10,11,12,13,14 ఎన్నికల వార్డులు 1వ డివిజన్ పరిధిలో.. 15,16,17,18,19 ఎన్నికల వార్డులు 2వ డివిజన్ పరిధిలో.. 21,22,23,24,25,26,27,28,29,30 ఎన్నికల వార్డులు 3వ డివిజన్ పరిధిలో.. 1,2,3,31,32, 33,34, 35,36,37,38,39,40,41 ఎన్నికల వార్డులు 4వ డివిజన్ పరిధిలో చేర్చారు. వైద్యపరంగా ప్రొద్దుటూరులో 300 పడకల జిల్లా ఆసుపత్రితోపాటు నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. దూరంగా ఉన్న ప్రజలకు వైద్య సేవల నిమిత్తం వైఎంఆర్ కాలనీలో, మడూరు రోడ్డు ప్రాంతంలో, దేవాంగపేటలో, మౌలానా ఆజాద్ వీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యపరంగా ప్రభుత్వ పాఠశాలలు 2, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 9, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు 26 ఉన్నాయి.

ప్రొద్దుటూరులో తిరుగులేని వరదరాజులరెడ్డి

ప్రముఖ వ్యాపార వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్న ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 1952 నుంచి ఒక ఉప ఎన్నికతో సహా ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ)లు కలిసి తొమ్మిది సార్లు, తెలుగుదేశం మూడు సార్లు ఇక్కడ గెలుపొందగా.. రెండు సార్లు ఇంటిపెండెంట్లు గెలిచారు. అందరికన్న ఎక్కువగా ఐదు సార్లు నంద్యాల వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా ప్రొద్దుటూరులో గెలిచారు. ఆయన 1983లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ.. ఆ తర్వాత నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధించడం విశేషం.1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఉన్న ఎం.వి.రమణారెడ్డి 1985లో ఇండిపెండెంట్‌గా పోటీలో ఉండగా వరదరాజులరెడ్డి టిడిపి అభ్యర్థి అయ్యారు. 1985లో టిడిపి పక్షాన గెలిచిన వరదరాజులరెడ్డి ఆ తర్వాత 1989 నుంచి కాంగ్రెస్ తరపున గెలిచారు. అంతకు ముందు చంద్రఓబులరెడ్డి, రామిరెడ్డి రెండు సార్లు కె.బాలనారాయణరెడ్డి రెండు సార్లు ఇక్కడ గెలిచారు. 2004లో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా ఎంవి రమణారెడ్డి 18,458 ఓట్లు, టిడిపి తిరుగుబాటు అభ్యర్థిగా ఎం.లింగారెడ్డి 37,390 ఓట్లు సాధించగా బిజెపి అభ్యర్థి కొవ్వూరు బాలచంద్రారెడ్డి 22,118 ఓట్లు సాధించారు. టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా ఈ స్థానంలో బిజెపి పోటీ చేసింది. 2009లో టిడిపి తరపున పోటీ చేసి లింగారెడ్డి కడప జిల్లాలో ఒకే ఒక్కడుగా గెలిచారు. 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తరపున రాచమల్లు ప్రసాదరెడ్డి విజయం సాధించారు. 2024లో రాచమల్లుపై వరద విజయం సాధించారు.

విద్యా భగీరథుడు దొరస్వామినాయుడు

ప్రజాశక్తి-పులివెందుల

పులివెందుల ప్రాంత విద్యా భగీరథుడు పాళెం దొరస్వా మినాయుడు మంచి గుర్తింపు పొందారు. పాఠశాలల నిర్మాణం కోసం షేర్లతో బంగారు, నగదు ఖర్చు చేసిన ఘనుడు ఆయన. విద్యార్థుల భోజన సౌకర్యం కోసం వివిధ గ్రామాల్లో యాచన చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రభుత్వ ఆధీనంలోకి పాఠశాలను చేర్చి తుది శ్వాస విడిచిన మహనీయుడుగా నిలిచారు. బ్రిటిష్ కాలంలో పులివెందుల ప్రాంతంలో ఎక్కవ మంది నిర్లక్ష్యరాశ్యులు ఉండేవారు. చదువుకునే స్తోమత లేక కడుపేదరికం అనుభవించేవారు కూడా ఈ ప్రాంతంలో ఎక్కవ మంది వుండే వారు. చదువు కోవాలంటే ఇతర జిల్లాలకు వెళ్లి ఎన్నో వ్యయప్ర యాసాలు పడేవారు. ప్రజల కష్టాలు, సమస్యలు తీరాలంటే ఈ ప్రాంతం ప్రజలకు అక్షర జ్ఞానం అవసరమని భావిం చారు. పేద విద్యార్థులకు ఉచిత బోజనంతో పాటు విద్యను కూడా అందించాలనే ఉద్దేశంతో పాళెం దొరస్వామినాయుడు మద్రాసు టీచర్లుతో విద్యాబోదన విద్యార్థులకు అందించాడానికి శ్రీకారం చుట్టారు. చిత్తూరు జిల్లా బంగారు పాళెంకు చెందిన దొరస్వామినాయుడు కుటుం బీకులు18వ శాతాబ్దంలో కడప పట్టణంలో స్థిరపడ్డారు. పాళెం దొరస్వామి నాయుడు న్యాయవాదిగా విధులు నిర్వహిస్తు పులివెందుల పట్టణంలో స్థిరపడ్డారు. రాయచోటి తాలుకా బోర్డు ప్రసిడెంట్‌గా ఎన్నికయ్యారు. పులివెందుల ప్రాంతం కూడా రాయచోటి తాలుకాలో వుండేది. బొగ్గుడుపల్లె గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి అనే రైతు కేసు కూడా ఈయన వాదించారు. ఆయన కుటుంబీకులు మొట్టమొదటగా మద్రాసులో వుండేవారు. అక్కడ వారికి చాలా విలువైన ఆస్థులు కలిగి ఉండేవి. పులివెందుల పట్టణంలో బ్రిటిస్ కాలంలో కచ్చేరి ఉండేది. కచ్చేరి 1909లో (కోర్టు)ను నూతన భవనంలోకి మార్పు చేస్తు ప్రభుత్వం చెపట్టింది. పాత కచ్చేరిని వేలం పాటలో పాళెం దొరస్వామినాయుడు తన సొంతం చేసుకొని ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరుకు విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఒక పాఠశాలను నిర్మించారు. పై చదువులకు 20 ఎకరాలు కొనుగొలు చేసి అక్కడ పెద్ద హైస్కూల్‌గా ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉచిత బోజన ఏర్పాటు చేసి మద్రాసు నుంచి టీచర్లును పిలిపించి వారికి జీతాలు ఇస్తూ ఉచిత భోజన వసతి కల్పించారు. తన ఆస్థి అంతా పాఠశాల నిర్మాణ కోసం, ఉచిత భోజనాలు కోసం వెచ్చించారు. గత కొన్ని రోజులకు పాఠశాల నిర్వహించలేని స్థితిలో తన భార్య రుక్మిణి మెడలోని మంగళ సూత్రాన్ని అమ్మి పేద విద్యార్థులకు కడుపు నింపారు. పరిస్థతులు బాగా లేక పాఠశాల పూర్తి స్థాయిలో నడపలేని స్థితిలో వివిధ గ్రామాలకు వెళ్లి యాచన కూడా చేశారు. చివరకు 1926 డిసెంబర్ 31న మద్రాస్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో హైస్కూల్ బాధ్యతలు ప్రభుత్వం పరం చేసి అక్కడే తుది శ్వాస విడిచిన మహనీయుడు పాళెం దొరస్వామి నాయుడు. ప్రతి సంవ్సతరం డిసెంబర్ 31న పాళెం దొరస్వామినాయుడు చిత్రపటాన్ని ఎద్దులబండిపై ఊరేగించేవారు. ఆయన చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో పూజించి టెంకాయాలు కొట్టి జెజేలే పలికేవారు. పాళెం దొరస్వామినాయుడు జీవత చరిత్రను కూడా బురక్రథ రూపంలో ప్రజలకు తెలియచేశావారు. దొరస్వామానాయుడు స్థాపించన పాఠశాల్లో ఎంతోమంది చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించారు. దొరస్వామి నాయుడు కుమారుడు పాళెం రామభద్రయ్యనాయుడు కూడా న్యాయ వాదిగా వుంటూ రాయచోటి తాలుకా బోర్డు ప్రసిడెంట్‌గా ఎన్నికయ్యారు. తండ్రి ఆశయనికి అనుగుణంగా ఎన్నో ప్రజోపకార్యాలు చేసి చూపించారు. దొరస్వామినాయుడు స్థాపించిన పెద్ద హైస్కూల్ నుందు ఒక సాదారణ గుమస్తాగా విధులు నిర్వహించారు. దొరస్వామి నాయుడు కుటుంబీకులు ఇప్పటికీ పులివెందుల పట్టణంలోని జెండామాన్ వీధిలో నివాసం ఉంటున్నారు. ఆయన మనవళ్లు, మనవరాళ్లు కూడా పోలీసు, విద్యాశాఖలో పని చేస్తున్నారు.



'గాంధీ'కి ప్రొద్దుటూరుతో అనుబంధం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

సత్యం, ధర్మం, అహింస, శాంతితో ముంద డుగు వేసి ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమాన్ని రగిల్చి తెల్లదొరల పాలన నుంచి దేశాన్ని విముక్తి చేసిన మహాత్ముడు గాంధీ. ఆయనకు మన జిల్లాలోని ప్రొద్దుటూరుతో విడదీయరాని అనుబంధం ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో దేశ పర్యటనలో భాగంగా 1929 మే 17న ప్రొద్దుటూరుకి విచ్చేశారు. రెండు రోజుల పాటు ఇక్కడ పర్యటించి ప్రజలతో మమేకమై అనుబంధాన్ని బలప రచుకున్నారు. ఆ రోజు రాత్రి 11గంటలకు ప్రొద్దుటూరులోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం చేరుకొని జాతీయ స్వచ్ఛంద సంస్థ, మితకారి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. శివాలయం వీధిలో ఉన్న చిన్నశెట్టిపల్లి గ్రామానికి చెందిన మెట్టుపల్లి కొండారెడ్డి ఇంట్లో (ప్రస్తుత బివిఎస్ థియేటర్ ఎదురుగా ఉన్న వాణిజ్య సదుపాయం) రాత్రి బస చేశారు. మరుసటి రోజు ప్రొద్దుటూరులో పర్యటించారు. విజయనగరం వీధికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాతంత్రోద్యమ సంగ్రామంపై మాట్లాడారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పట్లో ఆర్యవైశ్య సంఘం అప్పట్లో రూ.316 విలువచేసే బంగారు కానుకలను మహాత్ముడికి అందచేశారు. ప్రజల నుంచి రూ.1730 విరాళాన్ని స్వీకరించారు. విదేశీవస్త్ర భహిష్కరణ, మద్యపాన నిషేధం,అస్పృశ్యత, హిందూ, ముస్లిముల సమైక్యత, స్వాతంత్ర్యం సాధించే పోరాటంపై ప్రజల్లో చైతన్య స్పూర్తిని నింపి ఉత్తేజంగా మాట్లాడారు. స్వచ్ఛంధ సేవకులు సుబ్బరా మయ్య సంచార కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మహాత్ముడి వ్యక్తిగత బాధ్యతను దేవభక్త కొండా వెంకటప్పయ్య వహించారు. గాంధీ నడయాడిన మార్గంలో హోమస్‌పేట -నెహ్రూరోడ్డుకు వెళ్లే కూడలిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని అప్పటి రాష్ట్ర ఆర్థిక మంత్రి రోశయ్య 2005 జనవరి 30న ఆవిష్కరించారు. 2011 అక్టోబర్ 2 వ తేదీన సీనియర్ న్యాయవాది ముడిమేల కొండారెడ్డి చారిత్రాత్మక ప్రదేశంలో శిలాస్థూపాన్ని ఆవిష్కరించారు. 2014 నుంచి అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ మే 17న 'గాంధీ మార్గం-శాంతి యాత్ర' నిర్వహించి స్పూర్తిని నింపుతున్నారు.



పత్రికా రంగం - సుందరయ్య

విజయవాడలో ప్రస్తుతమున్న విశాలాంధ్ర భవన నిర్మాణం జరిగే సందర్భంగా ఆ ప్రాంతానికి 'సుందరయ్య నగర్' అని నామకరణం చేయాలని అప్పటి పార్టీ విజయవాడ నగర కమిటీ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ననుసరించి ఆయన పేరుతో ఒక బోర్డు పెట్టి ఆ సందర్భంగా జరిగిన సభలో నాయకులు ప్రసంగించారు. ఆ వార్తను 'సుందరయ్య నగర్ ప్రారంభోత్సవం' శీర్షికతో విశాలాంధ్రలో ప్రచురించారు. ఆ వార్త పేపరులో పడిన సాయంత్రమే సుందరయ్య ఎక్కణ్ణుంచో విజయవాడ వచ్చారు. పత్రికలో ఆ వార్త చూసి ఆయనెంతో చికాకు పడ్డారు. తతిమ్మా ఎడిషన్లలో ఆ వార్త ప్రచురించవద్దని ఆయన సంపాదకవర్గాన్ని కోరారు. తర్వాత తన పేరుతో ఏర్పాటు చేసిన బోర్డును కూడా తీసివేయించారు. ఆ విధంగా ఆయన వ్యక్తి ఆరాధనాతత్వాన్ని వ్యతిరేకించి ఆనాడే తన విలక్షణమైన వ్యక్తిత్వాన్ని నిరూపించుకున్నారు. జనశక్తి దినపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా జరిగే సభ అది. హాజరైన జనం 'సుందరయ్య జిందాబాద్' అని నినాదాలు చేస్తుంటే ఆయన వారిని వారించారు. అలాంటి నినాదాలు తనకు నచ్చవనీ, తాను చనిపోయేంతవరకూ కమ్యూనిస్టుగా ఉండి విధి నిర్వహణలో మృతి చెందినప్పుడే అలాంటి పొగడ్తలు కురిపించవచ్చుగానీ.. తాను జీవించి ఉండగా జిందాబాద్ నినాదాలు ఇవ్వొద్దని ఆయన నిర్బంధంగా చెప్పారు. అలాగే తన పేరిట విగ్రహాలను వేయడాన్ని కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టేవారు. విగ్రహాలకు బదులుగా గ్రంథాలయాల వంటివాటిని స్థాపించి ప్రజల్లో చైతన్య, విజ్ఞాన కాంతులను ప్రసరింపచేయాలని కోరేవారు.



సుందరయ్యకు ఓసారి పెద్ద జబ్బు చేసింది. ఆయన మాస్కోకు చికిత్సకు వెళ్లేముందు మద్రాసు ఆసుపత్రిలో ఉంటున్న ఆయనను పరామర్శించి వీడ్కోలు చెప్పేందుకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మద్రాసు వెళ్లారు. మీరు ఆరోగ్యంతో తిరిగి రావాలని తాను ఆంకాంక్షిస్తున్నాననీ, అయితే ఈ సందర్భంగా మీ కోరిక ఏమిటనీ సుందరయ్యను ప్రశ్నించారు. దీనికాయన తనకెలాంటి సదుపాయాలూ సమకూర్చవద్దనీ, తెలంగాణా పోరాటంలో పాల్గొని ఇంకా జైళ్లలో మగ్గుతున్న కమ్యూనిస్టులను విడుదల చేస్తే సంతోషించగలననీ చెప్పారు. ఈ విషయమై ఎంతోకాలంగా విన్నపాలు పంపినా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సుందరయ్య కోరిక మేరకు ఆనాటికి జైళ్లలో ఉన్న తెలంగాణా పోరాట యోధులందరినీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలంగాణా వీరుడు నల్లా నరసింహులు తన ఆత్మకథలో రాసుకున్నారు.

సుందరయ్య మాస్కోలో చికిత్స పొందుతున్న సందర్భంలో జనశక్తి పత్రికలో.. ఆసుపత్రిలో ఉన్న సుందరయ్యను సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుస్లోవ్ వచ్చి పరామర్శించారనే వార్త వచ్చింది. ఈ వార్తను సుందరయ్య మాస్కోలో చూశారు. వెంటనే అప్పటి జనశక్తి సంపాదక బాధ్యతలు చూస్తున్న బొమ్మారెడ్డికి సుందరయ్య మాస్కో నుంచి ఓ ఉత్తరం రాశారు. 'నేనుగానీ, లీలగానీ ఈ వార్తను పంపలేదు. ఇక్కడ డాక్టర్లు తదితరులు నన్ను శ్రద్ధగా చూస్తున్నారనేది వాస్తవమే. కానీ సుస్లోవ్ వచ్చి నన్ను పరామర్శించారన్నది నిజంకాదు. ఆ వార్త మీకెలా వచ్చిందో. అది సున్నితమైన అంశమిది. మన పత్రికలో ఆ పొరబాటును సరిదిద్దండి' అని ఉత్తరంలో రాశారు. సుస్లోవ్ అంతటి గొప్ప నాయకుడు తనను పరామర్శించడానికి వచ్చినా.. ఆనాటి రాజకీయ పరిస్థితి దృష్ట్యా నిర్మొహమాటంగా ఆ వార్తను సరిచేయమనడం సుందరయ్య సున్నిత రాజకీయ దృక్పథానికి చిహ్నం. ఆయన అనారోగ్యంతో ఉన్నా అదే ఉత్తరంలో.. ఇక్కడ కామ్రేడ్స్ పరిస్థితి గురించి సవివరంగా తెలుపాల్సిందిగా రాయడం విశేషం. సుందరయ్య క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించేవారు. ఓసారి ప్రజాశక్తిలో పనిచేసేవారిలో అకస్మాత్తుగా నలుగురు సబెడిటర్లు జబ్బు పడ్డారు. ఆ సమయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న బొమ్మారెడ్డి వద్దకు సుందరయ్య వచ్చి.. అస్వస్థత చెందిన సబెడిటర్లు తిరిగి పనిలోకి వచ్చేంతవరకూ రచయితలుగా ఉన్న నలుగురిని నేను పంపుతాను. అందుకు నీవు అంగీకారం తెలుపుతావా? అని అనుమతి కోరారు. నిజంగా ఆయన స్థానమేమిటీ, నా స్థానమేమిటీ అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్న తన అంగీకారాన్ని కోరడం సుందరయ్య క్రమశిక్షణకూ, నమ్రతకూ ప్రబల నిదర్శనమని బొమ్మారెడ్డి తన స్వీయ గ్రంథం 'జ్ఞాపకాలు-అనుభవాలు'లో పేర్కొన్నారు. ◆

పవిత్ర పుణ్య క్షేత్రం ముక్తి రామేశ్వరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణంలోని పావన పినాకిని నదీ తీరంలోని ప్రసిద్ధ క్షేత్రమే ముక్తి రామేశ్వరం. ఈ క్షేత్రంలో శ్రీరాముల ప్రతిష్ఠించిన ఇసుకతో శివలింగంను ప్రతిష్ఠించారు. ఈ ప్రాంతానికి రామేశ్వరమని మార్జాల రూపానగల రావణుని రాముడు తన బాణాలచేత వదించి ముక్తి ప్రసా దించాడు. అప్పటి నుంచి ఈ ప్రాంతమునకు ముక్తిరామేశ్వరమని పేరువచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. రావణరథ అనంతరం తనకు అపాధితమైన బ్రాహ్మత్య దోషనివారణకు రాముడు ఈ ప్రాంతంలో శివలింగం ప్రతిష్ట చేయసం కల్పించారు. రాముని ఆగ్నని ఆంజనే యులు కాశి నుండి శివలింగం తీసుకొని రావ డానికి వెళ్లినట్లు పురాణాలు చెబుతున్నాయి. ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపో వడం వల్ల శ్రీరామచంద్రుల వారు 'సైకత లింగం' (ఇసుకతో) ప్రతిష్ఠించారు. తరువాత ఆంజనేయుడువచ్చి తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పట్టుబట్టాడు. శ్రీరాములవారు ఆంజనేయస్వామిని శాంతింపచేసి ఆయన తెచ్చిన శివలింగాన్ని సైకత లింగానికి కొద్ది దూరం అభిముఖంగా ప్రతిష్ఠించారు. ముక్తి రామలింగేశ్వరస్వామి దేవాలయానికి ఎదురుగా ఈనాడు స్వామి హనుమత్ లింగేశ్వరస్వామి గాను ప్రసిద్ధికెక్కింది. ఈ ఆలయ ఎత్తైనప్రకార గోడలతో రెండు ద్వారాలు కలిగి ఉన్నది. ఐదు అంతస్థులు గల ఈ గోపురం నెమలి వాహ నంపై కుమారస్వామి, దుర్గాదేవి, నిత్య గణపతి, గరుడ, విష్ణువు, లక్ష్మి, కాలియ మర్ధ మడిగా కృష్ణుడు కూర్చున్న భంగిమలో శివపార్వతులు, గోపిక వస్త్రాపహరునిగా కృష్ణుడు శృంగార శిల్పాలతో రమణీయంగా ఉంది. గోపురం నలు వైపులా కూర్చొని ఉన్న నందీశ్వర, శిల్పాలతో శోభయామానంగా ఉంది. ఈ గోపు రం శ్రీకృష్ణ దేవరాయలు కట్టించినట్లు గుడి లోని శాసనాల ద్వారా తెలియుచున్నది. శ్రీరామచంద్రులు సైకత లింగమును పొద్దు పొడవకమునుపే ప్రతిష్ఠిం చినందువల్ల ఈ పట్టణమునకు ప్రొద్దు టూరు అను నామధే యం కలిగిందని పురా ణాలు చెబుతున్నాయి. కొందరు శ్రీరామ చంద్రులు ప్రతిష్ఠించిన సైకత లింగంపై వారి వేళ్ల గుర్తులు రంధ్రములుగా మనం చూడ వచ్చు. ముఖమం డపం నుంచి విగ్రహం కలదు. గర్భగుడిపై గల విమానం నిర్మించారు. ఈ పద్ద తిలో మూడు అంతస్తులు కలిగి ఉన్నది. శిఖ రంపై కలిశం ఉంది. ఈ రామలింగేశ్వర ఆల యం పక్కన శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం కలదు. ఈ ఆలయం లో శ్రీ రాజరాజేశ్వరిదేవి, శ్రీ ఆదిశంకర ఆచార్యులచే ప్రతిష్ఠిం చబడిన 'శ్రీ చక్రయంత్రం' కలదు. ఈ చక్రయంత్రం చాలా ప్రశస్తమైనది. ఈ యంత్రమునకు 'మనో వాంఛాయ కలసిద్ధి రస్తు' అను ప్రతితీ. ఈ యంత్ర మహిమ వల్ల ప్రొద్దుటూరు పట్టణము అన్ని రంగముల యందు సర్వతో ముఖాభివృద్ధి పొందిఉన్నదని ప్రతితీ. ఇచ్చట భక్తులు అమ్మ వారు శ్రీ చండీ మాతకు పూజలు చేయుట వలన శరీరంలో గాలి, ఇతర పీడలు పొవునని ప్రతితీ. సంతానం లేని వారు శ్రీ రాజ రాజేశ్వ రిదేవిని సేవించిన ఎడల సంతానవంతులు కాగల రని ప్రతితీ. శ్రీ రాజరాజేశ్వరి ఆలయం పక్కన నవగ్రహ మండపం కలదు. మండపం ఎదు రుగా రెండు వైపులా మెట్టు అమర్చబడిన కోనేరు కలదు. ఈ కోనేటి గోడలపై ఒకే శిరస్సు గల రెండు హంసలు వెన్న చిలుకుతున్న యువ తులు ఒక శృంగార భంగిమ చిత్రములు చెక్క బడ్డాయి. దేవాలయం లోపలి వైపున ప్రకారం మొత్తం స్తంభాలతో అలం కరించ బడిన మండపములు. ముఖద్వారానికి ఎదు రుగా ధ్వజస్తంభం, బలిపీఠం దానికి అభి ము ఖంగా ఒక కళ్యాణమండపం దేవాలయానికి ఎడమ వైపున ఎత్తైన వేదికపై దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాములు కొలువు తీరి ప్రజలు దర్శించు కొనుటకు పెద్ద వేదిక కలదు. మరియు హెూమ మండపం ఆనాడు నిర్మించారు.



శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించిన ముక్తిరామలింగేశ్వర స్వామి దేవాలయ గోపురం

ఆధునీకరణ : పురాణ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కొందరు దాతలు, దేవాలయ చైర్మన్ బుశెట్టి రాజశేఖర్ సేకరించిన నిధులతో గర్భగుడిని ఆధునీకరణ చేశారు. రూ.14 లక్షలతో మైసూరు నుంచి రథోత్సవాన్ని తీసుకొని వచ్చారు. ఆధునీకరణలో భాగంగా శివలింగ గర్భగుడికి చుట్టు అనేక దేవతల గోపు రాలను నిర్మించారు.

గండికోట అందాలు చూడతరమా...!




ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

జిల్లాలోని జమ్మలమడుగు మండలానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న గండికోట అందాలు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మాటల్లో చెప్పలేని, వర్ణించడానికి పదాలు లేని వందల ఏళ్ల గత చరిత్రకు సజీవ సాక్ష్యం మన గండికోట పర్యాటక ప్రాంతం. కన్నులతో చూస్తే గాని అద్భుతం అనిపించే చారిత్రక వైభవం, ప్రకతి మనోహరం, పెన్నా నది ప్రవాహ విశేషాలు గండికోటకే సొంతం. జిల్లాలోనే పర్యాటక ప్రాంతాల్లో గండికోటకు ప్రథమ స్థానం ఉందనడంలో అతిశయోక్తి కాదేమో అందుకే అమెరికాలోని గ్రాండ్ కాన్యాన్‌తో పోల్చి ఇండియన్ గ్రాండ్ కెన్యాన్‌గా పిలుస్తున్నారు. ప్రపంచంలో అత్యంత అరుదైన అద్భుతమైన ప్రదేశంగా అమెరికాలోని గ్రాండ్ క్యానియన్‌ను పేర్కొంటారు. కానీ అంతకు మించిన విశేషాలతో ప్రకతి సహజమైన అందాలకు, వెయ్యేళ్ల చరిత్రకు అద్దం పట్టే కట్టడాలు గండికోట కే సొంతం అనేలా ఉన్నాయి. గ్రాండ్ క్యానియన్ కంటే గొప్పదిగా గండికోటను విదేశీ యాత్రికులు పేర్కొనడం విశేషం. ఎర్రమల పర్వత శ్రేణినే గండికోట కొండలు అంటారు. ఎర్రమల పర్వత పాదంలో ప్రవహించే పెన్నానది కొండను రెండుగా గండికొట్టి ప్రవహిస్తున్నది కనుక ఆ ప్రాంతంలోని కోటను గండికోటగా పేరు వచ్చింది. ఈ లోయల్లో నది వెడల్పు 300 అడుగులకు మించదు. కోట ముఖద్వారానికి ఎత్తయిన ఇనుప రేకు తాపడంతో చేసిన కొయ్య తలుపులు, కోట ప్రాకారం ఎర్రటి, నున్నటి బరువైన శానపు రాళ్లతో నిర్మితమై కొండ రాతిపై పునాదులు లేకుండా గోడలు నిర్మించారు.

చరిత్రలోకి వెళ్తే..

గండికోట చరిత్ర కడప కైఫియత్తు ప్రకారం ఈ కోటను 1123లో కాకరాజు నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని రేనాడుగా పిలిచేవారు. చాళక్య ప్రభువు త్రైలోక్య అల్లుడి ప్రతినిధిగా ములికినాటి సీమ అయిన ఈ ప్రాంతాన్ని కాక రాజు నిర్మించారు. ఏడు ఎనిమిది దశాబ్దాల పాటు కళ్యాణి చాళుక్యుల అధీనంలోను ఉన్న ఈ కోట ఆ తర్వాత కాకతీయుల పాలనలోకి వెళ్ళింది. కాకతీయ ప్రభువు గణపతి దేవ చక్రవర్తి, కాయపు వంశీయుడు గంగయ సాహిణినీ ఈ కోటకు పాలకులుగా నియమించారు. అనంతరం జెమ్మిగ దేవుడు, త్రిపురారి దేవుడు, అంబదేవుడు, రెండవ త్రిపురారి దేవుడు కాకతీయుల ప్రతినిధులుగా గండికోటను పాలించారు. కాయపు వంశీయులు ఈ కోటను వందేళ్లకు పైగా అంటే 1304 వరకు పాలించారు. తర్వాత మూడు శతాబ్దాలపాటు శ్రీ కష్ణ దేవరాయలు, అచ్యుత రాయలు, సదాశివరాయల ప్రతినిధులు గండికోటను పాలించారు. అనంతరం కొంతకాలం మహమ్మద్ కులీ కుతుబ్ షా ప్రతినిధి మీర్ జుమ్లా పాలించాడు.

గండికోటలోకి అడుగుపెట్టగానే మూడు అంతస్తుల కావలి మండపం కనిపిస్తుంది. ఒకప్పుడు పై అంతస్తులో సైనికులు కాపలా కాస్తూ శత్రువులను దూరంలోనే గమనించేవారు. కావలి మండపం పక్కనే ఆనాటి నిర్మాణ ప్రత్యేకతను చాటుతున్న కారాగారం మనలను ఆకర్షిస్తుంది. లోనికి వెళ్లేందుకు రెండు, మూడు ద్వారాలు లోపల గదులు, కిటికీలతో కారాగార నిర్మాణం పటిష్టంగా కనిపిస్తుంది.



గండికోటలో జామియా మసీదు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. మూడు ప్రవేశ ద్వారాలతో ఇరాన్, భారతీయ శిల్ప కళ, నిర్మాణ నైపుణ్యంతో తూర్పు వైపు ముఖం ఉండేలా నిర్మించిన ఈ మసీదులో విశాలమైన ప్రార్థనా ప్రాంగణం ఉంది.

జుమ్మా మసీదు పక్కనే ఉత్తరం వైపున ధాన్యాగారం ఉంది. ఎత్తైన ఈ భవన నిర్మాణమే ప్రత్యేకంగా కనిపిస్తుంది. కరువు కాటకాలు, ప్రకతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ధన్యాగారంలో 100 అడుగుల ఎత్తు గా ధాన్యం నిల్వ ఉంచే వారు. బయటి నుంచే ధాన్యాన్ని తీసుకునేందుకు గల ఏర్పాట్లు నేటి తరం వారిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

జుమ్మా మసీదు ఎదురుగా విశాలమైన కోనేరు ఉంది. దీనికి భూగర్భ కాలువ ద్వారా నీటి సరఫరా ఉండేదని తెలుస్తుంది. సైనికులు యుద్ధం తర్వాత ఆ కత్తులను ఈ కోనేటిలో కడిగే వారని, ఫలితంగా నీరు ఎర్రగా మారేదని అందుకే ఈ కోనేటి నీ ఎర్ర కోనేరు లేదా కత్తుల కోనేరు గా పేర్కొంటారని తెలుస్తుంది.

గండికోట వైభవం చాటేలా ఉత్సవాలు...

ఇంతటి ఘన చరిత్ర, గత వైభవాలను తనలో ఇముడ్చుకున్న గండికోటను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకంగా నాలుగు సార్లు గండికోటలో వారసత్వ ఉత్సవాలు నిర్వహించి ప్రపంచానికి కోట చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకున్నారు. వీటితోపాటు గండికోటలో సుమారు 30 కోట్లు అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

రెండోసారి 2017 ఫిబ్రవరి 18, 19 తేదీల్లో వారసత్వ ఉత్సవాలు నిర్వహించారు. అప్పటి కలెక్టర్ కె.వి. సత్యనారాయణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఉత్సవాలు నిర్వహించారు.

మూడో సారి 2018 జనవరి 21, 22, 23 తేదీల్లో జరిగాయి. అప్పటి కలెక్టర్ బాబూరావునాయుడు, సంయుక్త కలెక్టర్ శ్వేతా దగ్గరుండి పనులు పరిశీలించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సంబరాలు జరుపుకునేలా చర్యలు తీసుకున్నారు సుమారు రెండు కోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టారు. 10 వేల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు.

నాలుగవ సారి 2019 ఫిబ్రవరి 9, 10 తేదీల్లో ఘనంగా వారసత్వ ఉత్సవాలను జిల్లా కలెక్టర్ హరికిరణ్ నిర్వహించి కోట విశిష్టతను చాటి చెప్పారు. సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులను రప్పించి ప్రదర్శనలు జరిపారు. కళాజాతలు నిర్వహించి ఈ పండుగ వాతావరణం తీసుకువచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా 2020 లో వారసత్వ ఉత్సవాలు కలెక్టర్ హరికిరణ్ ఆధ్వర్యంలో జరిగాయి. తరువాత కరోనా నేపథ్యంలో ఉత్సవాలు జరగలేదని విషయం తెలిసిందే.

పెన్నాలోయ వద్ద సుమారు రూ.7 కోట్లతో రోప్ వే పనులకు శంకుస్థాపన చేశారు. గండికోటలో రాపెల్లింగ్, జుమ్మా రింగ్, కాయ కింగ్, బోటింగ్, పారా మోటోరింగ్ తదితర సాహసకత్యాల క్రీడలు కూడా అందుబాటులో ఉన్నవి. పర్యాటక ప్రాంతం, వారసత్వ కట్టడమైన గండికోటలో సాహసకత్యం వారోత్సవాలను సాగిస్తూ నవతరానికి తెలిపే ప్రయత్నం లో యువతను భాగస్వామ్యం చేస్తూ అలనాటి ప్రాభవ వైభవాలకు ఆలవాలంగా నిలిచిన ఈ ప్రాంతంలో వారసత్వ వికాసాన్ని తెలిపేందుకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

సమస్యలు పరిష్కరిస్తే మరింత పర్యాటకం

గండికోట ప్రపంచ పర్యాటక కేంద్రాలలో ఒకటి కావడం వల్ల ఇక్కడికి శుక్రవారం రాత్రి నుంచి శని, ఆదివారాలలో వేల సంఖ్యలో రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకుల తాకిడి అధికంగా ఉంది. ఎంతో ఉత్సాహంతో వచ్చిన పర్యాటకులకు గండికోట లోపల ఉన్న రహదారిని ఇతర మౌలిక వసతుల కల్పన లోపం చూసి పెదవి విరుస్తున్నారు. పర్యాటకులు కోటలోపల చూసేందుకు చార్మినార్, జైలు, మాధవరాయస్వామి దేవాలయం, కత్తుల కోనేరు, జుమ్మా మసీదు,ధాన్యాగారం, రంగనాథస్వామి దేవాలయం, రాణి మహల్ వంటి అనేక చూడదగ్గ ప్రదేశాలతో పాటు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అమెరికా గ్రాండ్ కాన్యన్ లాంటి పెన్నాలోయకు వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయాలు లేవు. పెద్దరాళ్లు, కంప చెట్లను దాటుకుని వెళ్లాలి. దీంతో పర్యాటకులు ఎక్కడ చూసినా కంపచెట్లు దర్శనమిస్తున్నాయని, పెన్నాలోయను చూసే క్రమంలో కింద పడేందుకు అధికంగా అవకాశం ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలో ప్రాణాలు వదలాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతి పర్యాటకులలో ధనవంతులే కాక పేద,మధ్య తరగతి వారు కూడా వుంటారు. అలాంటివారికి దాహం వేస్తే గుక్కెడు నీరు తాగేందుకు కోటలోపల మొత్తం జుమ్మా మసీదు వద్ద తప్ప ఇతర ఏ ప్రదేశాలలో కూడా మంచినీటి సదుపాయం లేదు. కనీసం ఐదారు ప్రదేశాలలో అయినా స్వచ్ఛమైన నీటిని ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. చెత్తాచెదారం వేసేందుకు సరైన చెత్తకుండీలు లేవు దాల్మియా వారు ఏర్పాటుచేసిన చెత్త కుండీలు ఎందుకు పనికిరావు . వాటి స్థానంలో కొత్త వాటిని, పెద్ద చెత్తకుండీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలి. గండికోటను 2019 నుంచి 2022 వరకు మూడు సంవత్సరాల పాటు దాల్మియా పరిశ్రమ యాజమాన్యం దత్తత తీసుకోవడం జరిగింది. అయితే అక్కడ ఎలాంటి అభివద్ధి పనులు కానీ మౌలిక వసతులు కల్పించడంలో గాని సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమైంది. అందుకు కొంతమంది పేరుకే నా దాల్మియా వారు గండికోటను దత్తత తీసుకుంది మౌలిక వసతుల కల్పనలో స్తబ్దత కనబరుస్తుందని అధికారులు చెబుతున్నారు. కోటను శుభ్రంగా ఉంచడానికి మరియు పర్యవేక్షించడానికి అటు పురావస్తు శాఖ నుంచి కానీ, ఇటు పర్యాటక శాఖ నుంచి కానీ సిబ్బంది,సెక్యూరిటీ లేకపోవడం కోట పట్ల నిర్లక్ష్యం ఏపాటికి ఉందో అర్థం చేసుకోవచ్చు. పురావస్తు శాఖ తరపున కేవలం ముగ్గురు మాత్రమే సిబ్బంది ఉన్నారు. అందులో ఒకరు దానవులపాడు చూసేందుకు వెళ్లగా ఉన్న ఇద్దరూ ఇంత పెద్ద కోట చూసేందుకు సమయం సరిపోవడం లేదని అక్కడి సిబ్బందంటూన్నారు. కావున ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా కలెక్టర్ మరియు ఆ శాఖ అధికారులు గండికోట అభివద్ధి చేసే దిశలో మరియు ఇక్కడి వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.



నిజాం ఆంక్షలను అధిగమించి 'గోల్కొండ' పత్రిక ప్రారంభం

తెలంగాణా ప్రాంతంలో తొలి దినపత్రికను స్థాపించి, నిర్వహించిన ఘనత సురవరం ప్రతాపరెడ్డిగారిదే. ఈనాటి పరిశోధకులకు "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" అనే ఆధార గ్రంథాన్ని రచించిన ప్రముఖ చరిత్రకారుడాయన. మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ తాలూకా ఇటికలపూడి గ్రామంలో 1896లో ఆయన జన్మించారు. కర్నూలు, మద్రాసులో విద్యాభ్యాసం చేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆనాటి నిజాం ప్రభుత్వం పెట్టిన ఆంక్షలను అధిగమించి 1929 మే 10వ తేదీన గోల్కండ పత్రికను ప్రారంభించారు. తొలుత ఆయన 'ఆంధ్ర' అనే పేరుతో పత్రికను స్థాపించడానికి ప్రయత్నించగా నిజాం ప్రభుత్వం నిరాకరించింది. విధిలేక 'గోల్కండ' పేరుతో పత్రికను ప్రారంభించారు. ఆ పత్రికద్వారా ఆనాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజలను చైతన్యం చేయడానికి కృషి చేశారు.

వారానికి రెండుసార్లు వెలువడే 'గోల్కండ' పత్రిక కొంతకాలానికి దినపత్రికగా మారింది. తన పత్రికద్వారా ప్రతాపరెడ్డి నిజాం రాష్ట్రంలో ఆంధ్రోద్యమ ఉధృతికి జీవితాన్ని అర్పించారు. అంతకుముందున్న 'ఆంధ్ర జనసంఘం"కు "ఆంధ్ర మహాసభ" అనే పేరును పెట్టింది ఆయనే. 1930 మార్చి 3వ తేదీన మెదక్‌జిల్లాలోని జోగిపేటలో జరిగిన మొట్టమొదటి ఆంధ్రమహాసభకు ప్రతాపరెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఆయనకు అండగా రాజాబహదూర్ వెంకటరామారావుగారు తోడ్పడేవారు. గోల్కండ పత్రికను 1948 వరకు నిర్వహించారు. ఆ తర్వాత కొంతకాలం నూకల నరోత్తమరెడ్డి సంపాదకత్వం వహించారు. ఆంధ్రోద్యమ ఆరంభం, విజయసాధనకు పరిపూర్ణ సాక్షి అయిన 'గోల్కండ' పత్రిక 41 ఏళ్ల అనంతరం 1966లో ఆగిపోయింది. ◆